# బుద్ధ చరిత

## "ధ మ్మ ప ద ము" తో

**ర చ యి త**

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

# బుద్ధ ఛరిత ధమ్మ పదము తో
# **Buddha Charita- Dammapadhamu**

{A Book of History & Teachings of Buddha}

by **Dr.Nanduri Ramakrishnamacharya**

ప్రథమ ముద్రణ : 1976 (1000 ప్రతులు )

డిజిటలీకరణ (Digitization) : 2026

డిజిటలీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు,
ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు,
కొండాపూర్,
హైదరాబాద్ -500084.
Cell -9440495887.
: 2. నండూరి విద్యారణ్య స్వామి ,
ప్లాట్ నం.:154,
స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ,
నిజాం పేట
హైదరాబాద్ -500090.
Cell -9391028231.

వెల : రూ.100/-.

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# విన్నపము

గౌతమ బుద్ధుని జీవితము - ప్రబోధము విశ్వ మానవ చరిత్రలో నెరపిన ప్రభావము నిరుపమానము. చిరస్మరణీయము.

జీవకారుణ్యమునకు బౌద్ధ మతము కల్పించిన ప్రాధాన్యము కాల పురుషుని కఠిన హృదయమును గూడ పులకరింపచేసినది.

మానవ జీవితము - అటు దివ్యత్వమునకు ఇటు దానవత్వమునకు మధ్య ఉయ్యాల ఊపు. మనిషిలోని దానవత్వము అణచివేసి దివ్యత్వమును పెంపొందించుటకు తన జీవితమును అంకితము చేసిన మహానుభావుడు బుద్ధభగవానుడు. భూతదయకు బుద్ధుడు కల్పించిన ప్రాముఖ్యము జగద్విదితము. అతడు మూర్తిభవించిన కరుణాశ్రీ.

ఈ "బుద్ధ చరితకు" - మూలాధారములు సంస్కృతములో అశ్వఘోషుడు వ్రాసిన బుద్ధచరితము-ఆంగ్లములో ఎడ్విను ఆర్నాల్డు వ్రాసిన- "ఆసియాజ్యోతి" అను గ్రంథములు. క్రీస్తుశకము ప్రథమ శతాబ్దికి చెందిన అశ్వఘోషుని కాలమునకే గౌతమ బుద్ధుని జీవితములోని సన్నివేశములలో-సత్యము - కవిత్వపు మేలిమిసుగు వేసికొని సాక్షాత్క రించుచుండుట చారిత్రక విద్వాంసులకు అనుభవ పునరుక్తము. పరిశోధకులైన చరిత్రకారులు ఈ మేలిమిసుగు మాటునన్ను నగ్న సత్యమును అన్వేషింపవచ్చును. దేశకాలపాత్రములనుబట్టి చీనా, టిబెట్టు జపాను కంబోడియా మున్నగు సీమలలో బౌద్ధమతములో ఏర్పడిన పరిణామ వికాస వికారములు వేత్తలకు అనారూఢ విషయములు గావు. కాలక్రమమున బౌద్ధము శాఖోపశాఖలై నది. గౌతమ బుద్ధుడు- బదికియున్నప్పుడు వ్రాసిన గ్రంథములు లేవు. మహాపరి నిర్వాణా నంతరము శిష్యులు చేసిన సంకలనములు అనేకము ఉన్నవి. అందు

ముఖ్యమైనది పాళీభాషలోనున్న "ధమ్మపదము" - సుత్తపిటకమందలి ఖుద్ధక నికాయములో అంతర్భాగము.

బౌద్ధవాఙ్మయమున ప్రాచీనతమమైన రచనలలో పేర్కొనదగిన- ధమ్మపదము-అర్వాచీనకాలమున బుద్ధగీతగ ప్రఖ్యాతి కెక్కినది. అందలి 423 శ్లోకములను- "యథాతథముగ"- తెలుగు చేసినాను. బుద్ధుని హృదయము ప్రతిఫలించు గ్రంథములలో ప్రథమమైనది ధమ్మపదముగాన బుద్ధచరితకు దానిని అపరిహార్యమైన అనుబంధముగా చేర్చినాను.

సమస్త కళలకు-లలిత కళలకు కఠిన హృదయమును కరగించు టయే ధ్యేయమైనచో - సర్వ మతములకు విశ్వశ్రేయమే ఆరాధ్యమైనచో బౌద్ధమతమునకు జీవనాడియైన

"అహింసా పరమో ధర్మః" అను సిద్ధాంతమునకు, బోధిసత్త్వుల అవతరణమునకు ఆద్యప్రకృతియైన

"పరోపకారార్థమిదం శరీరమ్" అను సూత్రమునకు నేటికిగూడ కాలదోషము పట్టలేదు.

అణుయుగము బౌద్ధసూత్రములను వల్లెవేసి కంఠస్థము చేయక పోవచ్చును గాని గౌతమబుద్ధుని సందేశసారమును ఆచరణములోనికి అనువదింపవలసియున్నది. లేనిచో కృతక ప్రళయము భూగోళమునే భస్మీపటలము చేయవచ్చును. ఈ చిరుపొత్తమును చదివిన వారి హృదయములలో కారుణ్య సౌకుమార్య దీధితులు - లవలేశము - ప్రవేశించినచో - రచయితగా నా జన్మము ధన్యమైనదని భావింపగలను.

గాంధీజయంతి
2-10-1976``　　　　　　— నండూరి రామకృష్ణమాచార్య

# బుద్ధ చరిత్ర

హిమాలయ పర్వత పరంపరలమధ్య రోహిణీ నది తీరముననున్న కపిల వస్తు పురము రాజధానిగ శాక్య రాజ్యమును శుద్ధోదన మహారాజు పరిపాలించెను. అతని యగ్రమహిషి మాయాదేవి. ద్వితీయభార్య ప్రజావతి. ప్రజావతి కొక పుత్రిక కలిగెను. చాలకాలము వరకు శుద్ధోదన ప్రభువునకుఁ బుత్ర సంతానము కలుగలేదు. మాయాదేవి యొకనాడు శ్వేత మత్తేభము తన గర్భములోఁ బ్రవేశించి నట్టు కల గాంచెను. శుద్ధోదనుడు సిద్ధాంతుల రావించి, పట్టమహిషి స్వప్నమును వివరించెను. జ్యోతిష్కులా స్వప్నము పుత్రలాభమును సూచించుచున్న దాని నుడివిరి. శాక్య రాజ్య మంతయు సంతోషించెను.

మాయాదేవి గర్భవతి యయ్యెను. శుద్ధోదను డాసన్న ప్రసవయైన పట్టమహిషిని యథోచిత పరివారము దోడు నిచ్చి పుట్టినింటికి సాగనంపెను. మార్గమధ్యమున మాయాదేవి లుంబినీవనమున నొక సరోవర తీరమున విడిసెను. సహజ సౌందర్య విలసితమైన యా లుంబినీవనములో సరోవర తీరమున ఫలాశ వృక్షచ్ఛాయలో మాయాదేవి విశ్వకల్యాణ మూర్తియైన శిశువును ప్రసవించెను.

కపిలవస్తుపురమునఁ బుత్రోత్సవము వెల్లివిరిసెను. మంత్రులు రాజపరివారసమేతలై మత్తేభ యూథములతో జవనాశ్వబృందములతో లుంబినీవనమున కేగి రాజశిశువు నంతపురమునకుఁ గొనివచ్చిరి.

బారసాలకు శాక్యరాజ్య మండలి పండితులు సామంతులు మండలాధిపు లెందతో కపిలవస్తుపురి కరుగుదెంచిరి. శుద్ధోదన మహారాజునకుఁ గానుకలుగా మాణిక్యరాసులు మత్తేభ యూథ రథ తురగ కాంచనాంబరములు లభించెను. కావున రాజ పుత్రునకు

విప్రులు సర్వార్థసిద్ధుడని నామకరణము చేసిరి. ఆ నామధేయమే కాలక్రమమున సిద్ధార్థుడని రూపాంతరము నందెను.

శాక్యరాజ్యమును రక్షించుటకు యువరా జవతరించెనని ప్రజలు సంతోషించిరి. శుద్ధోదన మహారాజునకుఁ బుత్రోదయము శాక్యరాజ్యమునకు మహోదయము. ఆ మహోత్సవమున కరుదెంచిన యసితమహర్షి, యతిలోక కోమల నయనామృతులచేఁ బ్రపంచ చరిత్రలో నిత్యమహోదయము వెలయించిన యా రాజశిశువు నవలోకించి, యాతడు జగదుద్ధారకుఁడు కాగలఁడని శుద్ధోదను నభినందించి వీడ్కొని వెడలిపోయెను.

సిద్ధార్థుఁడు జన్మించిన సప్తమ దినముననే తల్లి మాయాదేవి కాలధర్మము నొందెను. పినతల్లి ప్రజావతీదేవి మిక్కిలి యనురాగముతో సిద్ధార్థుని పెంచసాగెను. తండ్రి సిద్ధార్థున కెనిమి దేండ్ల ప్రాయమున నుపనయనము కావించి విశ్వామిత్రుఁడను గురువున కప్పగించెను. అర్థ శాస్త్రము, రాజ్యాంగ తంత్రము నానావిధకళలు నేర్పుటకు సుప్రసిద్ధ పండితుల నేర్పరచెను. రాకుమారుడు ఖడ్గచాలనము, ధనుర్వేదము, రథగజతురగా రోహణము, వ్యూహతంత్రము మున్నగు క్షత్రియరాజ కుమారోచిత విద్యల నభ్యసించు చుండెను.

కోమలమనస్కుఁడైన సిద్ధార్థుని దయాస్వభావము చిన్నతనము నందే యభివ్యక్త మయ్యెను. అశ్వారోహణమున, రథచోదనమున, ఖడ్గచాలనమున జరుగు పోటీలలో విద్యార్థు లందఱు తమ యభినివేశమును జూపవలయును. ద్వంద యుద్ధమున దస్సిపోయిన ప్రత్యర్థినిగాంచి కరుణార్ద్ర హృదయుఁ డైన రాజసుతుడు తానే యోటమిని వరించెడివాఁడు. ఒకసారి ఆతడు తోటి రాకుమారులతో గుఱ్ఱపు పందెమున పాల్గొనెను. గురువులు, సామంతులు, రాజపరివారము, ప్రజలు పందెమును జూచు చుండిరి. రాజకుమారు లందఱు తమకమునఁ దమతమ గుఱ్ఱములఁ బరుగెత్తించిరి. సిద్ధార్థుని గుఱ్ఱమే యన్ని గుఱ్ఱములను మించి పరుగెత్తుచుండెను. కాని యతని జాలిగుండె యా గుఱ్ఱమున కంటె వేగతరముగ ముందునకుఁ బరుగెత్తినది. నోట నురగలు

గ్రమ్ముచు మన్ను మిన్ను గానక యురికి పరుగెత్తుచున్న గుఱ్ఱమును జూడగనే ఆతని గుండె కరిగి పోయినది. వెంటనే యతఁడు కళ్ళెమును సడలించి గుఱ్ఱమును దిగి, జాలు నివిరి, దాని యాయాసమును దీర్పసాగెను. ఆనాడే యువరాజు తన గెలుపును, యశస్సును రాజలీవిని భూతదయకుఁ గర్పూరహారతిగ సమర్పించి ధన్యుఁ డయ్యెను.

ఉద్యానవనమున నొకనాడు సిద్ధార్థుఁడు విహరించుచుండెను. పూల తావులఁ జిమ్ము కమ్మతెమ్మెరల నానుచు యువరాజు చంద్రకాంత శిలా వేదికిపై నాసీనుఁడైయుండెను. సిద్ధార్థుని దయానురాగరసపరిప్లుతమైన హృదయమే యానాటి నూత్న వసంత సాయం సంధ్యారాగ రించోళిలో విశ్వ సమ్మోహన రూపమునఁ బ్రతిఫలించెను. ఆమని మలి సంజ వెలుగుల నాకాశమున హంసలు గుంపులుగా నెగుర సాగినవి. ఆనంద పారవశ్యమున సిద్ధార్థుని ధ్యాన హృదయము నిదిధ్యాసలోఁ జిక్కినది. అంతలో వేదనా క్రేంకారముతో, రక్తసిక్తమైన రెక్కలతో నేలపైఁబడి యొక రాజహంస కొట్టుకొనుచుండెను. సమీపమునఁబడియున్న హంస మూలుగు చెలుగువిన్న రాజకుమారుడు మరుక్షణమున నా రాజహంసను, దన చిరు కౌగిటఁ జేర్చుకొనెను. పక్షి రెక్కలలో గ్రుచ్చుకొనిన వాడి బాణమును దీసి యీకల నిమిరి గాయమునకుఁ గట్టు కట్టెను. ఆకాశమున స్వేచ్ఛగా సంచరించు నా హంసపై బాణమును బ్రయోగించు దుర్బుద్ధి యెవరి కైనను నేల కలుగవలెను? అది మృగయా లాలసత కాబోలు! ఇతర ప్రాణికోటికి మృత్యువేదన కలిగించుటయే మానవులకు మధుర క్రీడా వినోదమా? భావనా వేగమున సిద్ధార్థుని గుండెలో నగ్ని పర్వతములు పెల్లుబుకఁ బ్రేల సాగినవి. కొంత బాధ యుపశమింప రాజహంస యువరాజు నొడిలో నాదిగి ముడుచుకొని విశ్రమించినది. హంస గాయ మచిరకాలముననే మానగలదు. కాని రాజపుత్రుని హృదయమున మానని గాయ మేర్పడినది. అప్పటినుండి అతని సుకుమార హృదయము విశ్వవేదనకు ప్రతికల్పుకొని సానుభూతితోఁ గొట్టుకొన సాగినది.

ఆ సమయమున ఆ యుద్యాన వనమున కొక పరిచారకుఁడు వచ్చి యా రాజహంస నివ్వవలెనని కోరెను. ఆ హంసను గొట్టినది దేవదత్తుడు. అతఁడే తన పరిచారకుని హంసకొఱకుఁ బంపెను. హంస నిచ్చుటకు సిద్ధార్థుడు నిరాకరించెను. దేవదత్తుఁడు శాక్య వంశ రాజపుత్రుఁడే. సోదర రాజకుమారుని కోరికను ద్రోసిపుచ్చుట కావంతయు యువరాజు వెనుకాడ లేదు. వేటాడిన పక్షిని మృగయుడు కోరుకొనుట సర్వజన వేద్యమైన ధర్మము. దేవదత్తునకు సిద్ధార్థుని నిరాకృతి యర్థము కాలేదు. ఆతడు రాజసభలో యువరాజుపై నభియోగమును దెచ్చెను. శుద్ధోదన మహారాజు నిండు పేరోలగమున నుండెను. శ్రుతి స్మృతి ధర్మనిర్ణేతలైన పండితులు, సామంతులు దండనాథులు ప్రకృతి జనముచే రాజసభ క్రిక్కిరిసియుండెను. దేవదత్తుని వాద మందరెరిగినదే! హంస రెక్కలో గ్రుచ్చుకొన్న బాణము చివర గల దేవదత్తనామాక్షరములు ప్రత్యక్షసాక్ష్యము. ఇంక లక్ష్యము మృగయుని జెందవలెను.

సిద్ధార్థుడు మందగంభీరస్వరమునఁ దన వాదమును రాజసభలో నివేదింప సాగెను. "రాజహంసను సంహరింపఁ దలచిన వాఁడు దేవదత్తుఁడు. గాయము మాన్పి సంరక్షించినవాఁడను నేను; హంస కతడు విరోధి. నేను హితుఁడను. విచారింపుడు, ఏ ప్రాణి నైనను జంపువాని కప్పగించుట ధర్మము కాదు. ప్రాణి, రక్షకునకుఁ జెందవలెను గాని ఘాతకునకుఁ జెందరాదు. ఇది మృగయా ధర్మమున కతీతమైన పరమ ధర్మము. హింసాచరణమునకే సర్వ స్వత్వములను గట్టిపెట్టినచో నీ భూతధాత్రి కది నిత్యమహా ప్రళయము". యువరాజు మాటలకు రాజసభ నిస్తబ్ధ మైనది. సిద్ధార్థుఁడు, తిరిగి, "మృగయా ధర్మమునే పాటింప వలె నన్నను రాజహంస దేవదత్తునకుఁ జెందదు. బ్రతికిన ప్రాణు లెల్ల వేటకానివి గావు. చచ్చిన కళేబరములు మాత్రమే మృగయుఁడు సంపాదించుకొన వచ్చును. రాజహంసను దేవదత్తుఁడు చంపలేదు; గమనశక్తిని మాత్రమే హరించినాడు. పెద్దలు ధర్మ నిర్ణయము సలుప గోరుచున్నాను" అని పలికెను. రాజసభ యంతయు లోకోత్తరకృపామూర్తియైన సిద్ధార్థుని వాదమును

ప్రశంసించుచు జయ జయ ధ్వానములు సలిపెను. రాజహంస రక్షకుఁడైన సిద్ధార్థునిదే యని మహారాజు తీర్పు చెప్పెను. సిద్ధార్థుని విజయము సమస్తభూతకోటికి దిగ్విజయమయ్యెను. ఆ యమృత హృదయుని యనురాగ హస్తముల యూతఁ గొని యా రాజహంస యనంత విహాయస పథమునుబట్టి యెదో క్రొత్త క్షితిజము వైపునఁ కెగిరి పోయెను.

సిద్ధార్థుని నిర్వ్యాజ నిసర్గ దయాస్వభావము తండ్రియగు మహారాజును గలవర పెట్టినది. దుష్టశిక్షణము శిష్టరక్షణము జేయవలసిన రాజులకు మెత్తని గుండె పనికి రాదు. ప్రపంచములో నెచ్చట బాధ కన్పించినను, అతని హృదయము కరిగి పోవును. కావున యువరాజును రాజహర్మ్యమును దాటిపోకుండ, మహారాజు రహస్యముగ సంరక్షించు కొనుచుండెను. వయోవృద్ధులు, వికలాంగులు, వ్యాధిగ్రస్తులు యువరాజున కగపడకుండఁ జూడవలె నని భటులకు రాజశాసనము. సాయం సంధ్యాసమయములందు మహారాజు స్వయముగ యువరాజును వెంట నిడుకొని యశ్వారూఢుఁడై సపరివారముగ వాహ్యాళి కేగుచుండెడివాఁడు.

ఒకనాడు రోహిణీ నది తీరమున నొక యద్భుత సన్నివేశము సిద్ధార్థుని హృదయమును దీవ్రముగఁ గలవర పెట్టినది. ఒక తీతువు నీటిలోఁ బడి యొడికముగ నొక చేపను బట్టుకొని సద్యోవేగమున మింటికెగ సెను. ఎగురుచున్న యా తీతువును డేగ తన్నుకొని పోయెను. రాజసుతని మనస్సు నిదిధ్యాసలోఁ జిక్కెను. అతని మనోనేత్రము ముందు విశ్వసృష్టి విచిత్ర విభ్రమము సాక్షాత్కరించెను. చిరుచేపల మ్రింగుచున్న కప్పను బాము కబళించెను. ఆ పామును గ్రద్ధ తన్నుకొని పోయెను. ఒక మహారణ్యము-సింహగర్జన : లేడిపిల్లలు బెదురు చూపులతోఁ బిచ్చి గంతులు పెట్టుచున్నవి. సింహము లేడిపిల్లలఁ జీల్చి పొట్టఁబెట్టుకొను చున్నది. సృష్టిలోగల పరస్పరవైరుధ్యము; ప్రాణికోటుల స్వార్థము పెట్టు వెఱ్ఱిపరుగులు-మఱేవో యాలోచనలు అతని మనస్సును వేధించి జీవిత రహస్య గవేషణ కై ప్రేరేపించినవి. రోహిణీ నిర్ఝరిణీ తరంగమధుర నినాద మతని కిక

విశ్వవేదనారావమై వినిపింప సాగినది. పరధ్యాన వశుఁడైన యువరాజును దోడ్కొని మహారా జంతఃపురమును జేరెను. మనన శీలుఁడైన పుత్రుని, హృదయమును గలవరపెట్టు దృశ్యములనుండి దూరముగ నుంచుటకు మహారాజు సమస్త యత్నములు నొనరింప సాగెను.

సిద్ధార్థునకు యౌవనోదయ మైనది. ఉపాధ్యాయులనుండి యనేక విద్యల నభ్యసించియున్నాఁడు. గురుదక్షిణల స్వీకరించి యుపాధ్యాయులు మహారాజు సమక్షమున యువరాజును దీవించి, యుక్తవయస్కుఁడైన యతని కిక వివాహయత్నము కావింప వచ్చునని ప్రవచించిరి. మహారాజు సంతోషమునకు మేరలేదు. యుక్తవయస్కుఁడు, విద్యావంతుఁడు నైన రాజపుత్రుని మనస్సులో భోగలాలసత, యధికారతృష్ణ పరరాజ్య విజిగీష ప్రబలలేదు. సుప్తరాగాతిరేకముగూడ విజృంభింపజేయు సౌందర్య రాశియైన రాజకన్యను వెదకి సిద్ధార్థునకు వివాహము చేయుట సర్వదా శ్రేయస్కరమని మహారాజు తలపోసెను.

కన్యావరణమున శాక్యరాజ్యమున సనాతనసంప్రదాయ మొకటి కలదు. చైత్ర శుద్ధ దశమినాడు రాజ్యము నందలి సకల క్షత్రియ కన్యక లంతఃపురమున కరుదెంచి యువరా జొసగు పారితోషికముల నందుకొని పోవలెను. ఆనాడు, క్షత్రియ కన్యకలు స్వీయ సౌందర్య ప్రదర్శన మొనర్చుచు యువరా జందించుచున్న కానుకలఁ గైకొని పోవుచుండిరి. అతడు నిశ్చల మనస్కుఁడై యుండెను. చిట్టచివరకు, సుప్రబుద్ధుఁడను మహామండలాధిపుని పుత్రిక యశోధరాకుమారి రత్నాకరఁ జేరు రసధుని వలె నొయ్యార మొలికించుచు సిద్ధార్థుని సమీపమున కరుదెంచి, చిన్నారి చిరునవ్వు లొలుకుచుఁ దన రాక సూచించుటకు "ప్రభూ!" అని సంబోధించెను. అప్పటికే యువరాజు తనయొద్ధ గల పారితోషికముల నెల్ల నిచ్చివేసెను. కాని, యశోధర సంబోధన వినుటతోడనే పులకించి పోయిన సిద్ధార్థుడు క్రాల్ గనుల వెలుగు వెల్లువఁ జిమ్ముచుఁ దన కంఠ మందలి మరకత మణిహారమును దీసి యామె కంఠమున వేసెను.

సభలో హర్ష ధ్వనులు చెలరేగెను. పసిడి సిగ్గు దొంతరలు గ్రమ్ముకొన యశోధర తరలేక్షణయై మందగమనమునఁ దరలిపోయెను. మహారాజు సంతోష పరవశుఁ డయ్యెను.

సుప్రబుద్ధు నొద్దకు శుద్ధోదనుడు యువరాజుకొఱకు యశోధరా కన్య నర్థించుచు దూతల నంపెను. కన్యక నర్థించు రాజకుమారుఁడు కన్యాస్వయంవరోత్సవమునకుఁ బోయి, క్షాత్ర విద్యాప్రదర్శనమున సర్వోత్కృష్టుఁడై మించవలెను. ఆ యాచారము ననుసరించి యశోధరా స్వయంవరమును బ్రకటించి సుప్రబుద్ధుడు సిద్ధార్థు నాహ్వానించెను. ఆ మహోత్సవమునకు శాక్య వంశ రాజ కుమారు లెందరో వచ్చిరి. అందు దేవదత్తుడు, అర్జునుఁడు, ఆనందుఁడు గూడ గలరు. విలు విద్యలో దేవదత్తుడు, ఖడ్గ చాలనమున నర్జునానందులు సుప్రసిద్ధులు. పటాటోప పరాఙ్ముఖుఁడైన సిద్ధార్థుని యభినివేశము సన్నిహితులకుఁ దప్ప లోకమున కంతగాఁ దెలియదు.

స్వయంవరరంగమున మత్స్యయంత్రములు పెక్కు గలవు. అర్జునుఁడు రంగమునఁ బ్రవేశించి యంత్రము నారు గవ్యూతల యెత్తున నుంచ మనెను. ఆనందుఁడు నట్లే గోరుకొనెను. దేవదత్తుఁడు తన యంత్రము నష్ట గవ్యూత్యున్నతము గావింప మనెను. సిద్ధార్థుడు తన యంత్రమును బది గవ్యూతల యెత్తున నమర్చ మనెను. దేవదత్తాదులు తమ యంత్రముల నరికి సభాసదుల కుల్లాసము గలిగించిరి. సిద్ధార్థుడు, యంత్రమూలమున నున్న విల్లునెత్తి యల్లెత్రాడు బిగించి, యెక్కు పెట్ట సాగెను. కాని, యాతని గాఢాకర్షణమున కా కార్ముకము తుత్తునియలై నేలకూలెను. సభాసదులందరు ఆశ్చర్య చకితులైరి. అంత యువరాజు, "ఈ దుర్బల కార్ముకము లేల? ఆయుధాగారమున నున్న 'సింహహను' ధనుస్సును దెమ్మ"ని పరిజనుల కాజ్ఞాపించెను. సేవకులు ఆ చాపమును దెచ్చియిచ్చిరి. యువరాజు, ధనుష్టంకార మొనర్చి జవ లాఘవ సమన్వితమైన లక్ష్య శుద్ధితో మత్స్యయంత్రము నేలగూల్చెను. అనన్య సామాన్యమైన అతని కార్ముక కౌశలమును సభ్యు లందఱు

ప్రశంసించిరి. యశోధ రాకుమారి పులకాంకుర ప్రకరములతో నానంద తన్మయత్వమున లీన మైనది.

తరువాత ఖఢ్గ విద్యా ప్రదర్శనము. రంగమున సమాన పరిమాణములు గల వృక్షములు వరుసగా నుండెను. రాజకుమారులు వృక్షముల ఖఢ్గములతో ఛేదింపవలెను. దేవదత్తు డొక వృక్షమును షడంగుల దఘ్నముగ నరికెను. అర్జునుఁడు సప్తాంగుల దఘ్నముగ నరికెను. నందుఁడు నవాంగుల దఘ్నముగ ఛేదింప గలిగెను, సిద్ధార్థుడు లేచి, యొక్క ప్రేటున వృక్షద్వయము పై ఖఢ్గమును ప్రయోగించెను. ఖఢ్గము మిరుమిట్లను గొల్పుచు మెరసెను. అంతియే, వృక్షము లెప్పటియట్లు నిలిచియున్నవి. నందుఁడు యువరాజు లక్ష్యము చెదరిన దని కేక వేసెను. యశోధర గుండె ఝల్లు మన్నది. సిద్ధార్థుఁడు నవ్వుచు సేవకుల నియోగించి చెట్లను బడఁ ద్రోయించెను. కాండములయందు ఖఢ్గ కృత రేఖలు సుస్పష్టముగ సభ్యులకు గోచరింప సంభ్రమాశ్చర్య సంభృతులై యొక్క పెట్టున జయ జయ ధ్వానములు సల్పిరి. యశోధర మంద గంభీర గమనమునఁ జెలికత్తెలతో నేతెంచి, సిద్ధార్థుని కంఠమున సీత పుష్పమాల నలంకరించెను.

యశోధరా సిద్ధార్థుల వివాహము మహావైభవముగా జరిగినది. శుద్ధోదన మహారాజు నూత్న వధూవరులకై చంద్రశిలామయ హార్మ్యమును వినిర్మించెను. హంస తూలికా తల్పములు, కాంచన మణి మయాంబరములు, తార హారములు, కస్తూరికా చందన పరిమళ ద్రవ్యములు, సరోవరోద్యాన విహార వాటికలు, సంగీత నాట్య వినోదములు, శృంగార వేశ్యా పరిచారికా బృందము-సమస్త భోగములు సిద్ధార్థునకు మహారాజు ప్రత్యేక శ్రద్ధతోఁ గల్పించెను. లావణ్య లహరియైన యశోధర సిద్ధార్థునకు సహధర్మిణియై కొలుచుచుండెను. అతిలోక సౌందర్యరాశియైన యశోధరా సాహచర్యమున సిద్ధార్థుడు ప్రవృత్తి పథమునఁ బడగలఁడని మహారా జాశించు చుండెను. సిద్ధార్థుడు యశోధరను మిక్కిలి ప్రేమతో మన్నించుచుండెడివాఁడు. కొడుకును గోడలిని జూచి మహారాజు మురిసి పోవు చుండెడివాఁడు. రాజ భోగ విలాసములలో

యశోధరాదేవి నవయౌవన సౌందర్య విభ్రమములలో, సిద్ధార్థునకు మైమరపు కలుగలేదు. భోగపరాఙ్ముఖమైన యతని నేత్రాంచల ములలో నిదిధ్యాస నీడలు గట్టుచునే యున్నది.

10

యశోధర గర్భము దాల్చెను. అంతఃపురమున మహోత్సవము జరిగినది. సిద్ధార్థునిలో ధ్యాననిమగ్నతయే గాని యుత్సాహాతిరేకము కను పించలేదు. శుద్ధోదన మహారాజు హృదయము చివుక్కు మనెను. మహారాజేమి చేయగలడు? జరా రుజా మరణములు యువరాజు కంటఁ బడకుండ గట్టడి చేసి యుంచెను.

ఒక నాఁడంతఃపురమున నరసిన వెంట్రుకలు, ముడతలు పడిన శరీరము, వ్రాలిన కనుబొమలు గల యొక ముదివగ్గు దగ్గుచు నూత కోలతో నడువలేక నడువలేక నడచుచుండెను. రాజపుత్రుఁ డతని జూచి ఖిన్నుఁ డయ్యెను. అతఁడు రాజహర్మ్య పరిసరములఁ గాన్పింపని వేఱొక వాస్తవ లోక మున్నదని గ్రహించెను. గ్రంథములయందు సిద్ధార్థుఁడట్టి లోకమును గుర్చి యిదివరకే తెలిసికొనియుండెను. అతనికి రాజభోగము లన్నియు నదృశ్య సువర్ణ శృంఖలములుగ గోచరించినవి. అతని మహాప్రాసాదమే యొక విచిత్రకారాగారముగఁ గన్పట్టెను. వెంటనే యతఁ డశ్వశాలకుఁ బోయి తన గుఱ్ఱము నెక్కి విశాలప్రపంచమును దిలకింప నుద్యుక్తుఁ డయ్యెను. కాని యశ్వారూఢుఁడైన సిద్ధార్థుని గాంచి ద్వారపాలకులు ప్రత్యుత్థానము సల్పి యవనత మస్తకులై నిల్చిరే కాని తలుపులు తెరవ రేమి? అది రాజాజ్ఞ ! యువరాజు సపరివారముగ బయలుదేరవలెనే గాని, యొంటరిగాఁ బోరాదు. పారతంత్ర్యము యువరాజు ముఖమును దేరి పార జూచినది. అతఁడు గుఱ్ఱమును మరలించుకొని మహారాజు సమక్షమునకుఁ బోయెను.

సిద్ధార్థుఁడు యథేచ్ఛగ విహరింప గోరి మహారాజు ననుజ్ఞ వేడెను. శుద్ధోదనుఁడు వేడి నిట్టూర్పు విడిచెను. యువరాజు కోరికను మహారాజెప్పుడును నిరాకరించి యుండలేదు. ఈ విపరీత వాంఛ యతని కేల పుట్ట వలెను? పురమున నేమి చూడవలెను? ఒకవేళ

చూడవలె నని వైభవముతో సపరివారముగఁ బోవచ్చునే? వేదాంతులనే కలవర పెట్టు లోకమును సుకుమార మనస్వియైన రాజకుమారుడు నగ్నముగ దర్శింపఁ గలడా? అనేక భావములు మహారాజు మనస్సును వేధించినవి. కాని, పుత్రుని కోరికను నిరాకరింపలేక, సుతునితో, "తండ్రి! నీయిష్టమే నా యభీష్టము. అట్లే విహరింపుము. నీ స్వాతంత్ర్యమున కంతరాయము లున్న వని తలపకుము. అవి రాజమర్యాదలు; ఇనను నీ యిష్టము చొప్పున వర్తింపుమ"ని భగవంతునిపై భారము వైచి, మందస్వరమున మహారాజు పలికెను. కాని యతని హృదయమున నగ్ని పర్వతములు పొగలు గ్రమ్ముకొన సాగినవి.

నాటి మధ్యాహ్నముననే సిద్ధార్థుఁడు చెన్నుఁ డను పరిచారకునితోఁ గలసి, ప్రచ్ఛన్న వేషమున రాజసౌధమును వీడి నగరము లోని కరిగెను. ఆతని కది యొక క్రొత్త ప్రపంచము వలెఁ బొడఁగట్ట సాగెను. విఫణి వీథులలో గుమిగూడిన ప్రజాసమూహమును గాంచెను. రాజకుమారులు అందలంబుల నెక్కి విహరించుచుండిరి. నిరుపేదలు అందలంబుల మోయుచు, స్వేదబిందువు లొలుకుచు నొదిగి నిలుచుచుండిరి. విక్రయ క్రియాదక్షులైన వర్తకుల వచోనైపుణ్యము, వస్తుసంచయ సంపాదనాభిరక్తులైన ప్రజల వాంఛావైవిధ్యము, నేతగాండ్ర మగ్గముల చప్పుడు, పిండివాండ్ర తిరుగళ్ల మ్రోత, కుండలు దీయు కుమ్మరి సారె, కాలిన యినుమును సాగదీయు కమ్మరి సమ్మెట పోటులు, కంచరి సుత్తి రొదలు, మూగిన ప్రజల రంజింపఁ జేసెడి వినోదకారుల హస్తలాఘవము, దుర్గంధపూరితములైన యంగడి రచ్చలు, సందు గొందులలో నిరుకు కొనిన పూరిగుడి సెలు, రాచబాటలలో విచ్చలవిడిగా విహరించు ధనికుల దుర హంకారములు-అతనికి వింతగనే సాక్షాత్కరించెను.

తరువాత సిద్ధార్థ డొక దేవాలయమును సందర్శించెను. పరదేశ గతుఁడైన భర్త యాగమనము నాకాంక్షించుచు దేవుని పూజించు వధువు, సంతానార్థియై దేవునకు మ్రొక్కుకొను మఱియొక పడతి, చేసిన పాపములు శమించుటకై ముడుపులు

చెల్లించుకొను భక్తుఁడు, సంకల్పించిన వర్తకము నిర్విఘ్నముగఁ గానసాగుటకు మంత్రపుష్పములు చదివించు వ్యాపారి-యిట్టి వారెందతో యచటఁ గూడియుండిరి. అర్చకులు దేవునకుఁ బ్రతినిధులై భక్తుల ముడుపుల నందుకొను చుండిరి. దేవుని పేర మీద సాగుచున్న వ్యాపారము, వ్యాపించుచున్న మౌఢ్యము, ప్రబలుచున్న యజ్ఞాన కాపట్యము సిద్ధార్థునకు హృదయవిదారకముగఁ దోచెను.

సిద్ధార్థుఁడు చెన్నునితోఁ గలిసి పురమంతయుఁ గలయఁ దిరిగి చివరకు రోహిణీనదీ తీరమును జేరెను. అచట శిథిలాంగుఁడైన రుజార్తుని దైన్యవికల ధ్వని వినిపించెను. రాజసుతుడు వెంటనే యతనిఁ జేరి యొడిలోఁ బొదివికొనెను. శరీర మంతయు వ్రణములచే నిండి చీము గారుచుండెను; కాలు చేతులు వంకరలు దిరిగి పట్టు సడలి యుండెను. ఆతని తల నిమిరి, సిద్ధార్థుఁడు, "నీ కెచ్చట నొప్పిగా నున్నద"ని ప్రశ్నించెను. రోగి వణుకుచు, "అయ్యా ! నా దేహమున నొప్పిలేని చోటే లేదు." అని పలుకుచు గ్రుడ్లు తేలవేయసాగెను. చెన్నుఁడు "ప్రభూ! యిది యొక యంటువ్యాధి. ఇతఁడు రేపో మాపో మరణింపగలఁడు ఇక; లాభము లేదు. మీ రిట్లు స్పృశించుట మంచిదికాదు" అని యువరాజును వారింప సాగెను. సిద్ధార్థుడు రోగి నెట్లు చేర్చి మరలి వచ్చుచుండగాఁ గొందఱొక మృత కళేబరమును శ్మశానమునకుఁ గొంపోవు చుండిరి. బంధువుల శోకాలాపములు, చుట్టు నున్న వారి భగవన్నామ సంకీర్తనము ఆతని గలఁచి వైచినవి. అనతి దూరముగఁ గల శ్మశాన వాటికలో శవమునకు దహనసంస్కార మొనర్చి వారు మరలి పోయిరి, జీవయాత్రకు జిట్ట చివరి గమ్యము శ్మశానమేనా ? సిద్ధార్థుని గుండెలో నారని చితి ప్రజ్వరిల్ల సాగెను. అతని మనోవ్యథ నర్థము చేసికొనిన చెన్నుడు మెల్లగ నతని దోడ్కొని యంతఃపుర సౌధమును జేర్చెను.

ఆ నాటి రాత్రి సిద్ధార్థునకు నిదుర పట్టలేదు. అతఁడు తన మనస్సంక్షోభము వలనఁ దండ్రికి గూడ బాధ కలిగింప కుండుటకు నిత్య క్రమానుసారము నాట్యమందిరమున కేగెను. రత్నదీపాంకుర

ప్రభారాగ పంక్తులు, కర్పూర సుగంధ ధూపములు, ఘనసార నీహారానులేపములు, కస్తూరికాతాంబూలములు యువరాజు మనోనుతాపమును మఱింత వృద్ధి చేసినవి. రాజ నర్తకి శింజినీ కింకిణీరావములలో సాయంకాలమున రోగి ముఖమున వెలువడిన వికటహీనస్వరములే వినిపింప సాగినవి. అతఁడు మెల్లగ స్వీయహర్మ్యమును జేరుకొనెను.

ప్రచ్ఛన్న వేషములు దాల్చి సిద్ధార్థుఁడు రాజ్యమునం దెల్లెడ స్వేచ్ఛావిహార మొనర్చెను. ఎల్లెడల, హింస, క్రౌర్యము, దౌర్జన్యము, దురహంభావము, విద్రోహము లోకములో వికటాట్టహాసవిలయ తాండవము సల్పుచున్న ట్లతనికి గోచరించెను.

జాతరలు, కొలువులు, యజ్ఞములు, నోరులేని జంతువులను హింసించు బలిపీఠములుగా మారినవి. క్షాత్రధర్మము ప్రకారము ప్రతి రాజు పొరుగు రాజుల సంహరించి యశ్వమేధ యాగమును నిర్వర్తించి చక్రవర్తి యగుటయే పరమార్థమని భావింప వలెను. ప్రజ లందఱు రాజునకు దాసులు. సామంతులు గూడ రాజపాదపీఠికపై నెన్నుదురు సోక నమస్కరింపవలెను. దుష్టసామ్రాజ్యవాంఛ మహారాజపురుషలక్షణమా? మానవ సహజమా? పిశాచభావమా? తానేల యీ హింసాప్రవృత్తిని ప్రతిఘటించి నిలువరాదు? సిద్ధార్థుని మనస్సులో స్థిరసౌదామినివోలె లోకకల్యాణభావము వెలుఁగొంద సాగినవి. ఇంతవఱకు శాక్యయువరాజ లాంఛనమైన కిరీట మతని కింక పాదపీఠికగా మారిపోయినది.

ఆ సమయమున యశోధరాదేవి పుత్రునిఁ గన్న శుభవర్తమాన మొక వృద్ధదాసి యువరాజునకు నివేదించినది. అతఁ డామెకు మెడలోని ముత్యాలహారము చిరునవ్వు లొలుకుచు బహూకరించి సన్మానించి పంపెను. "ఇది ఛేదింప వలసిన మరియొక క్రొత్తబంధము కాబోలు?" నను భావము ఆతని మెదడులో మెరపు తీగవలె మిరుమిట్లు గొలిపినది. కాని, సిద్ధార్థ డిదివఱ కే కృత నిశ్చయుఁ డయ్యెను.

రాజ శిశువునకు రాహులుఁ డను నామకరణము చేయబడినది. సిద్ధార్థ డుత్సాహియై యుండెను. బారసాల మహోత్సవముగ జరిగినది. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు మానవ జీవితమును నరక కూపముగఁ జేయుచున్నవి. దురహంకారము, క్రూరత్వము, ద్రోహచింతనములతో మానవుఁ డెండమావుల వెంబడించి వెఱ్ఱి పరుగులు పెట్టుచున్నాఁడు. ద్వంద్వబద్ధమైన ప్రాణికోటికి సౌఖ్య మెక్కడిది ? మానవ దుఃఖము నంత మొందించు మార్గము నన్వేషించుటయే జీవిత పరమార్థమని సిద్ధార్థుడు గుర్తింపఁ గలిగెను. జీవితమున నానంద యోగము సాధించుటకుఁ గృతనిశ్చయుఁడైన సిద్ధార్థుని జ్యోతిర్నయనములలో నుత్సాహరేఖలు తాండవింప సాగినవి. తన స్థిర సంకల్పమును దెలిసికొనిన, దనతోడిదే లోకమని నమ్మియున్న పితృదేవు డేమగునో? భర్తృశరణోపజీవిని యశోధర, చిన్నారిచిట్టి పాపాయి-వారిగతి యేమి కావలెను? ఈ తలపు లతని కాళ్ల కదృశ్య శృంఖలములు కాగలవు. అది వృథా శంకలకు సమయము కాదు.

సూర్యుఁ డస్తమించెను. పుత్రోత్సవ సందర్భమున వెలిగించిన జ్వాలాతోరణము లంతఃపుర హర్మ్యపరంపరలపైఁ బ్రకాశించు చున్నవి. సిద్ధార్థుడు చెన్నునిఁ బిలిచి, యశ్వమును సిద్ధముచేయ నియోగించి, తన సౌధమున కేగెను.

మినుకు మినుకుల యలతి వెలుఁగులు చిమ్ముచున్న చుక్కలు చిమ్మచీఁకటిని జీల్చుకొని మింటఁ దోఁచినవి. చెన్నుఁడు గుఱ్ఱమును యువ

రాజహర్మ్యప్రాంగణమున నిలిపెను. అశ్వహేషారవము హంసతూలికా తల్పమున నున్న సిద్ధార్థు నాహ్వానించినది. గగుర్పాటుతో సిద్ధార్థుడు లేచి నిల్చి ముందునకు సాగెను. యశోధర నిద్రించు చున్నది. రత్న దీపాంకురప్రభారాగ పంక్తులు రాహులుని పెదవులపై బోసినవ్వులతోఁ కలిసిపోయి సిద్ధార్థుని గుండెతో దోబూచు లాడసాగినవి. అతఁ డనుగు పాపాయి కెమ్మోవిపైఁ

గడసారి ముద్దు పెట్టుకొనబోయి ముందునకు సాగక నిలిచి, క్షణములో వెనుదిరిగి మేడ మెట్లు దిగసాగెను.

విశ్వ కళ్యాణ గవేషణ యారంభ మయ్యెను. సృష్ట్యాది నుండి, యే మానవుఁ డిట్టి లోకోత్తర పవిత్ర యాత్ర సలుపలేదు. ప్రపంచచరిత్రలో సిద్ధార్థుని నిర్గమన మనన్యమై వెలసినది. అతఁ డశ్వము నధిరోహించెను. ఆ పవిత్ర శుభ ముహూర్తమును దలఁచుకొని మూడుకాలములు రోమాంచము వహించును. చెన్నుఁడు స్వామి ననుసరించెను. కాలపురుషుని కటిక యెడద తొలిసారి కదలి, సిద్ధార్థుని గుఱ్ఱపు గిట్టల చప్పుడునకు శ్రుతి కల్పుకొని కొట్టుకొన సాగెను.

ఆ నడిరేయి సిద్ధార్థ డశ్వారూఢుఁడై పయనించెను. మగధరాజ్య కాననపరిసరములఁ జేర సరికి ముసి ముసి చీఁకటులు చెదరి తెల్లవార సాగెను. సిద్ధార్థుఁ డచట అశ్వమును దిగి నవ రత్న ఖచిత ఖడ్గమును శుద్ధోదన మహారాజునకు సమర్పింపమని చెన్నున కొసగి, తన భూషణముల నెల్ల నొలిచి యతని కిచ్చెను. చెన్నుఁ డశ్రుపూరిత నయనుఁడై మౌనమును దాల్చి యుండెను. సిద్ధార్థుడు పీతాంబరముల వీడి కాషాయ వస్త్రముల ధరించి చూచు చుండగనే సన్యాసరూపమునఁ జెన్నుని వీడ్కొని తరలిపోయెను.

సన్న్యాసాశ్రమమును స్వీకరించిన పిమ్మట సిద్ధార్థుఁ డనుపియా తోటలో నొక వార ముండెను పిమ్మట మగధరాజధాని రాజగృహము చేరుకొనెను. రాజగృహ మొక గిరిదుర్గము. రాజప్రాసాదములతో నుద్యాన వనములతో నాపురము మిక్కిలి మనోజ్ఞమై యుండెను. రాజ గృహమునకుఁ దూర్పున రత్నగిరి గుహాభ్యంతరములు తపోదీక్షతో నుండెడి యోగుల కావాసములు. అచ్చట నున్న యాలారుడు, నుద్దాలకుఁడు మున్నగు సుప్రసిద్ధ బ్రాహ్మణయతులయొద్ద యోగశాస్త్రవిద్య నభ్యసించుటకు దేశదేశములనుండి శిష్యు లేతెంచు చుండిరి.

సిద్ధార్థు డొక వివిక్త గుహయందు వసించుచు నారు సంవత్సరములు తపస్సు సలిపెను. మండుటెండలు, మంచు తెరలు జడివానలు, ఝుంఝూమారుతములు సలుపు కఠినపరీక్షలో ఆతడు కృతకృత్యుఁడై నిలిచెను. భిక్షాన్న మాహారము! భావసమాధియే నిత్యవ్రతము! పక్షు లతని భుజములపై విశ్వసించి భిక్షాపాత్రలోని యాహారమును ఆరగించి పోవుచుండెడివి! అతఁ డుషఃకాలమున లేచి శీతలోదకముల స్నాన మాచరించి యాలారుకడ యోగవిద్యారహస్యముల నభ్యసించి రాజగృహమున భిక్షాటనము సలిపి తిరిగి సమాధిముద్రాముద్రితుఁ డయ్యెడివాడు ఆత్మవికాసమునకు జ్ఞానోదయమునకు శరీరము ప్రతిబంధక మని యోగ సాధకుల యభిప్రాయము. ఇంద్రియముల నిరోధించి, దుఃఖాతీతమైన యానందమోక్షమును సాధింపఁ జూచుటయే వారి తపోయోగము.

ఊర్ధ్వబాహులై కొందఱు తప మాచరించు చుండిరి. మఱి కొంద ఱొంటి కాల సిలిచి, నిమీలితనేత్రులై వాయు భక్షకులై శుష్కించి తపస్సు చేయ చుండిరి.

ఈ యోగసాధనకు గమ్య మేమి? ప్రయోజన మేమి? భూమిలో మానవ జీవితములో లేని యానందము జన్మాంతమున నెచ్చటో స్వర్గమున లభించునా? అయిన నిహలోకజీవితము దుఃఖపూరితము కాక తప్పదా? ఈతపస్సువలన సిద్ధార్థునకు మనస్సంక్షోభ ముపశమింప లేదు.

ఒకనాటి మధ్యాహ్నమున సిద్ధార్థుడు గుహాంగణమున నిలిచి యుండ మేకలమంద ముందు గోచరించెను. కాపరులు దారి తప్పి మేకల వంకర కట్టెలతో మోదుచు నదలించుచుండిరి. ఆ మందలో గవళ పిల్లలగన్న మేక యొకటి గలదు. అందొక మేకపిల్ల కుంటిది. తల్లి మేక ముందరుగ పిల్లకొఱకు ముందునకు గుంటిపిల్ల కొరకు వెనుదిరుగుచు మిక్కిలి చిక్కుపడు చుండెను. సిద్ధార్థుడా కుంటిపిల్ల నెత్తుకొని నిమురసాగెను. తల్లిమేక యాగినది. కాపరులు వచ్చి నిలిచిరి. సిద్ధార్థుడు కాపరులతో "మధ్యాహ్నమునే

పురమునకు మందను మళ్లించుచున్నారేల” యని ప్రశ్నించెను. “దేవా! మేము బింబిసార చక్రవర్తి మేకల కాపరులము. చక్రవర్తి యజ్ఞము చేయుచున్నాడు. నేటి రాత్రి నూరు మేకల బలి యిత్తురు” అని కాపరులు సమాధానము చెప్పిరి. సిద్ధార్థునకు సర్వమూ విదితమైనది. అతండా కుంటి మేక పిల్లను భుజమున నిడుకొని వారి ననుసరించెను.

మేకల మందతో సిద్ధార్థుడు పురోప్రాంతమున విడిసెను. కుంటి మేకను భుజముల పై మోసుకొని వచ్చుచున్న యాతని జూచి ప్రజలు మూగిరి. కిసాగోతమి యను వృద్ధ వనిత విలపించుచు సిద్ధార్థుని గలిసికొనెను. ఆమె యేకైక సుతుడు పాముకాటుచే మరణించెను. ఆమె భిక్షాటనమున దన గుడిసెకు వచ్చిన సిద్ధార్థుని గని పుత్రుని బ్రతికింపు మని దీనాలాపముల మిక్కిలి ప్రార్థించి యుండెను. అతండామెను మరణ దుఃఖము నెరుగని గృహస్థుల యొద్ధనుండి యావాలు తెమ్మని పంపెను. ఆమె రాజగృహమెల్ల గలయ దిరిగెను. ఎక్కిన గడప దిగుటయే గాని మరణ దుఃఖము నెరుగని కుటుంబమే యామె కా మహా నగరమునం గను పింపలేదు. ఆమె నిరాశాహృదయముతో దిరిగి వచ్చుచు సిద్ధార్థున కెదు రాయెను. ఆమె యుపాయాంతరమున దన బిడ్డను బ్రతికింప సిద్ధార్థుని కేడుకొనసాగినది. ఆ వృత్తాంతమును విన్న వారందఱు సిద్ధార్థ యోగి యేమి చెప్పునో వినుకుతూహలముతో నుండిరి. సిద్ధార్థుడు చల్లని చూపులతో నామె ననుయించి, “తల్లీ! ఆవాలు లేని యిల్లు లేదు. మరణ దుఃఖము నెరుగని గృహము లేదు. సర్వసామాన్యమైన మృత్యువు నీ పాలిటి ప్రత్యేక విపత్తుకాదు గదా! సర్వజను లిట్లు దుఃఖపీడితులు కానేల? ఈ రహస్య మెరుగుట కొఱకే నా తపస్సాధన. నీ సంతాపమునకు మందు ధీరత్వమే!” యని పలికెను. గుమిగూడిన ప్రజలంద రద్భుతావహ చిత్తులై సిద్ధార్థయోగి తత్త్వోపదేశమునకు దోసిలి యొగ్గిరి. కిసాగోతమి ప్రసన్నచిత్తయై ధీరత్వము వహించెను.

సిద్ధార్థుడు బింబిసార యజ్ఞవాటికకు మందతో గలసి పయనమయ్యెను. అతని కీర్తి యతనికంటే ముందుగనే

యజ్ఞవాటికను బ్రవేశించెను. బింబిసార చక్రవర్తి యా వార్త విని యాశ్చర్యచకితుడయ్యెను.

యజ్ఞపశువులతో గలసి కుంటి మేకను భుజమున పైనెత్తుకొని వచ్చుచున్న సిద్ధార్థయోగిని గాంచినంతనే బింబిసార చక్రవర్తి మండపము దిగి ముందునకేగి ప్రత్యుత్థానము సల్పి స్వాగత మర్పించెను. చక్రవర్తి కిరువైపుల వేదమంత్రములు పఠించుచు బ్రాహ్మణులు నిల్చియుండిరి. యజ్ఞకుండమునుండి హవిర్ధూమము వెలువడుచుండెను. ఋత్విజులు సుగంధద్రవ్య సంభృతమైన సోమరసము నగ్నికుండమున వ్రేల్చుచుండిరి. చుట్టును బచ్చి నెత్తురు కాలువ యిసుక మడిలోనికి ప్రవహించి యింకిపోవుచుండెను. ఒక మేకను బలిపీఠమున దర్భలవెంటితో గట్టి యుండిరి. ఋత్విజుడు, వాడికత్తి ధరించి మంత్రోచ్చాటన సల్పుచుండెను. మంత్రార్థ మిది. "ఓ యజ్ఞ భోక్తలైన దేవతలారా! ఈ యజ్ఞ పశుకంఠమునుండి చిమ్మనగొట్టము వలె చిందెడి యరుణ కావోష్ఠ రక్తమును ద్రాగి యానందింపుడు. ఈ నైవేద్యము శ్రీబింబిసార చక్రవర్తి యొద్ద నుండి, ఘృతాన్న సోమరస పూరితముగ నగ్నిహోత్రుని సహస్ర జ్వాలా ముఖమున మీకు వచ్చుచున్నది. ఈ మహారాజు పాపము లన్నియు నీ యజ్ఞాగ్నికుండమున భస్మీభూతమగు గాక! ఇదిగో! యజ్ఞ పశువు కంఠము ఖండితమగుచున్నది.

మంత్రోచ్చాటన ముగిసినది. ఋత్విజుడు ఖడ్గమును ఝుళిపించెను. సిద్ధార్థయోగి నోట "ప్రభూ! జీవహింస నిషేధింపుడు. అమాయక ప్రాణిని రక్షించి పుణ్యము గట్టుకొనుడ"ను శాంత గంభీర వినాదములు వెలువడెను. సదస్యులందఱు నిశ్చేష్టులైరి. ఋత్విజుని కత్తి యప్రయత్నముగ జేతినుండి జారిపోయెను. కరుణారస ప్రభాతరళమైన సిద్ధార్థుని తేజోనేత్రములు సౌమ్య గంభీర వాగ్విన్యాసము యజ్ఞవాటికలో సదస్యుల హృదయాంతరాళ ములోఁ బ్రతిఫలింప సాగినవి. చక్రవర్తి, యతని కోమల నయన దీధితుల గాంచుచు గగుర్పాటుతో నిలిచియుండెను.

సిద్ధార్థుడు మంద గంభీర యానమున బలిపీఠమునసున్న యజ్ఞ పశువు మెడలోని దర్భల వెంటిని దీసివేసెను. అతని నెవరు నేమి యన లేకపోయిరి. మేకపిల్ల సిద్ధార్థుని కాళ్ళ నంటి నిలిచినది. అతడు మెల్లగ గంఠము నెత్తి యుపన్యసింపసాగెను.

"ప్రభూ! ప్రాణమన్న సకల జీవులకు మిక్కిలి ప్రీతి. మానవుడు ప్రాణమపహరింప గలవాడు గాని ప్రాణప్రదానము సలుపలేడు. ఒక ప్రాణి పాప పంపకమును వేరొక ప్రాణి రక్తము కడుగఁ జాలదు. ఇట్టి స్వార్థ దుర్బుద్ధికంటె వేరు పెద్ద పాప మేమి కలదు?

నిండుప్రాణుల కంఠ రక్తమును ద్రాగగోరు వా రెవ రైన దేవతలో? రాక్షసులో? యోజింపుడు. ఆత్మసుఖాపేక్ష కలుగు నను దుర్భ్రమతో దీన పశు హత్య చేయుటకంటె గొప్ప పాప ముండునా? దుష్ట దేవతలకు భయపడి కంఠ రక్తమును లంచ మిచ్చుట వీర పురుష లక్షణమా?"

**20**

మానవరక్తమును ద్రాగగోరు వారినిగూర్చి మనమే మనుకొందుము? అయిన మనము చంపుచున్న జీవులు మానవులను గూర్చి యే మనుకోవలెను? మానవుడు తోటి జీవముల హింసించుచు, దన్నెవరును హింసింప రాదని యెట్లు ప్రార్థింపఁ గలడు? విశాల సృష్టిలో భూత దయ కలిగిన కరుణాకర్ద్ర హృదయము కంటె విలువ కలిగిన వస్తు వేది? దయ, మానవ జీవితము నెంత మనోజ్ఞముగ దిద్దునో యోజింపుడు. కృపాపరత సృష్టి నానందధామ మొనరించును."

సిద్ధార్థయోగి వచనములు విన్న సదస్యుల హృదయ ములలో సద్యఃపరిణామము వెల్లివిరిసినది. ఋత్విజులు అవనత వదనులై నెత్తుటి చేతులను త్తరీయముల మాటున దాచుకొనిరి. బింబిసార చక్రవర్తి సిద్ధార్థుని పాదముల వ్రాలి, తన సింహాసనమును స్వీకరింప నతనిఁ బ్రార్థించెను. సిద్ధార్థుఁడిది వరకే సింహాసన కిరీటముల ద్యజించి వచ్చిన విషయము విని

సదస్యులు సంభ్రమాశ్చర్య వివశులైరి. చక్రవర్తి, భూత బలిని యజ్ఞకర్మలను మగధ రాజ్యమున నిషేధించుచు శాసనమును బ్రయోగించి సిద్ధార్థుని రాజగురువుగా నంద వేడుకొనెను. కాని సిద్ధార్థుడు సత్యాన్వేషణార్థము గయాప్రాంతాటవులకు బోవ సంకల్పించుకొని నట్టును, జ్ఞానోదయమైన పిమ్మట బింబిసార చక్రవర్తి కుపదేశము సల్పి సౌహృద ఋణము దీర్చుకొనెదనని చెప్పి, యతని వీడ్కొని వెడలిపోయెను.

రాజగృహమునుండి సిద్ధార్థు డురువేలారణ్యమున కరిగి బర్బర పర్వత ప్రాంతమున ఫాల్గుని నదీ తీరమున యోగసాధన కుపక్రమించెను. సృష్టిరహస్యములను గూర్చి, యుత్పత్తిస్థితి లయములను గూర్చి, కాల ప్రభావమును గూర్చి, నిరంతర యోజనలలో నిమగ్నుండై యతడు నిద్రాహారముల మరచుచుండెడివాడు. సూర్యచంద్రోదయాస్తమయముల నెరుంగక ధ్యానమగ్నుఁడై యున్న యతని దీక్ష యా యడవిలో నున్న ఐదుగురు యతుల నాశ్చర్యపరవశులను జేసెను. వారు సిద్ధార్థుని తపఃపరిణామము నరయగోరి యతని దినచర్యను పరిశీలింప సాగిరి. గౌతమ గోత్రజుఁడైన ఋషి యెవ్వరో భిక్షాటనమును గూడ మరచి, కందమూలములు భుజించుచు నిరంతరధ్యానసమాధిలో మునిగి కఠోర తపము సల్పుచున్నాడని మాత్రమే తెలిసికొన గలిగిరి. గౌతమ ముని శరీరము పోషణ లేక నానాటికి క్షీణింప సాగినది. ధ్యానసమాధిలో నుండగా నొకనాడు అతడు మూర్ఛపోయెను. అడవిలో మేకలు మేపుచున్న గొల్లవాఁడొకడు మూర్ఛితుఁడైన గౌతమ ఋషినిఁ గాంచెను. ముని యెవ్వఁడో యగ్ర కులసంభవుడు. అతఁడా గొల్లపిల్లవాఁడు. తన ముంతలోని పాలు, ముని నోటిలో బోసిన పాపము కాదా? ఆలోచించి గొల్లవాఁడు మేకను దెచ్చి, పాలు ముని నోటిలో పడునట్లు పిండసాగెను. పిడు చఁగట్టిన నోటఁ బాలతడిచే నాలుక యాడసాగెను. గౌతమయోగి కొంత తడవునకుఁ దెప్పరిల్లి గొల్లపిల్లవాని మంతలోని క్షీరమును నర్థించెను. కాని యా పిల్లవాఁడు తా నంటుటచే మైల పడిపోయిన పాలను మునీశ్వరున కిచ్చుటకుఁ జంకెను. గౌతమయోగి మనస్సు నొచ్చెను. "తండ్రీ! పుట్టుకచే మనుజు లందఱు సమాన సమానులే!

దుష్కార్యము సలుపువారు దుర్జనులు. సత్కార్యము లొనరించు వారు సజ్జనులు. గుణకర్మలచేత బ్రాహ్మణుడు గూడ దుర్జనుఁడు కావచ్చును. అట్లే సత్ప్రవర్తనవలన నెవరైన సజ్జనులు కాఁగలరు. దయారసహృదయుఁడవైన నీవు సుకృతివి. నాకు నీ ముంతలోని పాలిచ్చి యాదరింపు" మని యతఁడు పిల్లవానిని వేడుకొనెను. మిక్కిలి సంతోషముతో ఆ గొల్లపిల్లవాఁడు శాక్యమునికి ముంతలోని పాల నిచ్చి ధన్యుఁడయ్యెను.

మఱునాడు, సమీప పట్టణమునందలి యింద్రదేవాలయో త్సవమున కొక వేశ్య, పాడుకొనుచు నరుగుచుండెను. ఆమె పాడిన గీతము గౌతమ ముని నాకర్షించెను. "వీణాతంత్రులు తగపాటి బిగవులో శ్రుతి సేయుము. బిగవు మెచ్చిన తీగ తెగును. తగ్గిన నాదము పలుకదు. కావున నధికతా న్యూనతల వర్జించి యుచితస్థాయి నెలకొల్పి మధురనాద మనుభవింపుము." ఇది గీతార్థము. శాక్యముని కది జీవిత వేదాంతముగ దోచెను. తపస్సాధన మితి మీరిన శరీరమే శిథిలము కావచ్చును.

గౌతమఋష్యాశ్రమసమీపమున నొక గ్రామము కలదు. అందు సుజాత యను సాధ్వి పుత్రలాభము కొఱకు వనదేవతకు మొక్కుకొని యుండెను. ఆమె పుత్రవతి యైనది. మొక్కు దీర్చుకొనుటకు బరిచారికతోఁగూడి వనమున కేతెంచెను. వనదేవతాలయము ముందు చెట్టు కింద గౌతమయోగి కూర్చొని యుండెను. పరిచారిక అతనిఁ గాంచి వనదేవుడే సాక్షాత్కరించెనని కేక వేసెను. సంభ్రమాశ్చర్యములు పెనఁగొన సుజాత తనకుఁ బుత్రసంతానమును గ్రహించి, పద్మాసనాసీనుఁడై, వృక్షమూల మున వనదేవుఁడే వేంచేసి యుండెననని తలచి భక్తితో నిమీలిత నేత్రయై తాను దెచ్చిన పాయసాన్నమతనికి సమర్పించెను. శాక్యఋషి యా పాయసాన్నమును మిక్కిలి యాప్యాయముగ భుజించెను. అతని శరీరమునఁ కొక క్రొత్త దార్ఢ్యము మలము కొనె ను. అతఁడా పాయసాన్నమునకా రుచి యెట్టు వచ్చినదని సుజాతను ప్రశ్నించెను. ఆమె చేతులు మోడ్చి, "వనదేవ ప్రభూ! మా మందలోఁ గల నూరు పాడి యావుల బిదికి అరువది యావులకు

బోసి, వాని పాలు తిరిగి యట్టే యిరువదియేదు మొదవులకు బోసి, తిరిగి వాని పాలు పంద్రెం డావులకు, వాని పాలా రావులకు బోసి యా యాల పాలతో నీ క్షీరాన్నమును సిద్ధ మొనర్చితిని. నా తొలి మొక్కు చంద మిదియే" యని వచించెను. తిరిగి యామె శాక్యమునినిఁ గాంచి "ప్రభూ! నీవే దివ్యపురుషుడవో, లేక సాక్షాత్కరించిన వనదేవప్రభువో! మనుష్య రూపము ధరించి నన్నుఁ గరుణింప వచ్చితివ"ని భక్తిపూర్వక ముగఁ బ్రశ్నించెను.

శాక్యముని, మందహాసరుచిరాననుఁడై మధుర గంభీర స్వరమున "తల్లీ! నీ సుతుడు చిరాయువై వర్ధిల్లుగాక! నేనే దివ్యపురుషుడను గాను. తొల్లి, యొక రాజకుమారుడను. ఇప్పుడు సత్యాన్వేషినైన యోగినైనాను. దివ్యజ్ఞానోదయము కొఱకు వేచియుండగా శరీర దౌర్బల్యమున స్పృహ తప్పినది. నీవు పెట్టిన క్షీరాన్నము ప్రాణములు నిలిపినది. పాలిచ్చిన తల్లిమేలు, పాయసాన్నము పెట్టి, ప్రాణదాన మొనరించిన నీ మేలు తుల్యములే!" యని వచించెను. సుజాత కనుగొల్కుల వెలుగు వెల్లువలో భవిత సంతృప్తి వెల్లివిరిసెను.

శాక్యముని మరల సుజాత పుత్రుని దీవించెను. అతండామె జీవితములో గోచరించిన సరళ సంతృప్తి కానందించి, ధ్యాన నిమగ్నుఁడగుచుండ సుజాత నమస్కారపూర్వకముగ నతని వీడ్కొని యింటికిఁ బోయెను. గౌతమయోగి తపస్సాధనను పరిశీలించుచున్న యతిపంచక మాతడు సుజాత యాతిథ్యము కడుపార నారగించి, భ్రష్ట తపస్వియయ్యెనని విచారించి, యా ప్రదేశమును వర్జించి, యోగసాధనకుఁ తత్త్వజ్ఞానమునకుఁ బ్రసిద్ధి వహించిన కాశీనగరమునకై పయనించిరి. ఆనాటి రాత్రియే శాక్యముని వనదేవతాలయవృక్షమూలమును విడిచి బోధి వృక్షచ్ఛాయలో బద్మాసనాసీనుడై ధ్యాన నిమగ్నుఁడయ్యెను. కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యములు, నింద్రియ లాలసత్వము నజ్ఞానాంధకారములు శాక్యమునినిఁ వీడి భస్మమగు చున్నట్లతని మనో నేత్రమునకు దివ్య దర్శనము కలిగెను. రాత్రి

తృతీయ యామ మగుసరికి జ్ఞానోదయమైన శాక్యముని బుద్ధుఁడయ్యేను.

స్థిరసౌధామినివలె మోక్షజ్ఞానము బుద్ధుని మనస్సులో దివ్య తేజః పుంజములు వెలార్చ సాగెను. ఆ వటవృక్షమూలము దివ్యస్థలమై ముముక్షువులకు పవిత్ర యాత్రాస్థలమై వెలసినది. బోధివృక్షము ప్రపంచ బరమ పూజ్యత నార్జించుకొన్నది. ఖండ ఖండాంతరములు యుగయుగంతరము లా పవిత్రస్థలమును దర్శించి పులకింపఁ గలవు. నిర్వాణానంద మనుభవింపుచు బుద్ధుఁడ శ్లే వారము దినము లా బోధివృక్షమూలముననే యుండెను. విశ్వకల్యాణమూర్తి, జగద్వి మోచనమునకై జ్ఞానోపదేశమును సలుపుట కుప్రక్రమించి బోధి వృక్ష మూలము నుండి లేచి కాశీనగరమునకుఁ దరలి పోయెను.

కాశీనగరప్రాంతమునఁ గల ఋషి పట్టణమను మృగదావ మును బుద్ధుడు సమీపించెను. ఉరువేలారణ్యమున అతని విడిచి వచ్చిన యతిపంచకము దవుదవ్వుల బుద్ధునిఁ గాంచిరి. కాని భ్రష్టతపస్వి గౌతమ శ్రమణుకునకుఁ బ్రత్యుత్థాన మర్యాదలతో స్వాగతము సలుప నక్కరలేదు. ఎదు రేగి కమండలువు చీవరమును నందుకొన వలదు. ఇచ్చవచ్చిన నతఁడే యాసనమునఁ గూర్చుండు నని నిశ్చయించుకొనిరి. బుద్ధుడు దగ్గరకు వచ్చెను. దివ్యజ్ఞానరోచిస్సులను జిమ్ముచున్న బుద్ధుని తేజోనేత్రముల గాంచి వారి నిశ్చయమును మరచిరి. ఒకఁడు బుద్ధుని కమండలువు నందుకొనెను. మఱియొకఁడు చీవరమును బుచ్చుకొనెను. అంద అభివాదములు సల్పి వినయ సంభ్ర మములతో నతనిఁ కాసన మొసగిరి. కాని, యింకను నతని, శరీర సుఖలోలాత్వుఁడై సుజాత యొసగిన మృష్టాన్నమును స్వీకరించిన భ్రష్టతపస్వి గౌతమమునిగనే భావింపసాగి, 'మిత్రమా-గౌతమా' యని సంభాషణమునఁ సంబోధింపసాగిరి. జ్ఞానులకుపయుక్తమగు పూజ్య 'భంతే' శబ్దముతో బిలువ లేదు. బుద్ధుడు వారికి జ్ఞానోపదేశము సలిపి యుద్ధరింప దలచి, "భిక్షువులారా! తథాగతుడు సమ్యక్సంబుద్ధుడు-నేను సంపాదించిన దివ్యజ్ఞానము

నుపదేశించెదను. ఆలకించి, యనుసరించి మీరు నిర్వాణానంద మనుభవింపుడ"ని ప్రవచించెను.

యతిపంచకము కింకను సుజాత యాతిథ్య స్వీకార ఘట్టమే కల వరపెట్ట సాగినది. వారి చిత్తములు సంశయడోలాందోళితము లయ్యెను. బుద్ధుఁడది గ్రహించి, "భిక్షువులారా! మున్నెన్నడైన మీతో నాకు జ్ఞానోదయమైనదని చెప్పియున్నానా?" యని ప్రశ్నించెను. ఆ ప్రశ్న వారి హృదయాంత రాళముల నెల్ల శో ధించివైచెను. అప్రయత్నముగ 'భంతే!-చెప్పియుండలేదు'ని మారు పలికిరి. వారి మనస్సులో బుద్ధుని యెడ శ్రద్ధా భక్తు లంకురించినవి.

అంతట బుద్ధుడు వారలకు ఉపదేశ మొనరించెను.
"భిక్షువులారా!
జన్మ దుఃఖము
జన్మకుఁ గారణము జీవనతృష్ణ,
జన్మరాహిత్యమునకు మార్గము తృష్ణాసంహృతి. అష్టాంగిక పథమున ప్రవర్తించుట వలనఁ దృష్ణ నశించును.

ఈ సత్య చతుష్కమును గ్రహించిన వాఁడే జ్ఞాని". పంచ భిక్షుకులలో నొక్కఁడగు కొండిన్యుడు "భంతే! అష్టాంగ పథమును వివరింపఁ బ్రార్థన" యని విన్నవించెను.
సంయద్ధృష్టి
సంయక్సంకల్పము
సంయగ్వచనము
సంయక్కర్మ
సంయగ్జీవిక
సంయక్ప్రవృషి
సంయక్స్మృతి
సంయక్స మాధి." యష్టాంగ పథమని బుద్ధుడువివరించెను.
"ప్రాణి తన్ను తానే రక్షించుకొనవలెను. చేసిన కీడు చెందక తప్పదు. దుఃఖము దుష్కృత్యముల వలన సంభవించును.

సుకృత్యముల నాచరించి నిర్వాణ పథమును బొందవలెను. యజ్ఞ యాగాదులు పాపమును బరిహరింపఁ జాలవు. 'భూత దయయే యుత్కృష్ట ధర్మము"

చల్లని చూపు, దయామృత తరంగిణులు వెల్లువలు వారిన హృదయము, తేజఃప్రసన్న వదనముతో బుద్ధుడు మృగదావమున సల్పిన ధర్మ ప్రబోధమును మొట్టమొదట నాకర్షించు భాగ్యము యతిపంచకమునకుఁ గలిగెను. ఉపదేశము నాకర్షించిన వెంటనే కొండిన్యుడు బుద్ధుని పాదముల వ్రాలి ప్రవ్రజ్య దీక్ష నర్థించెను. బుద్ధుడు, కొండన్న జ్ఞాని యయ్యెనని సంతోషించుచు నాతనికిఁ బ్రవ్రజ్యాశ్రమమును ఉపసంపదయు నొసంగెను, తరువాత మిగిలిన నలుగురు యువతులను బొద్ధుని శాస్తగా పరిగ్రహించి, ప్రవ్రజ్యోపసంపదల నందిరి.

మృగదావమున శిష్యులు దెచ్చియిచ్చు భిక్షాన్న మారగించుచు బుద్ధుడు తన ధర్మచక్ర ప్రబోధమును వెలయించుచు నచ్చట కొంత కాలము నివసించెను.

కాశీపట్టణప్రాంత మందలి మృగదావమున శిష్యులకు ధర్మ ప్రబోధము సలుపుచున్న బుద్ధ భగవానుని కీర్తి కాశీపట్టణమునకు వ్యాపించెను. ఆ చోటే ఋషివాటిక, సారనాథ్‌గా బ్రసిద్ధి కెక్కెను. ప్రజలు నిత్యము బుద్ధ భగవానుని సందర్శించి పోవుచుండిరి.

కాశీపట్టణమున సుప్రసిద్ధ వణిజుని పుత్రుడు యశుడు. మహా సంపన్నుడ కుద్భవించిన యశుడు భోగలాలసుడు. అతడు ఋతువుల మార్పున కనుగుణముగ నిర్మించుకొన్న గ్రీష్మ, వర్ష, హిమ హర్మ్యముల సంతత సంగీత గాన వినోదములఁ బ్రుద్దు పుచ్చుచుండెను. ఒకనాటి రాత్రి వేశ్యల నృత్యగీత మధ్యమున యశుడు నిద్రించెను. వేశ్యలును గనులు మోడ్చి విశ్రమించిరి. యశుడు కనువిచ్చి చూచు సరికి నిద్ర శవులైన యా వేశ్యల యవయవములలో దొల్లిటి జగన్మోహన సౌందర్యదీధితులు తొలుకాడుట లేదు. నృత్యసమయమున వేశ్యల యాహార్య

చాతుర్యము కల్పించిన దుర్రృను, కనికట్టుల కా యశుడు నివ్వెర పోయెను. ఎండమావులను వలచిన తన యవివేకమును నిందించుకొనుచు యశుడు తన భోగమందిరమును విడి నగరమున కలయ దిరిగి చివరకు బుద్ధవిహారమున కేగ, దలపోసి మృగదావమును జేరెను.

ముసి ముసి చీకటులు చెదరిపోవుచున్న యా వేకువ వెలుంగులో నొంటరిగ నడయాడుచున్న యశునకు దవుదవ్వుల విహార ప్రాంగణమున బుద్ధ భగవానుడు గోచరించెను. అతడు బుద్ధ భగవానుని పాదములపై బడి రిత్తబ్రదుకు నుండి రక్షింప వేడుకొనెను.

బుద్ధుడు "సంతాపము, దుఃఖభారము, శూన్యభావము తొలిగించు వెలుంగు కలదు. నీకు జ్ఞానోదయము కాగలదు. ఇటు కూర్చుండు మ"ని యశుని జేరెను. యశుడు తన కాంచన పాదరక్షల వవీడి బుద్ధ భగవానునకు నమస్క రించి, యతని పాద సమీపమునఁ గూర్చుండెను. బుద్ధుఁడతని చిత్తశుద్ధి గ్రహించి, ధర్మ బోధకము లగు ననేక కథలను జెప్పెను. యశుని పరితాప ముదయ భానుని కోమల కిరణ ద్యుతులచే మాయమై పోయెడి చిమ్మ చీకటివలె నంతరించెను.

ప్రాతఃకాలమున యశ డింటి యొద్ద గన్పింప లేదు. తల్లి తండ్రి యగు శ్రేష్ఠితో జెప్పినది. యశుడు స్వేచ్ఛా విహారి. అతనికి శత్రు వులు లేరు. ఇష్టభోగవిలాసముల ననుభవించు నతం డిల్లు విడ నేల? శ్రేష్ఠి నగర మంతయు దిరిగి చివరకు బుద్ధ విహారమును జేరెను. అచ్చట శ్రేష్ఠి తేజోపరివేషముతో గన్నులకు మిరమిట్లు గొలుపుచు వెలుగు చున్న కరుణాశ్రీ బుద్ధునిఁ గని యతనికి సాష్టాంగప్రణామము లొనర్చి, నిలువెల్ల పులకించి బాహ్యస్మృతిని వీడెను. శ్రేష్ఠి తెప్పరిల్లి, యా విహారము నందలి బుద్ధభగవానుని సత్యస్వరూపుఁ లైన యతిపంచకమును గాంచి, పరిశుద్ధ మనస్కు డయ్యెను. అతడు బుద్ధ భగవానుని డాసి, తరుణోపాయము

అనుగ్రహింప వేడుకొనెను. బుద్ధుడు కరుణించి, యత నికి "శరణ త్రయ దీక్ష" నిచ్చెను.

బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి

ఇవి, శరణత్రయము. బుద్ధుని శిష్యసంఘములోఁ జేరు వారీ మూడు దీక్షలను గైకొన వలెను. ఈ శరణత్రయమును గైకొనిన తొలి యుపాసకుడు శ్రేష్ఠియే. బుద్ధోపాసకుఁడైన పిమ్మట శ్రేష్ఠి కుమారునిఁ గాంచి, "తండ్రీ! మీయమ్మ నీ కొఱకు గాసుకొని బెంగటిలి యున్నద"ని నుడువుట తోడనే, బుద్ధుడు "శ్రేష్ఠీ! నీవు నిరర్థకములు తుచ్ఛములు అని నిరసించిన సంసార వ్యామోహముల వైపునకే నీ పుత్రు నేల పురికొల్పు చున్నావ"ని సూటిగఁ బ్రశ్నించెను. శ్రేష్ఠి పశ్చాత్తాపము చెందెను. బుద్ధ భగవానుని ఉపదేశముల నాకర్ణించుచున్న యశుడు తన కల్మషములు దొలగ, శుద్ధుడై, సన్యాసము నుపసంపద నందెను.

శ్రేష్ఠి బుద్ధుని శిష్యసమేతముగ దన గృహమునకు విందున కాహ్వానించి వెడలి పోయెను. బుద్ధుడు తన శిష్యులకు శిరో ముండనము, కాషాయ వస్త్ర ధారణము, విహార నివాసమును విధించెను. ఐశ్వర్య భోగ ములతో దుల దూఁగుచున్న కాశీశ్రేష్ఠి పుత్రుడు యశుడు గడ్డము మీసలు దీసి శిరోముండనము గావించుకొని కాషాయాంబరధారియై బౌద్ధ సన్యాసి యయ్యెననువార్త ప్రజల కాశ్చర్య మొదవించెను. బౌద్ధ మత మన్న ప్రజలకు బూజ్య భావ మేర్పడెను.

యశని మిత్రులు ప్రఖ్యాతశ్రీమంతులు విమలుడు సుబాహుఁడు, పూర్ణజిత్తు గవాపతి బుద్ధుని శరణు వేడి సన్యాసమును స్వీకరించిరి. తరువాత నేబదిమంది పెద్దలు బుద్ధుని ప్రభావమును విని ధర్మదీక్ష నర్థించి, ప్రవ్రజ్యము, బోధ, నుపసంపద నొందిరి. అప్పటికి బౌద్ధమత సంఘమున నరువదిమంది యర్హతు లేర్పడిరి.

బౌద్ధ భిక్షువులు నానాదిశలకుఁ బోయి జిజ్ఞాసువులం దోడ్కొని రాసాగిరి. భిక్షువుల సంఖ్య క్రమక్రమముగ నధికమయ్యెను. ఒకనాటి సాయంకాలమున బౌద్ధ భిక్షువుల నందఱ జేర్చి బుద్ధు డుపన్యసించెను.

'ప్రజాహితార్థము మీరు ధర్మప్రచారము సలుపుడు. శరణ త్రయ దీక్ష నొసగి భిక్షువుల సంఘమునఁ జేర్పుడు. భిక్షువులు బ్రహ్మచారులై సంఘవిహారముల గఠోర నియమ బద్ధులై దశ శిక్షా పథముల ననుసరించి దినచర్య దిద్దుకోవలెను.

౧. జీవహింస సలుపరాదు.
౨. పరద్రవ్యాపహరణము చేయరాదు.
౩. పాప కార్యములు చేయఁగూడదు.
౪. అసత్య మాడరాదు.
౫. మద్యపానము కూడదు.
౬. అకాల భోజనమును విసర్జింప వలెను.
౭. నృత్య గాన వినోదములకు దూరముగ నుండవలెను.
౮. గంధ మాల్య సుకుమార వస్త్ర భూషణములు వాడరాదు.
౯. ఉన్నతాసన వాహనము ఉపయోగింప రాదు.
౧౦. రజత కాంచనములు వాడఁగూడదు.
ఇవి బుద్ధుడు శాసించిన దశ శిక్షా విధులు.

భిక్షుక శిష్యులను ధర్మప్రచారముకొఱకు వివిధ రాజ్యము లకుఁ బంపి, ఋషిపట్టణమునుండి బుద్ధుఁ డురువేలారణ్యమున కేగెను. ఉరువేలారణ్యమున నురువేలకాశ్యపుడు, నదీకాశ్యపుడు, గయా కాశ్యపుడు నను ముువ్వురు జడదారు లుండిరి. ఉరువేల కాశ్యపుఁ డైదు వందల జడదారులకుఁ బీఠాధిపతి. తక్కిన వారలు మూడు వందలు రెండువందల జడదారుల కధిపతులు. వీరు ఉరువేలారణ్యమున నాశ్రమములు గల్పించుకొని వేదోక్తముగ యజ్ఞకర్మ లొనరించుచున్న సుప్రసిద్ధ సనాతన పండితులు.

బొద్ధు డురువేల కాశ్యపుని యాశ్రమమును జేరెను. ఉరువేల కాశ్య పుడు జ్ఞాన తేజస్వియైన బుద్ధునకు ఆతిథ్యమర్యాదలు సల్పి యతని నచ్చట నివసింప వేడెను. బుద్ధుడతని యగ్ని హెూత్రశాలయందు నివసింప సాగెను. అచ్చట నొక మహాసర్పముండెను. అందుచే నచ్చట బుద్ధుడు వసించుట మిక్కిలి ప్రమాదకర మని కాశ్యప ఋషి హెచ్చ రించెను. కాని బుద్ధుడు సరకు గొన లేదు. మఱునాటి ఉదయమున నా మహాసర్పము బుద్ధునిఁ భిక్షాపాత్రలో నొదిగి యుండెను. ఉరువేల కాశ్యపుఁడచ్చెరువంది, మహాశక్తి సంపన్నుఁడైన బుద్ధున కభివాదము గావించెను.

ఇట్లే బుద్ధుని మహిమ గుర్తించి, యురువేల కాశ్యపుఁడు తన శిష్యసంఘముతో బౌద్ధ సంఘమునఁ జేరెను. ప్రఖ్యాత పండితుఁ డురువేల కాశ్యపుఁడు బౌద్ధసంఘమునఁ జేరిన వార్త విని, నదీ గయా కాశ్యపులు తమ తమ శిష్యులతో వచ్చి బుద్ధునిఁ శరణు వేడి ధర్మభిక్షకు లైరి.

బుద్ధు డురువేలారణ్యమును వీడి, రాజగృహమును జేరెను. అచ్చట యష్టికా వనమున శిష్యసంఘముతో బుద్ధుఁడున్న వార్తవిని బింబిసార చక్రవర్తి ద్వాదశ పండిత పరివృతుఁడై తరలివచ్చి బుద్ధు భగవానునకు అభివాదము సల్పి యాసీనుఁ డయ్యెను.

అచ్చట వాఁ డురువేల కాశ్యపపండితుని గాంచిరి. అతడు బుద్ధ శిష్యుఁడా? బుద్ధుఁడే యతని శిష్యుఁడా? చక్రవర్తికి, పండితులకు సందే హము కలిగెను. బుద్ధ భగవానుడు చిరునవ్వు లొలికుచు, నురువేల కాశ్యపునితో "కాశ్యప ఋషీ! యజ్ఞాది కర్మల విడి శరణత్రయ దీక్ష నేల గైకొంటివో యా పండితు లెఱుగ గోరుచున్నారని" వచించెను. అతడు లేచి బుద్ధునకు సాష్టాంగ దండ ప్రణామ మొనర్చి, "నిర్వాణా నందమనుభవించుటకొఱకై పరమపూజనీయుఁడైన బుద్ధు భగవానుని శాస్తగా స్వీకరించి ధన్యుఁడ నైనాను. తథాగతుడు బుద్ధ భగవానుడు. నేను శిష్యపరమాణువున"ని వచించెను. బుద్ధుడు, పండితులకు బింబిసార చక్రవర్తికి ధార్మిక కథలను, సత్య చతుష్కము నష్టాంగ

మార్గము నుప దేశించెను. పండితులు బౌద్ధోపాసకు లైరి. బింబిసార చక్రవర్తి, బుద్ధు భగవానుడు మాటలిచ్చిన ప్రకారము, జ్ఞానోదయ మొందిన పిమ్మట దిరిగి రాజగృహమున కరుదెంచినందుకుఁ గృతజ్ఞత దెలిపి బౌద్ధ సంసారి యయ్యెను. అతడు బౌద్ధ భిక్షువుల కొఱకు వేణు వన విహారమును నిర్మించెను.

రాజగృహమున రెండు వందల యేబది సన్యాసుల కధిపతి సంజ యుండను మహాంతు కలడు. సారిపుత్రుడు మౌద్గల్యుడు నతని ముఖ్య శిష్యులు. ఒకసారి సారిపుత్రుఁడు ఢశ్వజిత్తను బౌద్ధభిక్షుకుఁడు ప్రసన్న సౌమ్య శాంత మూర్తియై పోవుచుండుట గాంచి యాతని వలన బౌద్ధ ధర్మమును విని బుద్ధదేవుని దర్శింపుటకు సహవ్రతుఁడైన మౌద్గల్యునితోఁ గలసి వెడల దలచెను. గురువు సంజయుడు నిరోధించెను. కాని వారల నిశ్చయము సడల లేదు. "మహంతు పదవి నా యనంతరము మీదే! ఏల వదలి పోఁ జూచెద"రని సంజయుడు వారల దీక్షను సడలింపఁ బ్రలో భమును గల్పించెను. కాని వారు నిరర్ధకమైన లౌకిక సంఘమునే వదలి, నిర్వాణానందము నందుటకుఁ బో జూచుచుండ "మహాఁతు పదవి" యడ్డ గలదా! వారు సంజయుని విడి జ్యోతిర్మూర్తియైన బుద్ధునిఁ కడ కరిగి బౌద్ధసంఘములోఁ జేరిరి. సంజయుడు తన్ను విడిచిన శిష్యులపై నిందా శాపముల వర్షించెను. అతని శాప గర్జనలు శూన్యాకాశమునఁ లీన మైనవి.

బుద్ధుడు రాజగృహమున నుండగ శుద్ధోదనుఁడతని కీర్తి విని సహస్ర రాజబంధువుల నమాత్య వర్గముతో నతని దోడ్కొని దెచ్చుటకు బంపెను. అమాత్యులు, రాజపురుషులు రాజగృహమున కరిగి బుద్ధునిఁ దర్శించి, భిక్షుసంఘమునఁ జేరిపోయిరి. శుద్ధోదన మహారాజు పుత్ర వియోగముచే నందిన పరితాపము బుద్ధునఁ కమాత్యులు వివరించిరి. బుద్ధు డచటినుండి కపిల వస్తు పురమునకు కేగెను.

కపిలవస్తు నగరమున బుద్ధుని పునరాగమనము మహెూత్సవముగ వెల్లివిరిసెను. బుద్ధునకుఁ దన బాల్యము, జనకుని

వాత్సల్యము చిననాటి విద్యా వ్యాసంగములు; యశోధరాదేవి; యంతఃపుర క్రీడలు; రాహులుని బోసి నవ్వులు స్మృతిపథమునం దగిలినవి. రాజవీధుల శిష్య సంఘముతో బుద్ధుడు భిక్షాటనము సలుపుచు దరలి రాసాగెను. శాక్య యువరాజు కాషాయాంబర ధారియై, పాదచారియై, భిక్షాపాత్రికను బూని బిచ్చ మెత్తుకొనుచు వచ్చుచుండెను. శుద్ధోదన మహారాజున కా దృశ్యము దుస్సహ మయ్యెను. ప్రజలు తండోపతండములుగ మూగిరి. పుర మంతయు నలంక రింపంబడియుండెను. పురవీధుల బుద్ధుడు నడచిపోవు చుండ సౌధ హర్మ్యముల పైనుండి పూల వర్షము విరిసినది. ప్రజలు సాష్టాంగ ప్రణామము లొనర్చుచు భిక్షుసంఘములోం జేరిపోసాగిరి. బుద్ధుడు కపిలవస్తు రాజ ప్రాసాదమును జేరెను. శుద్ధోదన ప్రభువు బుద్ధునిం గాంచి యుప్పొంగి మెమరచెను. పుత్రుడు మహాజ్ఞాన తేజస్వియై, జగద్గురువై తన మ్రోల నిలిచెను. శుద్ధోదన మహారాజు జన్మ ధన్యమైనది. బుద్ధుడు తన మృదు హస్తస్పర్శచే శుద్ధోదన ప్రభువును సమ్మానించెను. శుద్ధోదనుండు బుద్ధుని మహాభి నిష్క్రమణానంతరము యశోధర గడపిన నిర్మల సాధు జీవిత మును నామె మనోనుతాపమును వివరించెను. బుద్ధుడు మహారాజుతో గలసి, యిద్దరు భిక్షుకుల వెంట నిడుకొని యశోధరాదేవి మందిరమున కేగెను.

యశోధరాదేవి, బుద్ధునిం కెదురువచ్చి సాష్టాంగ ప్రణామమునం నాతని పావన పాదములు కన్నీటితో గడిగి యర్ఘ్యాంజలి నర్పించెను. తృణ శయ్య, కురుచగ గత్తిరించిన శిరోజములు, కావి నారచీరలు, యశోధరా దేవి వియోగిని జీవితమును స్వయంవ్యక్త మొనర్చినవి. ఆమె యధో ముఖియై బుద్ధ భగవానుని పవిత్ర పాదములం జూడ్కులు నిలిపి, యాత్మ నివేదన మొనరించుకొన సాగినది. ఇంతలో రాహులుండు చెంగు చెంగున ఎచ్చి యశోధర చేలాంచలముం బట్టి నిలిచెను. ఆమె, రాహులుని చేతులు మోడ్చి, "తండ్రీ! జగద్గురువా మీ తండ్రిగారికి నమస్సు లర్పింపు మని" యుద్బోధించెను. రాహులుడు బుద్ధుని పాదములు నొరగి, లేచి యతని కాషాయాంబరముం బట్టి యొదిగి నిలిచెను. బుద్ధుడు సారీ పుత్రుని బిలిచి, "ప్రాపంచిక సంపదలు

నశ్వరములు. శాశ్వత నిర్వాణానందమునఁ కీ బిడ్డడు వారసుఁడగు గాక. ఇతనికి దీక్ష నిమ్మ"ని యాదేశించెను.

బుద్ధుఁ డంతఃపురమును వీడి కపిలవస్తు పురోప్రాంతమున రోహిణీ నది తీరమున గొంతకాలము వసించెను. ఆనందుడు, నందుడు, మున్నగు శాక్యరాజకుమారులు బౌద్ధభిక్షుకులై సంఘమునఁ జేరిరి. బుద్ధుడు కపిల వస్తుపురమును వీడి మల్క, కోసల రాజ్యములఁ ధర్మప్రచారము సలిపి, భిక్షు సంఘమును విస్తరించెను.

బుద్ధుడు ప్రాతఃకాలమున మేల్కొని స్నాన మాచరించి యేకాంత ధ్యాన నిమగ్నుఁడయ్యెడివాఁడు. తరువాత విహారమును విడి యొంటి రిగా గాని భిక్షుకులతోఁ గలిసి గాని సమీప గ్రామముల భిక్షాటనము సలిపెడి వాఁడు. గృహస్థులు, గృహిణులు, బుద్ధ భగవానుని యాగమన మును బ్రతీక్షించి నానావిధ భక్ష్య భోజ్యముల సమర్పించెడి వారు. బుద్ధుని భిక్షు సంఘ సమేతముగ, గొందఱు గృహస్తు లాహ్వానించెడి వారు. అట్టి యాహ్వానములఁ బుద్ధభగవానుఁ డప్పు డప్పుడు మన్నించెడి వాఁడు. భోజ నానంతరము ధర్మప్రబోధము. కథారూపమునఁ బ్రశ్నోత్తర రూపమున సంవాదసూత్ర రూపమునఁ సోపాన క్రమమున బుద్ధబోధలు వ్యాప్తి గాంచెడివి. గ్రామములనుండి విహారమున కేతెంచి పాద ప్రక్షాళనానంతరము బుద్ధుడు భిక్షు సమావేశమున ధర్మోపదేశము సల్పుచుండెడి వాడు. ఆరామమునఁ గ్రామీణులకు బుద్ధుడు ధర్మోపదేశము సలుపుచుండెడి వాడు. పద్మాసనాం కితుఁడై, ధ్యాన నిమగ్నుఁడైన బుద్ధునిఁ గాంచి సంసారక్లేశ పరితప్తులైన ప్రజ అద్భుతానంద పరవశులై యతిలోక శాంతి ననుభ వించెడి వారు. మౌన ముద్రాముద్రితుఁడు, నర్ధనిమీలిత నేత్రుడు నైన బుద్ధుని నిదిధ్యాసలో ననుచ్చారితమయ్యు దివ్య శాంతి సందేశము దిగ్దిగంతముల ప్రజల హృదయాంతరాళములఁ గమ్మకొనుచుండెడిది. ఆ విగ్రహమూర్తినే శిల్పులు ఖండ ఖండాంతరములలో చెక్కి ప్రతిష్ఠించి యున్నారు.

రాజగృహమున నొక శ్రేష్ఠి బుద్ధుని, భిక్షక సంఘమును దన యింట భిక్షావందనముల కాహ్వానించెను. అతని భావమరది యనాథ పిండకుఁడా విందున కేతెంచి బుద్ధు భగవానుని సందర్శించి యానంద తన్మయుఁడయ్యెను. బుద్ధుని భిక్షు సంఘమును, వారి శాంత గంభీర సుప్రసన్నవదనములను గాంచి లౌకిక క్లేశచ్ఛన్నమైన బ్రదుకు తుచ్ఛ ముగఁ దలపోయ సాగెను. ఉదయమునే యతడు బుద్ధు భగవానుని సందర్శించి "భగవన్! రాత్రి తమకు సుఖముగా నిదుర పట్టినదా?" యని కుశల ప్రశ్నమునఁ బరామర్శించెను. బుద్ధు భగవానుడు మందహాస మందన విలసత్స్ఫెలుఁడై "కోప రహితుడు, వాంఛా విహీనుఁడు, నిర్భయుడు నిర్లిప్తుడు నెల్లప్పుడు సుఖనిద్ర చేయుచునే యుండును. నిర్వాణ ప్రాప్తుడు నిత్యానంద శీలి" యని ప్రవచించెను. అనాథపిండకునకు నిర్మల సాధు భిక్షు జీవితమే పరమార్థ మని దోచెను. అతడు తథా గతు నాశ్రయించి శరణ త్రయ దీక్ష గైకొని బుద్ధోపాసకుడయ్యెను. అతడు బుద్ధుని శ్రావస్తీ నగరమున కాహ్వానించెను.

బుద్ధుడు ధర్మ ప్రచారార్థము దేశదేశములం దిరుగాడెను. ఆ యాత్రలలో వర్షాకాలమున మాత్రముక విహారమున నుండెడి వాడు. అనాథ పిండకుని యాహ్వానము నంగీకరించుచు బుద్ధుడు, తథాగతులు శూన్యాగారములు నగరముల వెలుపలి ప్రశాంతసీమలలో నుండఁ దలతురని చెప్పెను.

అనాథపిండకుడు బుద్ధునిచే నను జ్ఞాతుడై శ్రావస్తీ నగరమున కరిగెను. అచట బుద్ధదేవుని కనువగు విహారమును నిర్మించుటకొఱకు దగిన స్థలము ననేషింప సాగెను. అచ్చట జేతరాజకుమారుని యుద్యాన వనవాటిక యనాథపిండకుని నాకర్షించెను. అచట విహారమును నిర్మించిన లోకోత్తర మనోజ్ఞముగ నుండును కాని- రాజకుమారున దా యుద్యానవనము. అనాథ పిండకుడు జేతరాజకుమారుని కడ కేగి యుద్యానవాటికను విక్రయింప వేడెను. రాజకుమారుడు దుద్యానవాటిక నంతను సువర్ణ నిష్కములచే గప్పిన గాని విక్రయించుటకు సంసిద్ధుడు

కాలేదు-అనాథపిండకుడు సమ్మతించెను. అనాథపిండకుడు తన సర్వస్వమును వెచ్చించి యుద్యానవాటికను సువర్ణ నిష్కములచే గప్పసాగెను. చివరకు ద్వారసీమ మాత్రమే మిగిలెను. అనాథపిండకుని ధర్మపరత్వమునకు జేతరాజకుమారుడచ్చెరు వొంది, ద్వారభాగమును దన దానముగ గ్రహింప నతని వేడుకొని తాను గూడ బుద్ధోపాసకుడయ్యెను. రాజకుమారుడు బుద్ధసంఘమున జేరుట కనాథపిండకుడు సంతోషించి దానికే సమ్మతించెను.

జేతవనవిహారము పరివేణము కొట్టములు, సభాగృహములు, విహార శాలలు, స్నానాగారములు, పుష్కరిణులు, మండపములతో వెలసినది. బుద్ధ భగవానుడా జేతవన విహారమున జాల కాలము ధర్మ ప్రబోధము సల్పుచు నివసించెను.

బుద్ధ భగవానుడు పూర్ణపురుషాయుష మనుభవించి వివిధప్రాంత ముల ధర్మ ప్రబోధమును సల్పెను. వైశాలీ నగరమున నంబపాలి వన విహార చైతన్యమున నివసించుచుండగా బుద్ధుడు వ్యాధి గ్రస్తుడయ్యెను. ఆ వర్షాకాలమున భిక్షుకుల నచ్చట నివసింప నాదేశించి బుద్ధుడు వేణు గ్రామమున కరిగెను. అచ్చట మూడు దినములాతడు రక్తగ్రహణిచే బాధ నొందెను. నాల్గవనాడు బుద్ధుడు స్వస్థత చెందిన పిమ్మట నానందుడు సంతోషించి, గురువుగారి కభివాదముల నర్పించెను. బుద్ధ భగ వానుడు చిరు నవ్వు లొలికి, "జీర్ణావస్థ నొందిన శరీరముతో బొత్తుఁ దొలగు కాల మాసన్నమైనద"ని వచించెను. తథాగతుని యాసన్నపరి నిర్వాణ మానందుని హృదయమును మిక్కిలి కలవర పెట్టసాగెను. బుద్ధు డానందునితో గలిసి పావాగ్రామమున నామ్ర వనవిహారమున కరిగెను. ఆ విహారమును గట్టించిన చుందకర్మార పుత్రుడు బుద్ధుని, భిక్షుక సంఘ మును బూజించి పెద్దవిందు చేసెను. అదియే బుద్ధు దేవుని తుది భోజనము.

బుద్ధుదేవుడచటినుండి కుసినార యందలి సాలవన విహారమున కేగెను. ఆనందుని బిలిచి బుద్ధుడు తన కళేబరమును

సుగంధ కాష్ఠ ముపై దైల ద్రోణ నిక్షిప్త మొనర్చి యగ్నిసంస్కార మొనర్చి స్మారక స్తూపమును నిర్మింప నాదేశించెను. ఆనందుడు వెక్కి వెక్కి యేడ్వ సాగెను. బుద్ధు డతని వారించి "ఆనందా! శోకింపకుము. పుట్టినవారికి గిట్టక తప్పదు. నిర్వాణప్రాప్తి నొందెడి తథాగతుని కై దుఃఖింప నేల? ధర్మ ప్రచారము చేసి నీవు కూడ ముక్తుడవు కాగలవ"ని యతనిని నోదార్చెను.

తథాగతుని యాసన్న నిర్వాణవార్త కుసినార వాసుల దుఃఖమున ముంచెను. ఆ రాత్రి సాలవృక్షచ్ఛాయలో బుద్ధు భగవానుడు ధ్యాన సమా ధిని గడచి, నాకాశానంత్యాయతన ప్రాప్తినొంది "మహా పరి నిర్వాణము" ను జెందెను.

కుసినారవాసులు తండోప తండములుగ నరుదెంచి బుద్ధ భగవానుని తుది సందర్శనము చేసికొనిరి. భిక్షుకులు కుసినారవాసులు తథాగతుని పవిత్ర కళేబరమును నూత్న వస్త్రాలంకృతము జేసి తైల ద్రోణ నిక్షిప్తము గావించి, పరిమళ కుసుమ సంపూజిత మొనరించి "ముకుట బంధన" చైత్యమున సుగంధ కాష్ఠమున బూజాప్రణామములతో నగ్ని సంస్కారము గావించిరి.

బుద్ధశిష్యుల పవిత్ర చితాభస్మమును దంత, చందన, స్వర్ణమణి కరండములలం దిడి మహాచైత్యవిహార హర్మ్యములను విహారములను నిర్మించిరి. బుద్ధధాతువులను భిక్షుకులు నానా ప్రాంతములకు గొని పోయిరి. బుద్ధుని యస్తికలను, దంతములను, నఖలేశములైన జేర్చి తరువాత బ్రజలు మహారాజులు చక్రవర్తులు మనోజ్ఞ స్తూపముల నిర్మించిరి. అశోక చక్రవర్తి కాలమున భారతదేశము, ప్రాచ్యఖండములోని సింహళ కళింగ ద్వీప సముదాయము, చంపా సువర్ణ తిబెట్టు చీనాదేశములు బుద్ధుని ప్రబోధముల నౌ దల దాల్చినవి. శిల్పులు, పర్వత పాషాణముల దొల్చి బుద్ధదేవునికి దివ్యమందిరములు నిర్మించిరి. చక్రవర్తులు రాజ్య జిగీష నుజ్జగించి ధర్మ చక్రమును బూజించిరి. బుద్ధ భగవానుని యుద్భవము మానవజాతికే గాక, సమస్త జీవకోటికి

మహోదయము. జీవహింస కూడదని దుందుభి వాజ్నినాదముల ప్రపంచమున కెలుగెత్తి చాటిన కరుణాశ్రీ ప్రబోధ ఫలితముగ లోకమున నెందరో నేటికిగూడ శాకా హారులుగ నున్నారు. ప్రపంచ చరిత్రలో నే మానవుని యవశేషములను బుద్ధ భగవానుని పవిత్రాస్థికల వలె చారిత్రాత్మిక పూజ్యత నందలేదు.

బుద్ధుని యహింసావాదము, సాధుశీలనిష్ఠ జగద్ధితాకాంక్ష సౌశీల్యపరత, యిహలోకమునే స్వర్గలోకముగ దీర్చి దిద్దుటకు మహోదారమగు సాధనను గల్పించెను. రాజపుత్రులు, అంతఃపురమును వీడి విశ్వశ్రేయము కొఱకు వసుధైక కుటుంబులై జీవితముల నొడ్డి ఖండ ఖండాంతరముల బుద్ధు భగవానుని దివ్యప్రబోధమును వెలయించిరి. యుగ యుగాంతర ముల ఖండ ఖండాంతరముల ముముక్షువులకు బుద్ధు భగవానుని జన్మభూమి పవిత్ర తీర్థయాత్రాస్థల మైనది.

బుద్ధు భగవానుని గన్న భారత దేశము నిత్య పవిత్ర పుణ్య సీమగ జరిత్రలో స్థిర కీర్తి నార్జించుకొన్నది.

# బుద్ధుని ప్రబోధములు.

"వైశాఖపూర్ణిమ"-బౌద్ధమతస్థులకు పరమ పుణ్యదినము. బుద్ధుడు పుట్టిన దినము-బోధివృక్షము క్రింద బుద్ధుడైన దినము కుసినారము నందు మహాపరినిర్వాణము నందిన దినము వైశాఖపూర్ణిమయే. బుద్ధుడు జన్మించిన లుంబినీవనము, మహాబోధివృక్షమున్న బుద్ధగయ, తొలి ప్రబోధము సల్పిన సార్నాధ్, మహాపరినిర్వాణము నందిన కుసినారము బౌద్ధులకు పవిత్రయాత్రాస్థలములైనవి. బుద్ధుని అస్తికలను చితాభస్మమును పరమ పవిత్రముగ పరిగణించి దేశదేశాంతరములలో శిష్యులు వానిపై స్తూప ములను నిర్మించినారు.

అశోక చక్రవర్తి హృదయములో కళింగ దండయాత్ర నెరపిన పరిణామము జగద్విదితమైన సన్నివేశము. అశోకుని నాటినుండి బౌద్ధము నేల నాలుగు చెఱగులకు వ్యాపించి ప్రపంచమత మైనది. భారతభూమి నుండి బౌద్ధమతము ద్వీపద్వీపాంతరములు వ్యాపించినది. ప్రాచ్యప్రపంచ మంతయు ప్రాచీన కాలమున బౌద్ధమతము విస్తరిల్లినది. ప్రపంచ చరి త్రలో సంఖ్యాబలమున బౌద్ధ మతమునకే ప్రథమ పరిగణనము లభించును. చీనా జపాను మలయ సువర్ణభూమి తిబెట్టు-ఇండోనీషియా-బర్మా తాయ్‌లెండు -వియత్నము మున్నగు దేశములలో బౌద్ధ మతము అల్లు కొన్నది. ఇది అంతయు రక్తపాత రహితముగ-కత్తిసాయము లేకుండ జరిగినట్టిదియే. ప్రపంచ చరిత్రలో అధిక సంఖ్యాకులను ఆకర్షించిన బౌద్ధ మతము జన్మభూమియైన భారతదేశములో అంతరించుట పేర్కొనదగిన వింతలో పెద్దవింత. బౌద్ధమతము-భారతదేశములో అంతరించినదని చెప్పుటకంటె హైందవ మతములో అంతర్లీనమైపోయినదనుటయే సమం జసము.

గాంధీమహాత్ముని అభిప్రాయము అనుశీలింపనగును. "బుద్ధుని ప్రబోధములలో ముఖ్యముగా పేర్కొనదగినవి నేటి

హిందూమతములో అవిభాజ్యమైన అంశములుగా రూపొంది యున్నవి. ఈనాటి హైందవభారత దేశము-చరిత్రను వెనుకకు త్రిప్పి-గౌతమ బుద్ధుడు సాధించిన సంస్కార మును కాదనలేరు. ఆ మహానుభావుని మహాత్యాగము, వైరాగ్యము పరమ పవిత్రత హిందూమతములో చేరిపివేయరాని ప్రభావముద్రను వెలయించి నవి. ఆ జగద్గురునకు హిందూమతము శాశ్వత ఋణగ్రస్తము. సనాతన హైందవ మతములో ఉత్కృష్టతమైన అంశములను స్వీకరించి వేదవాఙ్మ యములో నిరుపయోగమైన కలుపు మొక్కలను వేరుచేసి-బుద్ధుడు తన ప్రబోధములకు నూత్న చై తన్య పూరితమైన ప్రాణ ప్రతిష్ఠ చేయగల్గెను."

స్వామి వివేకానందమహర్షి అభిభాషణము ఉదాహరింప నగును. "ఇక-సింహావలోకనముగ కర్మయోగమును ఆచరణములో అనువదించి చూపిన మహానుభావునిగూర్చి కొన్ని మాటలు ముచ్చటింపవలసి యున్నది. ఆ మహానుభావుడే బుద్ధుడు. ఆతడే కర్మయోగమును పరిపూర్ణముగ ఆచరించిన ఆదర్శ మానవుడు. ప్రపంచములోని ప్రవక్తలందరిలో-స్వార్థ త్యాగపూరితమైన కర్మయోగమును ఆచరించి చూపుటకు-అతని కే బహి రంగ ప్రేరణములును లేవు. కారణాంతరములేవి లేకుండ ప్రవర్తించిన ఆదర్శ-కర్మయోగి-అతడు. విశ్వచరిత్రలో ఉద్భవించిన ఉత్కృష్టతమ మానవోత్తముడు-అతడే. అతని కతడే సాటి. ఎన్నడు ఎచ్చట మెదడు-ఎడద సంగమించిన ఆత్మశక్తితో అట్టి మహావ్యక్తి ఉద్భవించలేదు."

బౌద్ధము చారిత్రకముగ అనన్య ప్రాధాన్యము వహించిన మతము. వేదాంత దృష్టితో గాక చారిత్రకముగ ఆమాట నొక్కి చెప్పనగును. ఏలన-ప్రపంచచరిత్రలో మహాద్భుతమైన మతోద్యమ మది. మానవ సమాజమును ఆధ్యాత్మికముగ మంచెత్తి వేసిన గొప్ప ఉప్పెన బౌద్ధమతము."

# పథమ ప్రబోధము

బుద్ధ భగవానుడు, యతిపంచకమునకు మృగదావనమున వెల యించిన తొలి ప్రబోధము బౌద్ధ వాఙ్క్యమున చిరస్మరణీయము.

"తథాగతుని పేరు పెట్టి పిలుచుట గాని మిత్రునిగా సంబోధించుట గాని కూడదు. ఏలన బుద్ధుడు పవిత్రుడు. సర్వభూతసమత-భూతదయ గల ఆతని పితృదేవునిగ మన్నింపదగును. పితృపాదుల మన్నన సలుప కుండుట మహాపాపము.

తథాగతుడు మోక్షమునకై కఠోర తపశ్చర్యల విధింపడు. అట్లని-ఐహిక భోగలాలసత్వమును ఆకాంక్షింపడు. ఆతడు- "మధ్యస్థమార్గము" కని పెట్టినాడు.

మాంసాహార వివర్జనము-దిగంబరత్వము-శిరోముండనము జటా వల్కల ధారణము-భూశిభూసరిత శరీరము- అగ్నిప్రవేశములు, భ్రమలను వీడలేని మానవులను పరిశుద్ధము చేయజాలవు.

వేదపఠనము - యజ్ఞయాగాదు లొనర్చుట – ప్రా యోపవేశము పురోహితులకు ముడుపులు చెల్లించుట - దేవతలకు బలి నై వేద్యములు అర్పించుట, అమరత్వము నొందుటకై శీతవాతప్రకోపముల నోర్చి దుష్కర తపశ్చర్యలు సలుపుట- భ్రమలను వీడనట్టి మానవులకు పరి శుద్ధ మొనర్ప జాలవు.

క్రోధము-మద్యపానము, మూఢత్వము-మాత్సర్యము- ఆత్మస్తుతి పరనింద- మోసము- దురావేశము- దుశ్చింతలు మానవులను మలిన మొనర్చును గాని మాంసాహారము గాదు.

ఓ భిక్షుకులారా! “అతి సర్వత్ర వర్జయేత్”-అని యెరుంగునది. సర్వ ధర్మ ములయందు మధ్యస్థమార్గమే ఉత్తమోత్తమము. దుష్కర తపశ్చర్య వలన-శుష్కించిన శరీరముగల మానవుని మనస్సులో మలిన సంక్షోభ భావములే రేకెత్తుచుండును. ప్రాపంచిక పరిజ్ఞాన సంపాదనకు గూడ శరీరశోషణము పనికిరాదు. ఇక ఇంద్రియములపై విజయము సాధించుటకు అది అసలే మార్గము కాజాలదు.

దీపమును నీళ్లలో వెలిగించి చీకట్లను బాపలేము. క్రుళ్లీన కట్టెలతో ఎవ్వరు అగ్నికుండమును ప్రజ్వలింపజేయగలడు? శరీరశోషణము – బాధాకరమైనది - నిరర్ధకమైనది. దురాశాలొల్యమును ఆర్పివేయకుండ, శుష్క కఠోర వ్రతముల పాటించి ఎవడు అహంకారమును రూపుమాప గలడు? అహంకారమును అణచివేయనంత వరకు శరీరశోషణము వ్యర్థము. ఐహికాముష్మిక వాంఛలున్నంతవరకు ఆహంకారము అణగదు. ఎవనిలో ఆహంకారము నశించునో ఆతనిలో ఇహలోక సుఖములపై గాని పరలోక సౌఖ్యములపై గాని కోరిక నశించును. సహజ శారీరక పోషణ అతనికి కీడు చేయదు. శరీరపోషణార్థ మతడు అన్నపానముల సేవించుగాక. నీరు - తామర చుట్టు నుండునుగాని తామర రేకులను తడుపలేదు. ఇంద్రియ లౌల్యము మనుజులను కలుషితులను చేయగలదు. ఇంద్రియలోలుడు ఆవేశములకు దాసుడు. సుఖలాలసత్వము నీచము. పతన హేతువు.

ప్రాణ పోషణకు అవసరమైన వానిని స్వీకరించుట దోషము కాదు. శరీరము సక్రమ స్థితిలో నుంచుట అవశ్యపవిత్ర కర్తవ్యము కూడ. కానిచో విజ్ఞానజ్యోతి కొడిగట్టకుండ నిల్పుటకు, మనస్సును నిర్మలముగ నుంచునట్లు చూచుటకు సాధ్యము కాదు.

బుద్ధ ప్రబోధము మధ్యస్థ మార్గము. ఓ భిక్షువులారా! విప్రతి పన్నములైన అతివాదములకు దూరముగ నుండుడు.”

బుద్ధ భగవానుని ప్రబోధమును తొలుత ఆలించిన ఆ యతిపంచకము హృదయములలో అజ్ఞాన తిమిరము -

ఉదయభానుని కోమల కిరణ స్పర్శచే తొలగిపోవు పొగమంచువలె తొలగిపోయెను.

**43**

బౌద్ధ వేదాంతమునకు ఆద్యప్రకృతులుగా భాసిల్లినవి ఆర్యసత్య చతుష్టయము.

1. సర్వము శోకమయమని యెఱుంగుట
2. శోక కారణము తెలిసికొనుట
3. శోకనిష్కృతి కలదని గుర్తించుట
4. శోకనిష్కృతికి మార్గమును అన్వేషించుట.

## పంచశీల.

బౌద్ధసంఘు ధర్మమునకు మూలసూత్రముల నేర్పరచినది పంచశీల ప్రబోధము.

1. అహింస
2. అస్తేయము
3. సత్యభాషణము
4. మద్యపాన నిషేధము
5. బ్రహ్మచర్యము

వ్రతములుగ స్వీకరించి ప్రవర్తనను తీర్చిదిద్దుకొన వలెను.

## దశ సూత్రములు.

1. అహింస 2. అస్తేయము 3. వ్యభిచార నిషేధము 4. సత్యభాషణము 5. ప్రియవాదిత్వము 6. పరనిందా వివర్జనము 7. మితభాషణము 8. ధర్మాభిలాష 9. అద్వేషము 10. పరధనాభిలాష పరిత్యాగము.

**పుణ్య కార్యములు.**

1. పాత్రదానము 2. ధర్మాచరణము 3. సద్భావాభివృద్ధి 4. పరోపకార పారిణత 5. వృద్ధోపసేవ 6. పుణ్యకార్యములలో ఇతరులకు భాగ మిచ్చుట 7. ఇతరుల పుణ్యకార్యముల ప్రోత్సహించుట 8. ధర్మోపదేశ గ్రహణము 9. ధర్మప్రబోధ ప్రచారము 10. స్వీయ దోష నివారణము.

**మూడు పెచ్చరికలు. జరా రుజా మరణములు.**

1. ఈ ప్రపంచములో నీవెప్పుడైన ఎనుబది లేక తొంబది యేండ్లు పైబ డిన స్త్రీ పురుషులను చూడలేదా? వెన్నుముక విల్లువలె వంగి, ఊత కోల పుచ్చుకొని, బక్కచిక్కి కృశించిన శరీరముతో నడువలేక- పళ్లూడిపోయి నరసిన తలవెంట్రుకలు గూడ ఊడిపోయి బట్టతలతో జీవచ్ఛవము వలె నడయాడు ముసలివారు నీకు తారసిల్లలేదా? ఒకనాడు నీకు గూడ ముసలితనము రాక తప్పదని నీ కెప్పుడు తట్టలేదా?

2. ఈ ప్రపంచములో అనారోగ్యముచే కదలలేని స్త్రీ పురుషులను నీవు ఎన్నడు చూడలేదా? రోగగ్రస్తులై మూలుగుచున్న వారిని- చుట్టునున్న వారు చేరి పడకపై శయనింప చేయుట నీ వెప్పుడూ చూడలేదా?

నీకు కూడ ఎప్పుడో ఒకప్పుడు రోగములు వచ్చి ఆ గతి పట్టక తప్ప దని నీ కెన్నడూ తట్టలేదా?

3. ఈ ప్రపంచములో మరణించిన స్త్రీ పురుషుల శవములను నీ వెప్పుడు చూడలేదా?

నీవు కూడా ఒకానొకనాడు మరణింపక తప్పదని నీ కెన్నడూ తట్టలేదా?

బుద్ధుని ప్రబోధములు

# ధ మ్మ ప ద ము

బుద్ధుదేవు దివ్య బోధనామృత మిదే;
ఈ సువర్ణ పాత్ర పోసినాను;
అంటకుండ వ్రేళ్ళు - అందించుచున్నాను;
చేర్పు - కూర్పు - మార్పు చేయలేదు.

# ధమ్మ పథము

బుద్ధుని ప్రబోధములు నిక్షిప్తమైన గ్రంథము "ధమ్మ పథము" దీనికి-"బుద్ధగీత" యనిగూడ పేరు. పాళిభాషలోనున్న ఈ పుస్తక ములో 28 వగ్గలు-(సర్గలు) ఉన్నవి. 423 శ్లోకములు గలవు.

** ప్రతి శ్లోకమునకు తెనుగు అనువాదము సంగ్రథితము. మొదటి అంకె సర్గమును రెండవ అంకె సర్గములోని శ్లోక సంఖ్యను సూచించును.*

*ఉదాహరణమునకు పాళిభాషలోని ఒక మూలశ్లోకము*

నహి వేరేన నేరాని సమ్మనిసు కుదాచనం
అవేరేనచహమ్మాని, ఏసధమ్మో సనాతనో 1-5.
*అనగా మొదటి సర్గలో అయిదవ శ్లోకము.*

## 1. యమక వర్గము

1. మన అస్తిత్వము మన మనస్సునుండియే ఉద్భవించుచున్నది. మన ఆలోచనలే మనలను తీర్చిదిద్దుచున్నవి. చెడు మనస్సుతో ఏ మనుజుడైన ఏ పనిని చేసినను తత్ఫలితముగ ఎద్దు మోపుపైనున్న కాడివెంట వచ్చు బండిచక్రములె దుఃఖము సిద్ధించును. 1-1

2. అట్లే! ఏ మనుజుడైనను నిర్మలమైన మనస్సుతో మంచి పనులనే చేసినపుడు, వెన్నంటి ఎన్నడు వీడనట్టి నీడ వలె సుఖము సిద్ధిం చును.

3. "ఇతడు నన్ను తిట్టెను. కొట్టెను. నిర్జించెను - దోచుకొనెను" అనుచు భావించువారు క్రోధమును అణచుకోలేరు. 1-3

4. "ఇతడు నన్ను తిట్టెను-కొట్టెను. నిర్జించెను-దోచుకొనెను" అను భావములు లేనివారు క్రోధమును ఉపశమింప జేసుకొనగలరు. 1-4

5. వైరముచే వైరము ఎన్నటికి నశింపదు. అవైరము చేతనే (ప్రేమ చేతనే) వైరమును శాంతింపజేయనగును. 1-5*

6. అందరము మరణింపక తప్పదనెడి మాట మరచిపోవుట చేతనే వైరము పెరుగుచున్నది. ఈ సంగతి తెలిసిన వైరము వెంటనే శమింప గలదు.1-6

7. ఇంద్రియనిగ్రహము లేని సుఖలాలసులగు వారిని ఆహారవిహార నియమము లేని స్వేచ్ఛాళువులను, మారుడు ఝంఝామారుతము చెట్లను పడగొట్టునట్లు పతనము చెందించును. 1-7

8. జితేంద్రియులై ఆహార విహారముల నియతి పాటించు వారిని మారుడు-ఝంఝామారుతము పర్వతమును కదలింపలేనట్లు చెరుప లేదు. 1-8

9. జతేంద్రియుడు కానివాడు కాషాయ వస్త్రములను ధరించుట సత్య మును ధర్మములను వంచించినట్లే. 1-9

10. శీల సంపన్నుడు జితేంద్రియుడు సత్యవ్రతుడు ధార్మికుడు మాత్రమే కాషాయ వస్త్రధారణమునకు అర్హుడు. 1-10

11. అసత్యమందు సత్యమును, సత్యమందు అసత్యమును భావించు వారు-తమ సంకల్ప భ్రాంతులకు లోనయి సత్యమును ఎన్నడూ కనుగొనలేరు. 1-11

12. యాధార్థ్యమునందు సత్యమును, అసారమునందు అసత్యమును సందర్శింపగలుగువారు సద్భావనతో సత్యమును సాక్షాత్కరింప జేసుకోనగలరు. 1-12

13. చక్కగా నేయని ఇంటికప్పులోనుండి వాన చినుకులు లోనికి ప్రవేశించునట్లు, వివేకరహితమైన చిత్తమునందు విషయ వాంఛలు ప్రవేశించును. 1-13

14. చక్కగా నేసిన ఇంటికప్పులోనుండి వాన చినుకులు లోనికి ఎట్లు ప్రవేశింపజాలవో అట్లే వివేకవంతమైన మనస్సు లోనికి విషయ వాంఛలు దూరలేవు. 1-14

15. పాపకార్యములు చేయువాడు ఇహమునందును పరమునందును గూడ, శోకించును. తన దుష్కృత్యములను జూచి తానే దుఃఖిం చును. 1-15.

16. సత్కార్యములు చేయువాడు ఇహపరసౌఖ్యముల నందును. తాను చేసిన మంచిపనులను జూచి అతడు మిక్కిలి ఆనందించును. 1-16

17. పాపి-ఇచట అచటగూడ దుఃఖించును. 'నేనే ఈ పాపము చేసినది' అని బాధపడును. దుర్మార్గమును అనుసరించుకొలది అతని శోకము అతిశయించును. 1-17

18. పుణ్యకార్యములు చేసినవాడు, ఉభయ లోకములందును ఆనం దించును. సన్మార్గమును అనుసరించుకొలది అతని ఆనందము అతి శయించును. 1-18

19. ధర్మ సూత్రములను, ఆచరింపకుండ కంఠస్థము చేసిన ప్రయోజనము లేదు. అట్టి ప్రమత్తుడు ఇతరుల ఆవులను లెక్క పెట్టుకొను నట్టి గొల్లవాని వంటివాడు. 1-19

20. ఎవడు-తాను వల్లెవేసిన ధర్మసూత్రములను అనుష్ఠించి చూపునో ఎవడు రాగ ద్వేష మోహములను వదులుకొని వివేకవంతుడై ఇహ పరములను ఆశింపడో అతడే జ్ఞానియై ధర్మాత్ముడగును. 1-20.

## 2 అప్రమాద వర్గము.

21. అప్రమత్తత అమరత్వమునకు దారి. ప్రమత్తత మృత్యుమార్గము. అప్రమత్తులు నశింపరు. ప్రమత్తులు జీవన్మృతులు. 2-1

22. విజ్ఞులైన విద్వాంసులు అప్రమత్తతలోని ఆనందము అనుభవించే దరు. వారు సజ్జనుల ప్రవర్తనను అనుసరించెదరు. 2-2

23. ప్రశాంతులై ధ్యానయోగులైనవారు నిర్వాణమును పొంది నిరుప మాన స్వాతంత్ర్య సౌఖ్యములను అనుభవింపగలరు. 2-3

24. జితేంద్రియుడు ధర్మాత్ముడు పవిత్రవర్తనుడనగ అప్రమత్తుని కీర్తి గౌరవములు సదా అతిశయించుచునే యుండును. 2-4

25. జితేంద్రియుడైన విజ్ఞాని అప్రమత్తుడే తనచుట్టు ఎట్టి వరద వెల్లువ ముంచలేని ద్వీపమును నిర్మించుకొన గల్గును. 2-5

26. మూర్ఖులు అపక్వమైన మెదడు గలవారు సోమరులుగ మారిపోదురు. మేధావులు అప్రమత్తతయే తమ ధనముగ భావించెదరు. 2-6

27. ప్రమత్తుడవు కావలదు. విషయసుఖలోలుడవై చరింపకుము. అప్రమత్తుడవై ధ్యానము సలిపినచో విపులసుఖము నంద గలవు. 2-7

28. అప్రమత్తుడు సంతుష్టుడై శోకరహితుడై విజ్ఞాన పర్వత శిఖ రమునధిష్ఠించి క్రిందనున్న అవివేక దుఃఖభూయిష్ఠమైన లోక మును జూచును. 2-8.

29. ప్రమత్తులలో అప్రమత్తుడు, నిద్రాశుపులమధ్య మేల్కొనియుండి జవనాశ్వము ఊరగుట్టమును సులువుగా దాటిపోవునట్లు వివేక ముతో ముందునకు చొచ్చుకొని పోవును. 2-9

30. అప్రమత్తుడే ఇంద్రుడు దేవతలకు అధినేత యయ్యెను. అప్ర మత్తత సదా ఉగ్గడింపదగినవి. ప్రమత్తత సదా గర్హింప దగినది. 2-10

31. అప్రమత్తుడైన భిక్షువు సోమరితనమునకు వెఱచును. అతడు భవబంధముల నన్నిటి దహించుకొని పురోగమింపగలడు. 2-11

32. అప్రమత్తుడే సోమరితనమునకు పాల్పడని భిక్షువు పతితుడై వెనుకంజ వేయడు. అతనికి నిర్వాణము అందుబాటులో నుండును. 2-12

# 3 చిత్త వర్గము

33. చిత్తము చంచలము. దుర్నిరోధము. విల్లును తయారు చేయువాడు వెదురును వంచునట్లు మేధావి తనకు అనుకూలముగా మనస్సును మలచుకొనును. 3-1

34. నీటిలోనుండి తీసి నేల పైనిడవేసిన చేప వలె చిత్తము మారుని బారినుండి తప్పించుకొనుటకు గిల గిల కొట్టుకొనును. 3-2

35. నిగ్రహించుటకు కష్టమైనది చిత్తము. పరి పరి విధముల పరుగెత్తు చిత్తమును కైవసము చేసికొనుట మంచిది. మచ్చిక చేయబడిన చిత్తము సుఖముల నొసగగలదు. 3-3

36. సూక్ష్మమార్గమున బోవునది-యథేచ్ఛగా వక్రమార్గమున విహ రించునది చిత్తము. మేధావి తన మనస్సును పెడదారులు బట్ట కుండ రక్షించుకొనవలెను. సుశిక్షితమైన చిత్తము సుఖము నొసగ గలదు. 3-4

37. ఒంటరిగా ఎంత దూరమైన పయనించుశక్తి శరీర రహితమైన మనస్సునకు ఉన్నది. అట్టి చిత్తమును హృదయకుహరమునందు అణచి పెట్టి వశపరచుకొనువాడు మన్మధుని బారినుండి విముక్త డగును. 3-5

38. చపలచిత్తుడు, స్వధర్మమును తెలిసికొనలేనివాడు చిత్తశాంతి లేని వాడు పరిపూర్ణజ్ఞాని కాలేడు. 3-6

39. పుణ్య పాపములకు రాగద్వేషములకు అతీతుడే నిశ్చల చిత్తుడైన వాడు జాగృతుడు. అట్టివానికి ఎట్టి భయము లేదు. 3-7

40. ఈ శరీరము కుండతో సమానమైనదని తెలిసికొని-ఈ చిత్తమును కోటగా చేసికొని జ్ఞానమనెడి ఆయుధముతో మారుని జయించి, ఆ విజయమును సదా జాగ్రతతో రక్షించుకోవలెను. 3-8

41. అచిరకాలమున, ఈ శరీరము నిర్జీవమై నిరీహమై చివికిపోయిన కట్టెవలె నేలపై పడిపోవును. 3-9

42. విరోధిచేయు హానికంటె, విద్వేషి యొనరించు అపకారముకంటె స్వేచ్ఛాయత్తమైన చిత్తము మిక్కిలి ఎక్కువ కీడు చేయగలదు. 3-10

43. తల్లి గాని, తండ్రి గాని, యితర బంధువర్గము గాని చేయలేని మేలును సుశిక్షితమైన చిత్తము చేయగలదు.

# 4 పుష్పక వర్గము

44. ఇహలోక-దేవలోక-యమలోకములను జయించువా డెవడు? కుశలు డైన తోటమాలి మంచి పూలు కోసి తెచ్చినట్లు ధమ్మపదమును ఎవడు వివరించి చూపగలడు? 4-1

45. యమలోక, భూలోక దేవలోకములను జయించువాడు ముక్తసంగుడే. మంచి పూలను కుశలుడైన తోటమాలి కోసి తెచ్చినట్టు అతడే ధమ్మపదమును వివరించి చూపగలడు. 4-2

46. "ఈ శరీరము బుద్బుదప్రాయము. ఎండమావుల వంటిది". అని తెలిసికొనిన శిష్యుడు-మారుని పుష్పబాణములను విచ్ఛిన్నముచేసి మోక్షము నందుచున్నాడు. 4-3

47. ఇంద్రియ వ్యామోహము అనెడి పువ్వులను సంపాదించుటకే పరి శ్రమించు చంచలచిత్తుని-నిద్రించు ప్రజలతోనున్న గ్రామమును వరద వెల్లువ ముంచివేయునట్లు - మృత్యువు పొట్టబెట్టుకొనును. 4-4

48. విషయసుఖములనెడి పుష్పములను అన్వేషించు వానిని - ఆతని కోరిక తీరకముందే మృత్యువు కబళించును. 4-5

49. పూల రంగుగాని పరిమళముగాని - చెడగొట్టకుండ భ్రమరములు మధువును ఆస్వాదించు రీతిగా భిక్షుకుడైన ముని తన బ్రతుకును తీర్చిదిద్దుకోదగును. 4-6

50. ఇతరుల తప్పుల నెన్నుట మానుకొని, మనుజుడు తన తప్పులను మాత్రమే సరిదిద్దుకోదగును. 4-7

51. చెప్పెడి ఉపదేశములు ఎంత మనోహరముగ నున్నను, చేసెడి పనులకు వ్యత్యాసము కన్పించినప్పుడు-రంగురంగులతో మనోజ్ఞ ముగా వికసించిన పువ్వులో పరిమళము కొరవడినట్లె నిరుపయోగ మనిపించును. 4-8

52. చెప్పెడి ఉపదేశములను చేతలలో అనుష్ఠించి చూపించినచో-సుగం ధము వెదజల్లు సుందర పుష్పమువలె రాణించును. 4-9.

53. పూవుల రాసినుండి ఎన్నో దండలను గ్రుచ్చవచ్చు. ఎన్నో పుణ్య కార్యములను ఒక మర్త్యుడు ఆచరించవచ్చు. 4-10

54. పువ్వుల పరిమళము గాలికి ఎదురీదలేదు. అట్లే చందనము తగ రము మల్లికల పరిమళములు. కాని సజ్జనుల కీర్తి, గాలి కెదురీది సర్వదిక్కులకు వ్యాపించును. 4-11

55. సజ్జనుల కీర్తి పరిమళమే-చందనము తగరము మున్నగు సుగంధ ద్రవ్యములకంటె మిన్నగా ఎన్నదగును. 4-12

56. చందనము తగరము మున్నగువాని పరిమళము అల్పమే అని చెప్పవలెను. సౌశీల్యవంతుని కీర్తి పరిమళము దేవలోకమున కధిరోహించును 4-13

57. సౌశీల్యవంతులు అప్రమత్తులు జ్ఞానసంపన్నులు నగు వారి కడకు వెడలు మార్గము మారునకు అగమ్యము. 4-14

58-59 పరిమళ సౌందర్యదీధితులు వెద జల్లుచు, బాట ప్రక్కన బుర దలో పద్మము వికసించి విరాజిల్లునట్లు పామరజన సామాన్యము మధ్య బౌద్ధభిక్షువు జ్ఞానరోచిస్సులు విరజిమ్ముచు శోభించవచ్చు. 4-15, 16

## 5 బాల వర్గము

60. నిద్రరాని వానికి నిశి సుదీర్ఘ మనిపించును. అలసిపోయిన బాట సారికి ఇంకొక్క అడుగు వేయుట కష్టమనిపించును. అట్లే ధర్మము నెరుగని మూఢునకు యావజ్జీవితము దుర్భర మని పించును. 5.1

61. బాటసారికి తోడుగా-అధికుడు గాని సమస్కంధుడు గాని లభించ నప్పుడు ఒంటరిగా పయనించుట మేలు. మూర్ఖునితో సహయానము మేలు కాదు. 5..2

62. మూఢుడు-"వీరు నా బిడ్డలు-ఇది నా ధనము" అనుకొనుచు జీవిత భారము నీడ్చును. అతని తనువే అతనిది కానప్పుడు ఇక పుత్రు లెక్కడివారు? ధన మెక్కడిది? 5..3

63. తన, మూఢత్వము గుర్తింప గలిగిన వాడు బుద్ధిమంతుడే. తన్ను పండితునిగ భ్రమించువాడే నిజమైన మూఢుడు. 5..4

64. యావజ్జీవితము - మూర్ఖుడు పండిత సాంగత్యము నెరుపుగాక ఆతడు ధర్మము నెరుగజాలడు. కూరలో కలయ దిమ్మరు గరిటె రసరుచులు గ్రహింపజాలదు. 5..5

65. పండిత సాంగత్యము ముహూర్తకాలము నెరపినచాలు, వివేకి ధర్మ మార్గము నరయగలుగును. స్పర్శమాత్రమున నాలుక సూపరసరుచి తెలియగలదు. 5..6

66. దుర్జనులైన మూఢులు తమకు తామే శత్రువులగుచున్నారు. వారి పాప దుష్ఫలములను వారే అనుభవించుచున్నారు. 5..7

67. ఏ పని చేసిన చేతులు కలుషితములగునో - పశ్చాత్తాపముచెంది కన్నీరు కార్చవలసి వచ్చునో-అట్టి పని మంచిది కాదుకదా. 5..8

68. పశ్చాత్తాపము కలుగనవసరము లేకుండ ఆనందము ఉద్భవింప జేసి సత్ఫలితముల నొనగూర్చు నట్టి కృత్యములు శ్రేష్టమైనవి. 5..9

69. దుష్కార్యములను చేసిన మూఢుడు - తత్ఫలితములను అనుభ వించు వరకు మధువు వలె అవి మధురముగనే యున్నట్లు భావింప వచ్చు. చివరకు దుఃఖములో మునుగును. 5..10

70. మూఢుడు-నెలలు తరబడి-పవిత్ర దర్భలతో భోజనము చేయ వచ్చునుగాని, ధర్మమును అవగతము చేసికొనిన వానిలో పదు నారవపాలు విలువ చేయడు. 5..11

71. పిండిన వెంటనే పాలు, పులిసిపోయిన పెరుగుగా మారవు. చేసిన పాపము వెనువెంటనే పండదు. నివురు గప్పిన నిప్పువలె అది లోలోపల దహించుచునే యుండును. 5..12

72. మూఢుడు-జ్ఞానలేశముచే నిశ్చింతముగా నుండవచ్చును. చివరకు పూర్వపుణ్యము నశించుట తోడనే తల తిరిగి విపత్తులో చిక్కు కొనును. 5..13

73-74. అవివేకి ఆభాసయశస్సుకై ప్రాకులాడును. తోడి భిక్షువులలో పెద్దరికమునకై ప్రయత్నించును. విహారావాసమునకు అధినేతగా నుండ ఆశించును. ఇతరులచే పూజల నందుటకై తహ తహ లాడును. "ఈ పని నేనే చేసితినని ఉపాసకులు భిక్షులుగూడ గుర్తించెదరు గాక. వారు నా అభీష్టానుసారమే నడచెదరుగాక" అను నట్టిది మూఢుల ఆశయము. ఆ విధముగా అతని అహంకార మతిశయించును. 5..14

75. నిర్వాణపథమునకు కొనిపోవు మార్గ మొకటి. ఐహిక లాభమునకు తరలించు మార్గమము వేరు. బౌద్ధ భిక్షుకునకు సరియైన సత్కారము వివేక మార్గమును అనుసరించుటయే. 5..15

# 6 పండిత వర్గము.

76-77. దోషములను సరిదిద్దగలుగు పండితుడు కనిపించినచో ఆతని అనుసరింపుము. ఆతడు గుప్తనిధి వంటివాడు. ఆతనిని సజ్జనులు ప్రేమతో చూడగలరు. దుర్జనులు ద్వేషించెదరు. అట్టి ఒజ్జ ఉపదేశములను పరిగ్రహింపనగును. 6..1

78. పురుషాధములను పూజింపరాదు. మంచివారిని పురుషోత్తములను పూజింపనగును. 6..3

79. ధర్మము ఆస్వాదించిన వాడు సుప్రసన్న చిత్తుడై యుండును. ఆర్యులచేత వివరింపబడిన ధర్మమునందు పండితుడు ఆనందమునను భవించును. 6..4

80. కృషీ వలుడు-కాలువలు త్రవ్వి నీటిని కావలసిన పొలములలోనికి మళ్లించెదరు. వింటిని తయారుచేయువారు వెదురును, అనువుగ వంచుకొందురు. వడ్రంగులు - ఇచ్ఛవచ్చినట్లు కొయ్యను చెక్క గలరు. పండితులు-తమ్ము తాము నిగ్రహముతో మలచుకొనగలరు. 6..5

81. సుడిగాలి ఎంత వీచినను కొండ కదలనట్లు, పండితులు నిందా స్తుతులకు చలింపరు. 6..6

82. "ధర్మోపదేశములు" వినిన పండితులు, గంభీరము నిర్మలము నైన సరోవరమువలె ప్రశాంతులై యొప్పుదురు. 6..7

83. పండితులు భ్రమలకు లోనుగాక విషయసుఖములను ఆపేక్షింపక బ్రతుకును తీర్చిదిద్దుకొందురు. వారు సుఖములకు ఉబ్బరు. దుఃఖములకు క్రుంగిపోరు. 6..8

84. స్వార్థమునకుగాని పరమార్థమునకుగాని పండితుడు పుత్రులను కోరడు. ధనము కోరడు. రాజ్యపదవిని కాంక్షింపడు. అట్టివాడే సాధువు. జ్ఞాని. ధార్మికుడు. 6..7

85. సంసార సాగరమును దాటి అద్దరి చేరువారు అరుదు. చాలమంది ఇద్దరినే తిరుగాడుచుందురు. 6..10

86. ధర్మము నెరిగి ధర్మము నాచరించువారలు, దుస్తరమైన సంసార సాగరమును దాటి అవ్వలి గట్టు చేరగలరు. 6..11

87. పండితుడు, శారీరక సౌఖ్యమార్గమును విడనాడవలెను. ధార్మిక బుద్ధితో ఏకాంతవాస నిష్ఠతో గడపవలెను. 6..12

88. సౌఖ్యములను విడనాడి-సర్వసంగ పరిత్యాగియై ఏదియు తనది అనుకొనక తన చిత్తమును నిర్మలము చేసికొవలెను. 6..13

89. ఎవరి మనస్సులు జ్ఞానాంగములతో వికసించునో - ఎవరు సర్వ సంగ పరిత్యాగులై దేనిని పట్టుకొని ప్రాకులాడరో - అట్టి వారు పరిపూర్ణ హృదయశాంతిదాయకమైన నిశ్చల నిర్వాణప్రాప్తి నంద గలరు. 6..14

# 7 అర్హత వర్గము.

90. సర్వబంధములనుండి విముక్తుడైన వాడు సర్వదా శోకరహితుడే. అట్టివాడు కృతార్థుడే. 7..1

91. బుద్ధిమంతులు తరించుటకై పరిశ్రమించెదరు. అట్టి వారు ఇంటికి కట్టుపడి యుండరు. వారు బురద మడుగును విడిచి వెడలి విహ రించు రాజహంసల వంటివారు. 7..2

92. ఎవరు మితభోజులై ముక్తసంగులై యుండి, క్షణభంగురమైన జీవితమును గూర్చి, జన్మల గూర్చి, జ్ఞానము నార్జించి యుందురో అట్టి ధార్మికుల పథము - ఆకాశమున పోవు పక్షుల బారువలె - అగమ్యము. 7..3

93. ఎవరు ఆహార నియమమును పాటించి దోషరహితులై క్షణభంగుర మైన జీవిత తత్వము నరయుదురో అట్టి వారి పథము ఆకాశమున బోవు పక్షుల బారువలె-అగమ్యము. 7-4

94. సారథి-అశ్వములను అదుపులో పెట్టుకొనునట్లు-ఎవడు ఇంద్రి యములను తన వశమునందుంచుకొనునో-ఎవడు అహంకారమును వర్జించిన దోషరహితుడో-అట్టి వానిని దేవతలు కూడ అసూయతో గౌరవింపగలరు. 7..5

95. సహనమునందు భూమిని దృఢవ్రతదీక్షయందు ఇంద్రుని వజ్రా యుధమును బోలి మనస్సులో నిర్మల సంతోషముతో నుండువాడు పునర్జన్మ నొందడు. 7..6

96. అట్టివాడు మనోవాక్కాయకర్మలచే ప్రశాంతుడగును. సరియైన జ్ఞానము వలన అతడు ముక్తుడగును. 7..7

97. మూఢవిశ్వాసముల కతీతుడు భవబంధముల త్రెంచుకొనిన వాడు, వాంఛారహితుడు, ఇష్టానిష్టములకు అతీతుడు, జన్మరాహిత్యము నెరిగిన వాడే పురుషోత్తముడు. 7..8

98. అర్హతులుండుచోటే-అది పల్లె కావచ్చు-అడవి కావచ్చు, కొండకాని కోనగాని-రమణీయమైనది. 7..9

99. వీతరాగులైన విజ్ఞానులు నివసించునట్టి అరణ్యములే రమణీయ ములు. అట్టివారు ప్రాపంచిక సుఖములను అన్వేషింపరు. 7..10

# 8 సహస్ర వర్గము

100. మాటలు వేయు నేల! అనర్థపదసంహితమైన వేయి  మాటలకంటె అర్థవంతమైన మాట ఒక్కటే చాలు. 8..1

101 అనర్థపదసంహితమైన వేయి  శ్లోకములేల? అర్థవంతమైన ఒక శ్లోకము [గాథ] చాలు. 8..2

102. వేలకొలది శ్లోకములను వల్లె వేయనేల? శ్రవఃపేయమై శాంతి దాయకమైన శ్లోక మొక్కటి చాలు. 8.3

103. యుద్ధములలో వేలకొలది వీరులను వేయిమారులు జయించవచ్చు గాక తన్ను తాను జయించుకొనినవాడే నిజమైన వీరుడు. 8..4

104-105 ఆత్మసంయమమే విశ్వవిజయము. తన్ను తాను జయించుకొనిన వానిని, దేవతలుగాని గంధర్వులుగాని బ్రహ్మగాని మారుడుగాని నిర్జించలేరు. 8..5, 6

106. ప్రతిమాసము-సహస్ర సంవత్సరాల తరబడి పూజలు చేసిన దానికంటె, యోగ్యులైనవారిని క్షణకాలము పూజించుట మేలు. ఆ పూజ-సహస్ర యజ్ఞములకంటె అధికతరము. 8..7

107. అడవిలో వంద యేండ్లు అగ్నికుండమును వేల్చుటకంటె-మహాత్ము డైన వానిని ఒక్క ముహూర్తపు సేపు ఆరాధించుట మేలు. అది వంద యజ్ఞముల కంటె మేలు. 8..8

108. ఏడాది పొడుగున యజ్ఞయాగాదులు చేయుట వలన, మహాత్ముల ఒక సారి పూజించిన కలుగు పుణ్యములో నాలుగవ వంతు లభించదు. 8..9

109. పెద్దలను గౌరవించి అభివాదము సల్పువారికి-నాలుగు అభ్యుదయ ములు - ఆయుస్సు, సౌందర్యము సుఖము బలము లభించును. 8..10

110. నూరేండ్లు దుశ్శీలుడై జీవించుటకంటె-ఒక్కరోజు శీలవంతుడై బ్రదుకుట మేలు. 8..11

111. అజ్ఞానిగా నూరేండ్లు జీవించుటకంటె, జ్ఞానియై ఒక్క రోజు బ్రతుకుట మేలు. 8..12

112. దుర్బలత్వముతో సోమరిగా నూరేండ్లు జీవించుటకంటె సువ్రతుడై ఒక్క పూట బ్రదుకుట మేలు. 8..13

113. వృద్ధిక్షయముల తత్వము నెరుగజాలక వంద సంవత్సరాలు జీవించుటకంటె, వృద్ధిక్షయములను గూర్చిన జ్ఞానముతో ఒక పూట బ్రదుకుట మేలు. 8..14

114. అమృత పదమును అనుభవింపజాలక వంద వత్సరములు జీవించుటకంటె, అమృత పదమును తెలిసికొని ఒక పూట బ్రదుకుట మేలు. 8..15

115. వంద యేండ్లు, ఉత్తమ ధర్మము నెరుగక జీవించుటకంటె ఒక పూట ఉత్తమ ధర్మము నెరిగి బ్రతుకుట మేలు. 8-16

# 9 పాప వర్గము

116. సత్కార్యములు చేయ సంకల్పించుకొనువాడు - మును ముందు శీఘ్రముగ తన మనస్సును నిర్మలము చేసికొన వలెను. లేనిచో-మనస్సు పాపము నందే రమించును. 9..1

117. ఒకసారి పాపము చేసినవాడు తిరిగి చేయకుండుగాక. పాపము పెంచుకొనుట దుఃఖభాజనము. 9..2

118. పుణ్యము చేసినవాడు-తిరిగి పుణ్యములు చేయుగాక. పుణ్యములు పెంచుకొనుట సుఖదాయకము. 9..3

119. పాపము పండనంత కాలము భద్రముగానే యుండును. కాని చిట్ట చివరకు పాపము పండినపుడైన పాపి గుర్తించక తప్పదు. 9..4

120. పాపము పండనంతవరకు పుణ్యాత్ముడు గూడ ఆ సంగతి గ్రహింప జాలడు. పుణ్యములు పండినపుడే పుణ్యముల విలువ తెలియనగును. 9..5

121. "నా కేమని"-పాపమును ఉపేక్షింపరాదు. చిన్న చిన్న చినుకులు పడుటచే కుండ నిండును. అట్లే అవివేకిగూడ, అల్పములైన పాపముల వరుసగా పేర్చుకొనును. 9..6

122. “నా కెట్లు సంక్రమించుననని” పుణ్యములను గూర్చి అనుకొనరాదు. చిరు చినుకులచే కుండ నిండును. అట్లే వరుసగా చిరు పుణ్యములను పేర్చుకొనవచ్చును. 9..7

123. ధనము ఎక్కువ-పరిచారకభటవర్గము తక్కువగ నున్న వణిజుడు భయమార్గము వెంటవెడలనట్లు, బ్రదుకదలచినవాడు విషమును వర్జించునట్లు, సజ్జనుడు పాపములు వీడవలెను. 9..8

124. చేతిలో గాయములు లేనివానికి విషస్పర్శ హాని చేయలేదు. పుణ్యాత్ముని పాపము హాని చేయలేదు. 9..9

125. సజ్జనులైన నిర్దోషులను హింసించువాని పాపము వానినే కట్టికుడుపును. ఎదురుగాలిలో విసరిన దుమ్ము తన మీదనే పడును. 9..10

126. పాపము చేయువారు తిరిగి గర్భ నరకము ననుభవింపక తప్పదు. పుణ్యము చేయువారు సుగతికి పోయి నిర్వాణ సుఖము నందగలరు. 9..11

127. సముద్ర మధ్యమునకు పోయినను, ఆకాశము కోసకు అరిగినను, పర్వత శిఖరములు అధిరోహించినను నేల నాలుగు చెరగులలో ఎచటి కేగినను, పాప కర్మలకు ఫలితము అనుభవింపక తప్పదు. 9..12

128. ఆకసము కోసకు అరుగవచ్చు గాక, సముద్ర గర్భమును చొచ్చు గాక, పర్వత శిఖరములు అధిరోహించు గాక, నేల నాలుగు చెఱగు లలో ఎచటి కేగినను, ఎవరికైన మృత్యువు తప్పించుకొన తరము గాదు. 9..13

# 10 దండ వర్గము

129. అందరు - దండన అనిన, మృత్యువు అనిన భయపడుచున్నారు. తన వంటి వారే ఒరులని గుర్తించి-ఎవరిని చంపరాదు; చంపించ రాదు. [“ఆత్మానం ఉపమం కత్వా”-అని పాళీమూలము]. *10..1

130. అందరకు దండన అనిన భీతి. జీవిత మనిన ప్రీతి సహజముగ నుండును. అందరు తన వంటి వారే అని గుర్తించి-ఎవరిని చంప రాదు; చంపించరాదు. 10..2

131. తన వలెనే సుఖమును కోరుకొను ప్రాణులను, స్వసుఖము కోరుకొను ప్రాణులను హింసించువాడు - మరణానంతరము సుఖమును పొంద జాలడు. 10..3

132. తన సుఖమును తాను కోరుకొనుచు, సహజముగా స్వసుఖమును కోరుకొను ప్రాణులను హింసింపనివాడు-మరణానంతరము సుఖమును పొందును. 10.4

133. వాక్పారుష్యము మంచిది కాదు. మాటకు మాట తెగులు. ప్రతీకార దండము తిరిగి మీద పడును. 10..5

134. శాంతముగా నున్నవాడు నిర్వాణప్రాప్తి నందును. ఇతరులు కొట్టి నను మ్రోగక, తాను పగిలిన గంటవలె ప్రశాంతముగా నుండువాడు నిర్వాణప్రాప్తి నందినవాడే. 10..6

{*ఒరులేయవి యొనరించిన
నరవర! అప్రియము తన మనంబునకగు తా
నోరులకు నవి యొనరింపమి
పరాయణము పరమధర్మపథముల కెల్లన్.
—మహాభారతము.
ఆత్మౌపమ్యేన సర్వత్ర సమ్యం పశ్యతి
—భగవద్గీత.}

135. పసికాపరి ఆలమందను తన చేతికట్టెతో అదలించి పచ్చిక బీడు నుండి తరిమి గొట్టునట్లు - మృత్యువు, ముసలితనము అను చేతి కట్టెతో ప్రాణుల ఆయుస్సును తరుముచున్నది. 10..7

136. మూర్ఖుడు-పాపములను చేయుచున్నప్పుడు తన అవివేకము నెరుగడు. కాని-అతని పాపములు అతనినే అగ్నివలె దహించగలవు. 10..8

137. నిర్దోషులను దండించువాడు అమాయకులను శిక్షించువాడు దశ మహా పాతకములలో ఒకటి చేసినవాడగును. 10..9

138. అట్టి పాపి - శరీర వేదన, దేహ రోపనము - దుర్భర మనోవ్యధ పొందును. 10..10

139. రాజదండనము - అపకీర్తి ప్రియజన వియోగము పాపమునకు ఫలములు. 10..11

140. పిడుగుపాటు వలన గాని అగ్ని వలన గాని ఇల్లు కూలి కాలిపోవుట నరక లోకమున కేగుట పాపము వలన సిద్ధించు ఫలితములు. 10..12

141. దిగంబరత్వము - జటావల్కలధారణము-ఉపవాసము-భస్మధూళి ధూసరిత దేహము – భూశయనము - తృష్ణను జయింపలేని వానిని ముక్తుని చేయజాలవు. 10-13

142. శాంతుడు దాంతుడు బ్రహ్మచర్యవ్రతుడుగానుండి భూతదయతో ఆహింసా వ్రతము పాటించువాడే -ఉజ్జ్వలవేషభూషితుడై యున్నప్పటికి నిజమైన బ్రాహ్మణుడు. నిజమైన శ్రమణకుడు. 10..14

143. ఈ లోకములో నిందాస్తుతులను తన మనస్సులో సమముగా స్వీక రించి, కొరడా దెబ్బలకు సరకు గొనక ముందునకు పరుగెత్తి పోవు జవనాశ్వము వలె-సంచరించువాడు ఉన్నాడా? 10..15

144. భద్రాశ్వము కొరడా దెబ్బకు ముందుకు పరుగెత్తునట్లు సజ్జనుడు శ్రద్ధ, సౌశీల్యము, సమాధి, సమ్యక్ జ్ఞానము వలన ఐహిక దుఃఖమును విడిచి పురోగమించుగాక. 10..16

145. కర్షకులు నీటిని, ధనుష్కారులు వింటి బద్దను, వ్రడంగులు దారు వులను తమ ఇచ్చవచ్చినట్లు మలచు నట్టుగనే సజ్జనులు తమ్ము దాము అదుపులో పెట్టుకొనగలరు.

## 11 జరా వర్గము

146. ఏల నవ్వులాట? ఏల ఆనందమ్ము?
కోంపలంటుకొనుచు కూలుచుండ-!!
లోకమెల్ల చిమ్మ చీకట్లు గ్రమ్మగా
వెదుకవేల నీవు వెలుగు కొరకు? 11..1

147. ముసలితనముచే ముడతలు పడుచున్న ఈ శరీరము బహుక్లిష్టరోగ జర్జరితము. బహుసంకల్ప పూరితము, అధ్రువము - ఆతురమని గ్రహింపుము. 11..2

148. ఈ శరీరము బహుళ రోగగ్రస్తము-క్షణక్షణము క్షీణించు చున్నది. జీవితమునకు అంతము మరణమే సుమ్ము. 11..3

149. ఎండిన ఎముకల కట్ట వంటి ఈ శరీరమును చూచిన ఏమి ఆనందము? 11..4

150. ఈ దేహము రక్తమాంసలైన ఎముకల గూడు. ఆ దుర్గములో జరామృత్యువులు - కంఠ కావరము - కాపట్యము సగర్వముగా కాపురముండును. 11..5

151. రాజరథములు గూడ శిధిలము లగును. అట్టివే ఈ శరీరములు. జరాజర్జరితము లగును. ధర్మ మెప్పుడును శిధిలమై శీర్ణము కాదు. సజ్జనులు ఈ సంగతి పరస్పరము సంగ్రహింపగలరు. 11.6

152. అల్పజ్ఞాని ఆబోతువలె విహరించి ముదుసలి యగును. అతనికి కండలు పెరుగవచ్చునుగాని జ్ఞానము మాత్రము ఎదుగజాలదు. 11..7

153. ఎన్నో జన్మ లెత్తినాను. ఈ వ్యర్థయాత్రలో సృష్టికర్త కొరకు వృథా అన్వేషణ సలిపినాను. పునర్జన్మ దుఃఖభూయిష్ఠ మైనది. 11..8

154. నాకు సమ్యక్ దర్శనము కలిగినదిగాన నా కొరకు తిరిగి ఈ ఇల్లు కట్టవలదు. దూలములు చివికి పోయినవి. వెన్నువాసము పగిలి పోయినది. కోరికలు లేని చిత్తమే నిర్వాణపథము నొంది క్షేమముగా నుండును. 1..9

155. యౌవనములో బ్రహ్మచర్య సంపదల నార్జించక సౌశీల్యము చెడిన వారు - చేపలు లేని చిన్ని మడుగులోని కొంగవలె నశిం చెదరు. 11..10

156. యౌవనములో బ్రహ్మచర్య సంపదల నార్జింపక సౌశీల్యము చెడిన వారు విరిగిన పాత విల్లుల వలె కూలిపోయి తమ పూర్వస్థితిని తలుచుకొని పరితపించెదరు. 11..11

## 12. ఆత్మ వర్గము.

157. తన్ను తాను బాగుచేసికొనవలెనను కోరిక యున్నవాడు - తన్ను జాగరూకతలో కాపాడుకొన వలెను. పండితుడు రాత్రి - యామములో మూడింట నొకట మేల్కొని యుండనగును. 12..1

158. తాను మొదట చేసి చూసిన పిమ్మటనే ఇతరులను చేయమని చెప్ప దగును: అట్టి పండితునకు పతన ముండదు. 12..2

159. ఆదేశముకంటె స్వకీయమైన అనుష్ఠానమే మేలు. తన్ను తాను వశపరచుకొనిన ఇతరులను సులువుగా లోబరచుకొనగలడు. ఆత్మ సంశయము దుష్కరమైనది. 12..3

160. తనకు తానే అధినేత కాదగును. అంతకంటె అధినాథు డింకెవ రున్నారు? తన ఆత్మను తాను నిగ్రహించుకొనగలిగిన మను జుడు, దుర్లభుడైన అధినాథుని కనుగొనినట్లే. 12..4

161. వజ్రము-మణులను భేదించును. అట్లే తాను చేసిన పాపము-తన యందు పుట్టిన పాపము తననే కట్టికుడుపును. 12..5

162. మాలువ తీగ - సాలవృక్షము పైకెగ్రాకి అలముకొని - ఆ చెట్టు కొమ్మలనే వంచి వేయునట్టు దుర్జనుని దౌష్ట్యము అతనినే అణచి వేయగలదు. 12..6

163. పాపకృత్యములను చేయుట సులువు. ఆత్మహితమైన సాధుకృత్యములు చేయుట చాల కష్టము. 12..7

164. మహాత్ములు-పరమ పవిత్రులై నవారి బోధలను దుర్జనుడు ఎగ తాళి చేసి పాపము పండిన పిదప కట్టెహూక లత ఫలించిన పిదప ఎండి వాడి పోవునట్లు ఆత్మవినాశము నందును. 12..8

165. తన చేతనే తన పాపములు చేయబడుచున్నవి. తన చేతనే తాను వినాశనము నొందుచున్నాడు. ఎవని పాపములు వారికే సంబంధించి యుండును. కనుక పవిత్రత-అపవిత్రత ఎవరివి వారివే. ఒకడు-మరియొకని పవిత్రుని చేయజాలడు. 12..9

166. చేయదగినవి ఎన్నో మంచి పనులు, ఘనకార్యములు ఉండవచ్చును. కాని వానికై మనుజుడు తన కర్తవ్యమును విడరాదు. తన కర్తవ్యమును తెలిసికొనిన పిమ్మట తదేకదీక్షతో ఆచరింప దగును. 12..10

# 13. లోక వర్గము

167. హీన ధర్మమునకు పాల్పడరాదు. ప్రమత్తతో నుండరాదు. దుర్మతములను అనుసరించ రాదు. తరింప వలసిన లోకముల నెక్కువ చేయరాదు. 13..1

168. నరుడు అప్రమత్తుడై జాగరూకతతో నుండుగాక! సౌశీల్యముతో ధర్మము నాచరించుగాక. ఇహమునందును పరమునందును ధర్మచారి సుఖము నందును. 13..2

169. సౌశీల్యముతో ధర్మ మార్గమునే అనుసరింపవలెను. దుష్పథమును అనురింపరాదు. ఈ లోకమున పరలోకమున ధర్మచారి సుఖము నందును. 13..3

170. ఈ లోకము - నీటిబుడగ వంటిది; ఎండమావుల వంటిది అని గ్రహించిన వానిని మృత్యురాజైన యముడు, తేరిపార జూడలేడు. 13..4

171. రాజ రథము వలె పై మెరుగులతోనుండు చిత్రమైన ఈ లోకమును గాంచి మూఢులు భ్రమలకు లోనొదురు. గాని జ్ఞానులుకారు. 13..5

172. మొదట ప్రమత్తుడై యున్నను పిమ్మట జ్ఞానియైన వాడు మబ్బు మాటున నుండి వెలువడిన చంద్రుని వలె వెలుగొందును. 13..6

173. పాప కృత్యములను వీడి పుణ్యకార్యములు చేయునట్టి వాడు మబ్బు మాటున నుండి వెలువడిన చంద్రుని వలె వెలుగొందును. 13..7

174. లోకమెల్ల చిమ్మచీకట్లతో నిండె!
చూడగలుగువార లేడ గలరు?
బయట పడుట అరుదు వలలోని పక్షులు!
పరము చేరనోవు పక్షు లేవి? 13..8

175. హంస ఎగుర గలదు ఆదిత్య పథమందు
సహజమైన ఆత్మశక్తి వలన
ధీరుడైనవాడు మారు వాహిని గెల్చి
పరముచేరు ఆత్మబలము వలన 13..9

176. అధర్మశీలుడు, అసత్యవాది - పరలోకమునకు సరకుగొనని వాడు ఇక ఏ పాప కార్యమును చేయుటకైనను వెనుకాడడు. 13-10

177. లోభి - దేవలోకమునకు పోజాలడు. దాన కార్యముల విలువ మూర్ఖులు గుర్తించలేరు. దానశీలురు పరమున సుఖింపగలరు. 13-11.

178. చక్రవర్తిత్వముకంటె - స్వర్గసుఖముకంటె లోకాధిపత్యము కంటె ధర్మపథము చేరుటయే శ్రేష్ఠము. 13..12

# 14. బుద్ధ వర్గము

179. అనంత జ్ఞానసంపన్నుడైన బుద్ధుని అపమార్గమునకు ఎవరు మళ్లించగలరు? అతడు అపరాజితుడు. మర్త్యులెవరు అతని విజయమును నందుకొనలేరు. 14..1

180. ఆతడు కోరికల వలలో చిక్కుకోడు. ఎట్టి తృష్ణకు అతడు లోబడడు. 14..2

181. జ్ఞానప్రసూతులు ధీరులు ధ్యానయోగులు శాంతస్థైర్య రతులునగు బుద్ధులను ఉపాసించుటకై దేవతలుగూడ ఉత్సహించెదరు. 14..3

182. నరజన్మ లభించుటయే కష్టము. మర్త్యజీవితము కష్టతరము. సద్ధర్మశ్రవణము కష్టతమము. బుద్ధుల అవతరణము అన్నిటి కంటె కష్టమైనది. 14..4

183. ఏ పాపములు చేయరాదు. మంచినే ఆచరింప వలెను. చిత్తమును పరిపూర్ణమొనర్చుకొన వలెను. ఇది బుద్ధానుశాసనము. 14..5

184. "క్షమయే మహాతపస్సు. నిర్వాణమే పరమ పదము." అని బుద్ధానుశాసనము. పరులపై పగబట్టువాడు శ్రమణుడు కాడు. పరహింస చేయువాడు సన్యాసికాడు. 14..6

185. ఇతరుల నిందింపరాదు. హింసింపరాదు. మితభోజనము ఏకాంత వాసముతో ధర్మమునందాసక్తి గలిగి, జిజ్ఞాసతో జీవితము గడుప వలెను. ఇది బుద్ధానుశాసనము. 14..7

186. బంగారువాన కురిసినను తృష్ణ తీరదు. విషయోపభోగములు క్షణికములని తెలిసికొని పండితుడు విరక్తుడగును. 14..8

187. స్వర్గ సుఖములందు గూడ పండితుడు విరక్తుడై యుండును. బుద్ధ శిష్యులు కోరికలను నిర్మూలించుట చేతనే ఆనంద మనుభవింప గలరు. 14..9

188-189 పర్వత గుహలలో అరణ్యములలో ఉద్యానవనములలో పవిత్ర చైత్యములలో ఆశ్రయము కొరకు పరుగిడు మానవులు భీరువులు. అవి ఏవియు క్షేమకరములు కావు. వీనిని ఆశ్రయించుట వలన దుఃఖము తొలగదని ముమ్మాటికి చెప్పనగును. 14..10, 11

190. బుద్ధుని సంఘమును ధర్మమును ఆశ్రయించి [శరణత్రయ దీక్ష గైకొనిన] చతురార్యసత్యముల నాచరించిన సమ్యక్ జ్ఞానము కలుగును. 14..12

191. దుఃఖము-దుఃఖోత్పత్తి - దుఃఖాతిక్రమణము - దుఃఖనివారకము అను చతురార్యసత్యములను ఆర్యాష్టాంగ మార్గమును అనుశీలించి నచో దుఃఖోపశమనము కలుగును. 14..13

192. అదియే క్షేమము. అదియే శరణ్యము అదియే ఉత్తమము అదియే దుఃఖవిముక్తి కలిగించును. 14..14

193. జ్ఞాని జన్మ దుర్లభము. అతడు అన్నిచోట్ల పుట్టడు. ఎచ్చట అట్టి మహానుభావుడు ఉద్భవించునో ఆ వంశము అభ్యుదయము చెందును. 14..15

194. బుద్ధావతరణము శుభ ప్రదము. సద్ధర్మదేశము శుభప్రదము. బుద్ధసంఘాభ్యుదయము సుఖదాయకము. వారి తపస్సు విశ్వ కల్యాణము. 14..16

195-196. బుద్ధుడు-వారి అనుచరులు పూజార్హులు. వారు తృష్ణాశోకములను తరించినట్టి వారలు. నిర్వాణసిద్ధి నందినట్టి మహానుభావులను పూజించు వారి పుణ్యము ఇంతింతనరానిది. 14..7, 8.

## 15. సుఖ వర్గము.

197. ద్వేషమును వర్జించి-ద్వేషించువారి మధ్యనే నివసించవలెను. ఇతరుల యెడ అనురాగముతో మెలగుట నేర్వదగును. 15..1

198. ఆతురుల మధ్య ఆనాతురులమై జీవించెదము గాక! రోగుల మధ్య ఆరోగ్యముతో బ్రదుకదగును. 15..2

199. ఉత్సుకుల మధ్య అనుత్సుకులమై యుందుము గాక. ఉత్సుకులైన మనుష్యుల మధ్య ప్రశాంతులమై విహరించెదము గాక. 15..3

200. "నాది" యనునది ఏదియు లేనప్పుడు-మనము స్వయంప్రకాశులగు దేవతల వలె శాశ్వతానంద సౌఖ్యముల నోలలాడ వచ్చును. 15..4

201. జయము వలన వైరము, అపజయము వలన దుఃఖము సిద్ధించును జయాపజయములకు దూరుడైన ప్రశాంతుడు సుఖమును పొందును 15..5

202. విషయలోలత్వమును మించిన అగ్ని లేదు. ద్వేషమును మించిన దోషము లేదు. శరీరమును మించిన దుఃఖము లేదు. శాంతిని మించిన సుఖము లేదు. 15..6

203. ఆకలికన్న మిక్కుటమైన రోగము లేదు. శరీరముకంటె పరమ దుఃఖము లేదు. ఈ సత్యమును తెలిసికొనిన వాడు - నిర్వాణము కంటె ఆనందము లేదని గ్రహించును. 15..7

204. ఆరోగ్యమే పరమ లాభము. సంతుష్టియే పరమ ధనము. విశ్వా సమే అనుగు చుట్టము. నిర్వాణమే పరమ సుఖము. 15..8

205. ఏకాంతవాసములో ప్రశాంతిలో నుండు మాధురిమమును, అనుభ వించిన వాడు - పాపవిదూరుడై ధర్మప్రీతి రసము త్రాగును. 15..9

206. పూజ్యసందర్శనము-సత్సాంగత్యము ఆనందదాయకము. మూర్ఖ సంపర్కము లేకుండుట అన్నిటికంటె సుఖప్రదము. 15..10

207. మూర్ఖ సాంగత్యము దీర్ఘదుఃఖప్రదము. అవివేకులతో చేరుట శత్రు మధ్యమున నున్నట్లే. విజ్ఞుల సంపర్కము బంధు సమాగ మము వలె సౌఖ్యప్రదమైనది. 15..11

208. ఆకసమునందు నక్షత్రముల మధ్య చంద్రుడు సంచరించునట్లు మేధావులు, ప్రాజ్ఞులైన సజ్జనుల సాంగత్యము వడయుట మేలు.

## 16. ప్రియ వర్గము

209. ఉత్తమ జ్ఞాన సముపార్జన గూర్చి ఆలోచింపక ఇంద్రియ లౌల్య ముతో గడుపు వాడు, తన క్షేమమునకే భంగము కలిగించుకొనును. అట్టి వాడు జ్ఞానయోగిని గాంచి అసూయ చెందును. 16..1

210. ప్రియా ప్రియములకు అతీతుడై యుండదగును. ప్రియమును గాంచక పోయినను, అప్రియమును గాంచినను దుఃఖమే. 16.2

211. కాబట్టి-దేనియందు ప్రీతి ఘటింపకుము. ఏలన ప్రియ వియోగము దుస్సహము. ప్రియా ప్రియములు లేని వాడు బంధముక్తుడు. 16..3

212. ప్రీతి నుండి శోకము కలుగును. ప్రీతి నుండి భయము ఏర్పడును. ప్రియా ప్రియములు లేని వానికి శోకమెక్కడిది? భీతి యెక్కడిది? 16..4

213. ప్రేమ వలన శోకము గలుగును. ప్రేమ వలన భయ మేర్పడును. ప్రేమానుబంధము లేని వానికి శోక మేది? భయ మేది? 16..5

214. రతి నుండియే శోక భయములు ఉదయించును. రతి నుండి ముక్తు డైన వానికి శోక మెక్కడిది? భయ మెక్కడిది? 16..6

215. కామము నుండి శోక భయములు పుట్టును. కామ విరహితునకు శోక ముండదు. భయ మెక్కడిది? 16..7

216. తృష్ణ వలన శోక భయములు కలుగును. తృష్ణ లేని వానికి శోకము లేదు. భయ మెక్కడిది? 16..8

217. శీల దర్శన సంపన్నుడు ధర్మాత్ముడు సత్యవాది, కర్తవ్యపరాయణుడు నగు మనుజుని-అందరు అనురాగముతో చూచెదరు. 16..9

218. పరమపదమైన నిర్వాణము కొఱకై సాధన సలుపువాడు - మన స్సులో ఉదాత్తయోజనలు గలిగి క్షుద్రకామము లేనివాడును నగు మనుజుని “ఊర్ధ్వస్రోతుడు” అందురు. 16..10

219-220 దూర దేశములకు బోయి చిరకాలమునకు తిరిగి స్వదేశమునకు వచ్చిన వానిని ప్రియబంధువులు ఆనందముతో స్వాగతము పలికి నట్లే ఈ

లోకమున పుణ్యకార్యములు చేసిన వానికి పర లోకమున స్వాగతము లభించును.

## 17 క్రోధ వర్గము

221. కోపమును జయింప వలెను. గర్వమును నిర్మూలింప వలెను. సర్వ సంసార బంధములను త్రెంచుకొన వలెను. “నాది” అనునది లేనివాడు నామరూపములకు అసంగుడైనవాడు శోకమునందు పడడు. 17..1

222. బాట నుండి తప్పి కదలు రథమువలె పొంగిపొరలు కోపమును ఎవడు నిగ్రహించ గలడో వాడే సరియైన సారథి. తక్కినవారు గుఱ్ఱాల పగ్గములు పట్టుకొనువారు మాత్రమే. 17..2

223. శాంతము చేత క్రోధమును సాధుత్వము చేత దుష్టత్వమును దానము చేత లోభత్వమును సత్యము చేత అసత్యమును జయింపదగును. 17..3

224. సత్యభాషణముచేత, క్రోధమునకు లొంగక పోవుటచేత, యాచ కులకు యత్కించిత్ దానమైన చేయుటచేత - మనుజుడు దేవతల లోకమునకు పోవును. 17..4

225. అహింసావ్రతులై శరీర సంయమనము సాధించిన మునులు, శోక మోహములకు దూరమైన నిర్వాణమును చేరుదురు. 17..6

226. సదా జాగృతులై యుండు వారినుండి పాప దోషములు తొలగి పోవును. అట్టి అభిముక్తులు నిర్వాణమును పొందగలరు. 17..7

227. “మాటాడక మౌనముగా నున్న వారిని జనులు తిట్టెదరు. మిత భాషిని గూడ నిందించెదరు. వదరుబోతును గర్హించెదరు. ఇక లోకములో మంచివా డెట్లుండును? అను నది పురాతనమైన ఆర్యోక్తి! ఓ అతులా వినుము. 17..8

228. నిష్కళంక కీర్తి గలవాడు గాని - పూర్తిగా అపకీర్తి గలవాడు గాని - ఇంతవరకు పుట్టలేదు. ఇక ముందు పుట్టబోడు. 17..9

229-230 నిష్కళంక చరిత్రుడు - మేధావి - ప్రజ్ఞానిధి యని ఎవని గూర్చి జ్ఞానులు ప్రశంసించెదరో - అట్టివాడు మేలిమి బంగారు నాణెము వంటి వాడు. అట్టి గుణరమ్యుని దేవతలే కాక బ్రహ్మగూడ కొనియాడును. 17..10

231. కోపము రాకుండ దేహమును రక్షించుకొని-వశపరచుకొన వలెను. దుష్కార్యములను వీడి సత్ప్రవర్తన గలిగియుండ వలెను. 17..11

232. వాక్కులో కోపమునకు తావీయరాదు. నాలుకను నిగ్రహించుకోన వలెను. వాక్కులో దుష్టత్వమును వీడి-మంచి మాటలు మాటాడుట అలవరచుకొన వలెను. 17..12

233. మనస్సులో కోపమునకు చోటివ్వరాదు. మనస్సులో దుష్టత్వమును వీడి-సుచరిత నలవరచుకొనవలెను. 17..13

234. త్రికరణశుద్ధి గలిగి - మనోవాక్కాయ కర్మలచే - సరియైన ప్రవ ర్తన గలిగి యున్నవారే సజ్జనులు. 17..14

# 18 మల వర్గము

235. పండుటాకువై రాలుటకు నీవు సిద్ధముగా నున్నావు. యమ దూతలు సమీపించుచున్నారు. నీవు నిష్క్రమణ ద్వారముకడ నిల్చియున్నావు. కాని - పాథేయమునేల సమకూర్చుకోనవు? 18..1

236. వివేకివి గమ్ము. ఒక ద్వీపమువలె నిన్ను నీవు మలచుకోనదగును. నిర్మలుడవై - పాపరహితుడవైనచో పుణ్య పురుషులు చేరు స్వర్గ మునకు ఏగగలవు. 18..2

237. నీ జీవితము ముగిసినది. నీవు యమునికి సన్నిధిలో నున్నావు. మార్గ మధ్యమున ఏ సత్రము లేదు. పాథేయమునైన నీవు సమ కూర్చుకోన లేదు. 18..3

238. వివేకివి గమ్ము. ఒక ద్వీపమువలె - నిన్ను నీవు మలచు కొనుము. నిర్మలుడవై - పాపరహితుడవైనచో నీకు పునర్జన్మ లేదు. 18..4

239. కమసాలి వెండిలోని మాలిన్యమును పోగొట్టునట్లు క్షణక్షణము మేధావియైన వాడు తనలోని పాపములను క్షాళన మొనరించు కొనును. 18..5

240. తుప్పు - ఇనుమునే తినివేయునట్లు, పాపుల దుష్ట కార్యములు వారినే శోకముతో క్రుంగదీయును. 18..6

241. పునశ్చరణము లేనిచో మంత్రములు నిష్ఫలములు. బాగుచేయనిచో గృహము శిధిలమగును. అలసత్వము సౌందర్యమును చెరచును. కావలి వానిని ప్రమత్తత పాడుచేయును. 18..7

242. వ్యభిచారము స్త్రీలకు కళంకము, దాతకు లోభము కళంకము. ఇహపరలోకములకు పాప కార్యములు కళంకములు. 18..8

243. అజ్ఞానమే అన్నిటిని మించిన కళంకము. భిక్షువులారా! ఆ కళం కమునుండి మీరు విముక్తులై-పాపరహితులు గండు. 18..9

244. సిగ్గులేని వాడు, కాకివలె దురహంకారముతో కూయ వచ్చును. పర నిందతో ప్రగల్భములతో సులువుగా జీవితమును నెట్ట వచ్చును. 18..10

245. వినయవంతుడు – పుణ్యాత్ముడు – పవిత్రుడు - నిస్సంగుడు నగువాని జీవితము కష్ట పూరితము. 18..11

246-247 ప్రాణిహింస చేయువాడు - అసత్యవాది - పరధనము నపహరించు వాడు – పరభార్యాభిరతుడు - మద్యపానము చేయువాడు - ఇహలోకము నందే తనకు తానే సమాధిని త్రవ్వుకొనుచున్నాడు. 18..12, 13

248. ఓ మానవుడా! పాపమునుండి మరలుట చాల కష్టము. లోభ మోహములు తుదకు - చిరదుఃఖమును తెచ్చిపెట్ట గలవు. 18..14

249. మనుజులు శ్రద్ధాభక్తుల బట్టి యథోచితముగ దానకార్యము లోన రింతురు. ఇతరుల కొసగిన అన్నపానముల గూర్చి పరితపించు వాడు దివా రాత్రములు శాంతి లేక బాధ నొందును. 18..15

250. ఎవని చిత్తమునందు అట్టి దురుద్దేశములు సమూలముగా నాశనము చేయబడినవో ఆతడు దివా రాత్రములు సుఖించును. 18..16

251. రాగముతో సమమైన అగ్ని లేదు. ద్వేషమును మించిన ఉరిత్రాడు లేదు. మోహమును మించిన వల లేదు. దురాశను మించిన నదీ ప్రవాహము లేదు. 18..17

252. ఇతరుల దోషములను లెక్కించుటకు ఏ ప్రజ్ఞ అనవసరము. తన తప్పులు తెలిసికొనుట మిక్కిలి కష్టము. ఇతరుల తప్పులను సులువుగా ఊకవలె తూర్పారబట్ట వచ్చును. మోసగాడగు జూదరి పాచికలను దాచునట్లు-మనుజులు తమ దోషములను కప్పిపుచ్చ వచ్చును. 18..18

253. రంధ్రాన్వేషణపరాయణుడు-ఇతరుల పై చిర చిర లాడును. తన్నువ మానించినట్లు భావించును. అట్టి వానికి విషయ వికారములు తగ్గవు సరికదా అధికము లగుచుండును. 18..19

254. ఆకాశములో త్రోవ యుండదు. సంఘమున తప్ప, బాహ్యప్రపం చమున శ్రమణుడుండడు. ప్రపంచము వాంఛారతము. తథా గతులు వాంఛావిరహితులు. 18..20

255. ఆకాశములో త్రోవ యుండదు. సంఘమునందు తప్ప బాహ్యాజగత్తులో శ్రమణుడుండడు. భూతములు అశాశ్వతములు. బుద్ధులు శాశ్వతులు. 18.,21

# 19. ధర్మస్థ వర్గము

256. మంచి చెడ్డల నాలోచింపక సాహసించి తన పనులు నెరవేర్చుకొనువాడు ధర్మస్థుడు కాడు. మంచి చెడ్డల గూర్చి యోజించు వాడే పండితుడు. 19..1

257. నిదానముగా ధర్మమును గూర్చి ఆలోచించి పక్షపాతము లేకుండ వ్యవహరించు మేధావియే ధర్మస్థుడు. అట్టి వానిని ధర్మకర్త యందురు. 19..2

258. మాటలు నేర్చిన వాచాలుడు ధార్మికుడు కాడు. శాంతుడు ద్వేష రహితుడు మొగమోటము లేని వాడే నిజమైన పండితుడు. 19..3

259. ధర్మమును గూర్చి ఎక్కువ మాటలాడు వాడు ధర్మకర్త కాడు. తాను చదివినది అల్పమైనను, ధర్మమును తెలిసికొని అనుష్ఠించు వాడు ధర్మ స్వరూపుడు. 19..4

260. తల నరసినంత మాత్రమున పెద్దరికము రాదు. అట్టి వాడు నిష్ప్రయోజకుడైన వయోవృద్ధుడు. 19..5

261. సత్యవాది - అహింసావ్రతుడు - శాంతుడు - దాంతుడు - నిర్మలుడు నగు వాడే నిజమైన వృద్ధుడు. 19..6

262. వాక్చాతుర్యము కలవాడు కావచ్చు. సౌందర్యవంతుడు కావచ్చు. లోభ మోహ మాత్సర్యములు కలవాడు సాధువు కాజాలడు. 19.7

263. మాత్సర్యమును చిత్తమునుండి సమూలముగా పెకలించిన దోష రహితుడైన మేధావిని-సాధుపురుషుడని చెప్పవచ్చును. 19..8

264. ఇంద్రియ నిగ్రహము లేనివాడు - అసత్యవాది శిరోముండనము మాత్రమున శ్రమణుడు కాజాలడు. కామమునకు లోభమునకు లొంగిన వాడు ఎట్లు శ్రమణుడు కాగలడు? 19.9

265. సర్వ పాపములను-అల్పములు గాని అధికములు గాని - మూలమట్టముగ నశింపచేసినవాడే శ్రమణుడని చెప్పదగును. 19..10

266. ఇతరులను యాచించి జీవించినంత మాత్రమున "భిక్షుకుడు" కాజాలడు. ధర్మ సర్వస్వమును సంపూర్తముగ నెరిగిన వాడే భిక్షువు. 19..11

267. మంచి చెడ్డలను రెంటిని పరిగణింపక, బ్రహ్మచారియై ప్రతిభతో జీవించువాడే భిక్షుకుడు అని చెప్పదగును. 19..12

268-269. మౌనముతో నున్నంత మాత్రమున ఎవడును ముని కాడు. అజ్ఞాని, అవివేకి గూడ అట్లుండ వచ్చును. మంచిని పరిగ్రహించి చెడును పరిహరించు ప్రతిభయున్నవాడే పండితుడు. లోకము నందలి బాహ్యాభ్యంతర తత్వముల పరిశీలించి పాపములను పరివర్జింప గలిగినవాడే ముని. 19..13, 14

270. ప్రాణిహింస చేయు వాడు సాధువు కాడు. అహింసా వ్రతుడు మాత్రమే సాధువుగ పరిగణింపదగినవాడు. 19..15

271-272. సత్యవ్రతాచరణవలన- చదువు వలన -ధ్యాన సమాధి వలన- తపోదీక్ష వలన - ఏకాంతవాసము వలన – సామాన్య మానవులకు, దుర్లభమైన నిర్వాణ లాభమును పొంద గోరను. బహుభిక్షుకుడా! పరలోభముల నన్నిటిని అణచి వేయువరకు అప్రమత్తుడ వై యుండదగును. 19..16, 17

## 20. మార్గ వర్గము

273. మార్గములన్నిటిలో అష్టాంగ మార్గము మంచిది. సత్యములలో చతురార్య సత్యములు మిన్న. వైరాగ్యము సద్ధర్మములలో మేలైనది. మనుజులలో యోగియే శ్రేష్ఠుడు. 20..1

274. ఇదియే సత్యమైన బాట. ఈ మార్గమే సమ్యక్ దృష్టి కలిగించును. ఈ మారుని బారినుండి విముక్తి కలిగించునది ఈ బాటే. 20..2

275. ఈ మార్గమునందు అనుసరించినచో శోక నివృత్తి యగును. శోకమార్గణమునకు గురియైన పిమ్మట కనుగొనినదే ఈ మార్గము. 20..3

276. తథాగతులు మార్గమును తెలుపగల వారు మాత్రమే గాని ఎవరికి వారే సాధన చేసి పయనించ వలెను. ఈ దారిన బోవు వారు మారుని బారి బడరు. 20..4

277. సృష్టిలోనిదంతయు అనిత్యములే. ఈ సత్య మెరిగినవాడు దుఃఖ బంధవిముక్తుడు కాగలడు. ఇదే పరిశుద్ధ మార్గము. 20..5

278. సృష్టిలోని వన్నియు దుఃఖభూయిష్టములే. ఈ సత్యమెరింగినవాడు దుఃఖబంధవిముక్తుడు. ఇదే పరిశుద్ధ మార్గము. 20..6

279. సృష్టిలోని వన్నియు నశ్వరములే. ఈ సత్యమెరింగినవాడు దుఃఖబంధవిముక్తుడు. ఇదే పరిశుద్ధ మార్గము. 20..7

280. యౌవనములో నుండియు బలవంతుడై యుండియు సకాలములోనే మేల్కొనని వాడు-మనస్సులో బహుళ సంకల్ప వికల్పముల నిండి సోమరిగా బ్రదుకు వాడు ఈ వివేక మార్గమును క నుగొన లేడు. 20..8

281. మనస్సు, వాక్కు, క్రియలను మూడు కర్మ మార్గములలో నియతి-నిగ్రహము-నిశ్చయముగలిగి త్రికరణశుద్ధితో వ్యవహరించువాడు, విజ్ఞులు ప్రతిపాదించిన మార్గమును చేరును. 20..9

282. ధ్యానము వలన జ్ఞానము కలుగును. ధ్యానచ్యుతి వలన అజ్ఞానము దాపురించును. లాభ నష్టములను గుర్తించి ఈ రెండు త్రోవలను తెలిసికొని వివేక మార్గమునే అనుసరింపనగును. 20..10

283. ఈ అరణ్యమును సంపూర్తముగా ఛేదింపవలెనేగాని ఒక మొక్కను నరకిన ప్రయోజనము లేదు. ఈ వనము భయప్రద మైనది. ఓ భిక్షుకుడా! చెట్లు అన్నిటిని ఒక్కొక్కటి వ్రేళ్లతో సహా నశింపచేసినపుడు-వీరు నిర్వాణమును గలుగును . 20..11

284. లవలేశ మాత్రముగానైన స్త్రీ వాంఛ పురుషుని చిత్తములో మిగిలి యున్నంతవరకు-పాలు త్రాగుదూడ, తల్లి ఆవును విడిచిపెట్ట లేనట్లు-అతని మనస్సు బంధముల్లో చిక్కుకొనియే యుండును. 20..12

285. శరత్కాల పద్మముల చేతిలో పెరికి సులువుగా త్రుంచి వేయ దగును. దేశికుడైన సుగతుడు ప్రబోధించిన మార్గము ననుసరించి నిర్వాణ పథమును చేరనగును. 20..13

286. “ఇచ్చట వర్షఋతువు గడుపనగును. అచ్చట గ్రీష్మ హేమంతము లలో నుండవచ్చును” అని మూర్ఖుడు సంభావించును. అవివేకి జీవితములోని ప్రమాదములు తెలియజాలడు. 20..14.

287. గ్రామములో రాత్రి గాఢ నిద్రలో నున్న ప్రజలను నదీ ప్రవాహము ముంచివేయునట్లు పశుసంపదపై పుత్రసంతానముపై మనస్సు గల వానిని మృత్యువు కబళించును. 20..15

288-289 మృత్యువు-కబళించునపుడు-పుత్రులుగాని తండ్రిగాని-బంధువులు గాని జ్ఞాతులుగాని రక్షింపలేరు. శీలసంపన్నుడైన పండితుడు నిర్వాణమునకు పోవు మార్గము శీఘ్రముగా శోధింపనగును. 20..16, 17

# 21 ప్రకీర్ణక వర్గము

290. అల్పసుఖమును పరిత్యజించుటచే, అధిక సుఖము లభ్యమగు నప్పుడు జ్ఞానియైనవాడు అల్పసుఖమును విడిచి అపరిమితసుఖము నందనగును. 21. 1

291. స్వార్థము కొరకై-పరులకు దుఃఖము కలిగించువాడు ద్వేషవాగురుల లో చిక్కుకొని బంధముక్తుడు కాలేడు. 21..2

292. చేయవలసిన పనులు చేయకుండుట - చేయరాని పనులు చేయుట వలన ప్రమత్తుని దోషములు పెరిగిపోవుచుండును. 21..3

293. విషయలోల్యమును నిగ్రహించువారు, చేయవలసినవి చేసి చేయ రానివి చేయని వారు, దోషవిముక్తు లగుదురు. 21..4

294. తల్లి దండ్రులను జంపి, క్షత్రియవంశజులగు ఇద్దరు రాజులను రాష్ట్రప్రజలతోపాటు సంహరించిన బ్రాహ్మణుని నిర్దోషిగ పరిగ ణింపనగును. 21-5 *

{* ఇచ్చట తల్లి-కోరిక, తండ్రి అజ్ఞానము. రాష్ట్రప్రజలు విషయోప భోగములు. ఇద్దరు రాజులు స్థితిలయవాదులు. బ్రాహ్మణుడు అర్హ తుడు అని-అర్థవాద రూపమున నున్న ఈ శ్లోకమునకు "శ్రమ ణసుమేధ విమలాక్ష" గారి వ్యాఖ్యానము.}

295. తల్లి దండ్రుల నిద్దరిని - ఇద్దరు రాజులను, శ్రో త్రి య బ్రాహ్మ ణుని-ఐదుగురిని హత్య చేసిన బ్రాహ్మణుని నిర్దోషిగ నెంచనగను 21..6

{@తండ్రి = అహము. తల్లి = కోరిక. శ్రోత్రియుడు = ఆటంకము. ఇద్దరు రాజులు = స్థితి లయ వాదులు. అని "శ్రమణసుమేధ విశా లాక్ష" గారి వ్యాఖ్యానము.}

296. సుప్రబుద్ధులగు గౌతమ శిష్యులు అహోరాత్రములు జాగృతులు. (1) నిత్యము బుద్ధారాధకులు. 21..7

297. (2) నిత్యము ధర్మారాధకులు. 21-8

298. (3) నిత్యము సంఘారాధకులు. 21..9

299. (4) నిత్యము శరీరతత్వచింతారతులు. 21..10

300. (5) నిత్యము అహింసారతులు. 21..11

301. (6) నిత్యము ధ్యానరతులు. 21..12

302. సన్న్యసించుట దుష్కరము. గృహస్థ జీవితము గడపుట, సమా నులు-అనుకూలురు గాని వారితో సహవాసము, జనన మరణ చక్రమున తిరుగులాడుట కష్టము. కావున మనుజులు దుఃఖానుపతి తులై పరిభ్రమింప కుందురుగాక. 21..13

303. శ్రద్ధాశీల సంపన్నుడు, యశోభోగవంతుడు, ఎచ్చటెచ్చటకేగినో అచ్చటచ్చట గౌరవము నందుచుండును. 21..14

304. సాధువులు హిమవత్ పర్వత శిఖరములవలె సుదూరములకు ప్రకాశ మానముగా గోచరించెదరు. దుర్జనులు రాత్రివేళ ప్రయోగించిన బాణమువలె కనులకు కానరారు. 21..15

305. ఏకాంతవాసము, ఏకాంతశయనము, ఏకాంతయానములను అభ్య సించిన సాధకుడు అహమును జయించినవాడు వనాంతర మందును సుఖించును. 21..16

# 22 నిరయ వర్గము

306. జరిగినది జరుగనట్టు చెప్పువాడు-చేసిన దానిని చేయనట్టు పలుకు వాడు నరకమున కేగెదరు. హీనకర్మలు చేసినవారలెల్లరు మర ణాంతరము నరకమునకు చేరువారే. 22..1

307. కాషాయాంబరధారులలో చాలమంది పాపాత్ములు నిగ్రహహీనులు ఉన్నారు. అట్టి పాపధర్ములు నరకములో పడుచున్నారు. 22-2

308. పరాన్నభోక్తలగుచు - ఆయోగ్యులై బ్రదుకుటకంటె-ఎర్ర గా మండుచున్న అగ్నిపిండమును భుజించుట మేలు. 22 -3

309 పరభార్యాభిగమనము వలన నాలుగు దుర్గతులు వాటిల్లును. అగౌ రవము-సౌఖ్యము లేని నిద్ర-నింద-చివరకు నరకము. 22..4

310. చెదరిన యెడదలతో కలిసిన స్త్రీ పురుషుల సౌఖ్యము అత్యల్ప మైనది. అది అపకీర్తి దాయకము. బహిరంగ ఫలితము రాజ దండన. కావున పరభార్య కోరదగనిది. 22..5

311. అంటుకొనిన యెడల అపసవ్యముగ దర్భ
చీల్చివేయగలదు చేతి వ్రేళ్లు
కపటయోగి వేయు కాషాయవేషంబు
నెట్టగలదు అతని నిరయమునకు. 22..6

312. అశ్రద్ధతో చేసిన పని-భంగమైన వ్రతము-అపవిత్రమైన బ్రహ్మ చర్యము సరియైన ఫలితముల నీయవు. 22..7

313. నెరవేర్చదగిన కర్తవ్యమును నిష్ఠతో నిపుణతతో చేయదగును. నీతి నియమములు లేని పరివ్రాజకుడు దుమ్ము దుమారమును రేపును. 22..8

314. దుష్కృత్యములు చేయకుండుట మంచిది. చేసినచో పశ్చాత్తాపము చెందవలసి యుండును. సత్కార్యములు చేయుట శుభ దాయకము. తరువాత అనుతాపమును కలిగింపవు. 22..9

315. సరిహద్దులో నున్న దుర్గమును ప్రభువు రక్షించుకొనునట్లు, మనుజుడు తన్ను తాను జాగరూకతతో కాపాడుకో వలెను. క్షణ కాలము గూడ ఏమరుపాటు కూడదు. కాలమును వృధాచేయు వారు నరకములో పడుదురు. 22..10

316. సిగ్గుపడ నవసరములేని విషయములలో సిగ్గుపడువారు-సిగ్గు పడవలసిన విషయములలో సిగ్గుపడనివారు మిథ్యాచారవర్తనులు దుర్గతికి బోవుదురు. 22..11

317. జంకు గొంకులు ప్రదర్శింప వలసినచోట ఉత్సాహము చూపుట నిర్భయము వెలువరించ వలసినచోట జంకుగొంకులు ప్రదర్శించుట, మిథ్యాచారవర్తనము దుర్గతి గలిగించును. 22..12

318. వర్జింప వలసిన వానిని వర్జింపనివారు - వర్జింప దగని వానిని వర్జించువారు మిథ్యాచారవర్తనులు దుర్గతికి పోవుదురు. 22..13

319. వర్జింపదగిన దానిని వర్జించువారు-వర్జింపదగనివాని వర్జింపనివారు -సదాచారవర్తనులు సద్గతికి బోవుదురు. 22..14

## 23. నాగ వర్గము

320. యుద్ధమందు ఏనుగు తనపై బడిన బాణములను ఓర్పుతో ఎట్లు సహించుచుండునో అట్లే నిందా వాక్యములు నేనును ధరింపగలను. లోకమందు చెడ్డవారు చాలమంది ఉన్నారు. 23..1

321. సుశిక్షితమైన ఏనుగును యుద్ధభూమికి గొనిపోవుదురు. మచ్చిక యైన దంతావళమును ప్రభువు ఆరోహించును. మనుష్యులయందు దాంతుడు శ్రేష్ఠుడు. అతడు పరుషవాక్యములను ఓర్పుతో సహింప గలడు. 23,.2

322. అణగిమణగియుండు కంచరగాడిదలు మంచివి. సుశిక్షితమైన సైంధవములు శ్రేష్ఠములు. మచ్చికయైన మత్తేభములు మంచివి. అన్నిటికంటె ఆత్మనిగ్రహము గల మనుజుడు శ్రేష్ఠుడు. 23..3

323. ఈ మార్గము లేవియు అగతమైన నిర్వాణపథము చేర్చలేవు. ఆత్మనిగ్రహముగల దాంతుడు ఆ మార్గమును చేరగలడు. 23..4

324. ధనపాల! మత్తేభము భీకరించుచునే యుండును. దానిని అదు పులో పెట్టుట కష్టము. పట్టుకొని బంధించినపుడు ఆ ఏనుగు ఆహ రమును ముట్టక అరణ్యము లోనికే పారిపోవ యత్నించును. 23..5

325. సోమరిపోతగు తిండిపోతు-వివేకహీనుడై పచ్చిక బయలులో కట్టి వేయబడిన అడవిపంది వలె ఇటు నటు తిరిగి ఘూర్ణించుచుండును. అట్టివాడు తిరిగి తిరిగి జన్మించుచునే యుండును. 23..6

326. ఈ చిత్తము ఒకప్పుడు ఇచ్చవచ్చినట్లు పరిభ్రమించినది. ఇప్పుడు- మావటివాడు మత్తేభమును అంకుశముతో వైవసమొనర్చుకొని నట్లు-నా చిత్తమును నా వశము చేసికొగలిగినాను. 23-7

327. అప్రమత్తత వహించి చిత్తమును నిగ్రహించ వలసియున్నది. అపమార్గమునుండి, బురదలో బద్ధ ఏనుగువలె నిన్ను నీవు ఉద్ధ రించుకొనదగును. 23-8

328-329 ఆత్మనిగ్రహము గలిగినట్టి పుణ్యాత్ముడు దొరకినపుడు-ఆతనిని సంతోషముతో చిత్తశుద్ధితో ఆచరించునగును. అట్టి సహాయాత్రి కుడు దొరకినపుడు రాజ్యమును రాజ్య విజయములను వైరాగ్య ముతో వదలిపెట్టిన మహారాజువలె ఏకాంతముగా నేగుము. అర ణ్యములోని మత్తేభము వలె ఒంటరిగా నిర్భయముగా విహరింపుము. 23-9, 10

330. అవివేకితో సహవాసముకంటె ఏకాంతవాసము మేలు. పాపము చేయకుండ ఒంటరిగా అరణ్యములో ఏనుగువలే బ్రదుకుట మేలు. 23-11

331. అవసరమునకు ఆదుకొను మిత్రులున్నపుడు సుఖమనిపించును. తోడివారితో పాలుపంచుకొనుట సుఖము. జీవితాంతమందు పుణ్యము సుఖము. దుఃఖవిముక్తి అన్నిటికంటె సుఖము. 23-12

332. ఈ లోకమున మాతృత్వము సుఖప్రదము. పితృత్వము సుఖప్రదము. శ్రమణత్వము కూడ సుఖప్రదమే. పరమ పవిత్రుల యెడ చూపు గౌరవ ప్రపత్తి సుఖప్రదము. 23.13

333. ముసలితనము చివరి వరకు సత్ప్రవర్తన గలిగియుండుట సుఖప్రదము. శ్రద్ధాసక్తి  సుఖము. వివేకప్రజ్ఞ సుఖము. పాపకృత్య ములు చేయకుండుట సుఖప్రదము. 23..14

## 24. తృష్ణా వర్గము.

334. అలసుని తృష్ణ "మాలువ" తీగ వలె అతనిలో గుబురుగా ఎదుగును. అరణ్యమందు పండ్ల కొరకు ఒక కొమ్మనుండి మరియొక కొమ్మకు దుముకు కోతి వలె-అతడు ఒక జన్మనుండి మరియొక జన్మ కరుగుచుండును. 24..1

335. విషతిక్తమైన తృష్ణకు వివశుడౌ వాని దుఃఖము వీరణపు గడ్డి వలె అధికమధికమగును. 24..2

336. ఎవడు తన చేతమునుండి క్షుద్రమైన దురంత తృష్ణను నివారించు కొనుచో అతనినుండి శోకములు తామరాకునుండి నీటిబిందువుల వలె రాలిపోవును. 24.8

337. ఇచట చేరిన వారికి ఇదే నా సందేశము. అందుచే తృష్ణను వ్రేళ్లతో సహా పెకిలించ వలెను. పరిమళించునట్టి వట్టివేళ్ల కొరకు వీ ర ణపు మొక్కలను లోతుగ త్రవ్వవలసి యున్నది. 24..4

338. లోతుగ పాతుకొనిన చెట్టును నరికినచో మరల చిగురించును, అట్లే తృష్ణను సమూలముగ పెరుకక పోయినచో పునర్జన్మ తప్పదు. 24..5

339. ఎవని చిత్తములో ముప్పదియారు ప్రవాహములు విషయలౌ ల్య ముతో సంగమించుటకు పరువులెత్తుచుండునో, అట్టివాడు తాను గూడ కొట్టుకొని పోవును. 24..6

340. తృష్ణ ప్రవాహములు సర్వతోముఖముగ ప్రసరించుచుండును. కామలత చిగురించుచునే యుండును. తీగలను పెరుగకుండ చూడ వలె ననిన-వ్రేళ్లను పెకలించనగును. 24..7

341. కామ భోగములనెడి సెలయేళ్లు విషయలౌల్యమునకు దారితీయును. అచట ప్రాణికోటి సుఖము నపేక్షించును గాని జనన మరణవల యమున చిక్కుకొనును. 24..8

342. తృష్ణావశమైన మనుజ లోకము వేటకానిచేత తరుమబడుచున్న కుందేలు వలె చుట్టు తిరుగుచుండును. చివరకు వలలో బడి చిరకాల దుఃఖము ననుభవింపక తప్పదు. కావున-ముక్తినికోరు భిక్షుకుడు తృష్ణను వీడుగాక. 24..9

343. రాగ విముక్తి కోరువాడు రాగములో తిరిగి పడుచుండును. కామ వని నుండి బయటపడగోరిన వాడు తిరిగి అరణ్యములో చిక్కు కొనును. అట్టి మనుజుడు - స్వతంత్రుడై నను తిరిగి బంధములో చిక్కుకొనును. 24..10

345-346. ఇనుముతో గాని-త్రాళ్లతో గాని-కట్టెలతో గాని పేనినవి సంకెళ్లని విజ్ఞులు భావించరు. రత్న మాణిక్యములు దారసుతులతో పేనిన బంధములు దృఢతరమైనవి. రెండవవి పైకి సుకుమారముగ కన్పించును; త్రెంపలేని సంకెళ్లు. అట్టి భవబంధములు త్రెంచినవారు, విషయోపభోగ విముఖులు, తృష్ణావిదూరులు-బహిష్కమును విడి వైరాగ్యమును పొందగలుగుచున్నారు. 24..12, 13

347. తాను అల్లుకొనిన గూడులో సాలీడు చేసుకొనునట్లు రాగానురక్తులు తృష్ణా ప్రవాహములో పడిపోవుదురు. విజ్ఞులు - భవబంధములను త్రెంచుకొని దుఃఖవిముక్తులు కాగలరు. 24..14.

348. భూతకాలమును విడిచిపెట్టుము. భవిష్యత్తును వదలిపెట్టునది. వర్తమానమునకు వెతచెందకుము. అవ్వలిగట్టును చేరకొనుము. ఈ విధముగ విముక్త చిత్తుడవయినచో నీకు ఇంక జనన మరణము లుండవు. 24..15

349. కంత నందిన చిత్తములో తృష్ణ పెరుగును. కామ మతిశయించును. భోగలాలసత ఉదయించును. ఆ విధముగ బంధములు దృఢ తరము లగును. 24..16

350. అప్రమత్తుడు, సంశయాత్ముడు కానివాడు - తృష్ణ చెడ్డదని తెలి సిన వాడు-మారుని బంధములను నిర్మూలింపగలడు. 24..17

351. ఎవడు భయమును వీడి-తృష్ణ నుజ్జగించి, పాపకృత్యములను వీడి గమ్యమును చేరుకొనునో - అతడు ఐహిక మార్గణములను ఛేదిం చినవాడు. ఇది అతని చివరి జన్మ. 24..18

352. తృష్ణావిరహితుడు - నిస్సంగుడు — ధర్మసూత్రములకు సవ్యమైన వ్యాఖ్యానము చేయగల్గిన వాడు-నిజమైన యోగి. మహానుభావుడు. ఇది అతని చివరి జన్మ. 24..19

353. నేను అన్నిటిని జయించినాను. సర్వము తెలిసి విరాగుడ నైనాను. నేను తృష్ణారహితుడను. పరమ సత్యమును-గవేషించి తెలిసి కొనిన నాకు ఇంక ఎవరు గురువు? 24..20

354. అన్ని దానములకంటె ధర్మదానము, అన్ని పరిమళములకంటె ధర్మ పరిమళము, అన్ని దీక్షలకంటె ధర్మదీక్ష గొప్పది. తృష్ణా రహితత్వము సర్వదుఃఖములను జయించును. 24..21

355. సంసారము నుండి తరింప నెంచనిచో విషయోపభోగములు దుర్జనుని నాశనము చేయును. భోగలాలసుడైన వివేకహీనుడు తన్ను తానే అంత మొందించుకొనును. 24..22

356. కలుపు మొక్కలు చేనుకు చేటు. రాగము మనుజులకు చేటు వీతరాగులకు ఇచ్చిన దానము మహాఫలము నొసంగును. 24..23

357. కలుపు మొక్కలు చేనుకు చేటు. ద్వేషము మనుజులకు చేటు. ద్వేష రహితులకు ఇచ్చిన దానము మహాఫలము నొసంగును. 24..24

358. కలుపు మొక్కలు చేనుకు చేటు. మోహము మనుజులకు చేటు. మోహరహితులకు చేసిన దానము మహాఫలము నొసంగును. 24..24

359. కలుపు మొక్కలు చేనుకు చేటు. వాంఛ మనుజులకు చేటు. వాంఛా రహితులకు చేసిన దానము మహాఫల మొసంగును. 24..26

# 25. భిక్షు వర్గము

360. చతుఃశ్రోతజిహ్వాఘ్రాణములను ఇంద్రియ వికారములను నిగ్ర హించుకొను వాడే సాధువు. 25..1

361. త్రికరణములందు - మనోవాక్కాయ కర్మలయందు - నిగ్రహము సాధించు వాడే సాధువు. అట్టి వానికి దుఃఖ విముక్తి కల్గును. 25..2

362. వాక్కునే గాక పాదములను-హస్తములను గూడ అదుపులో పెట్టు కొని సంతృప్తితో ఏకాంత వాసము చేయు ధ్యానయోగియే భిక్షువు. 25.3

363. ఎవడు వాక్కును-వశము చేసికొని - ధర్మార్థములను వివేకముతో వివరించునో, అట్టి భిక్షుకుని ప్రబోధములు మధురములు. 25..4

364. ధర్మపదమును అనుసరించి అనుష్ఠించి, అధ్యయనము చేసి పున శ్చరణ చేసి సంతోషించు భిక్షుకుడు ఎన్నడు పతితుడు కాడు. 25..5

365. అతడు నిగర్వియై లభించిన దానికి సంతృప్తి చెందవలెను. అసూయాపరునకు శాంతి లభించదు. 25..6

366. తన ఘనతకు గర్వపడక, పవిత్ర జీవితమును గడుపు సాధువును దేవతలు గూడ ప్రశంసించెదరు. 25..7

367. తన నామ రూపములపై మమకారము విడి లేనిదానికి దుఃఖింపని వాడే నిజమైన భిక్షువు. 25..8

368. బుద్ధుని ప్రబోధములందు ఆనందము పొందువాడు - భూతదయ గలవాడు బ్రదుకులోని ఆభాసములన్నియు సమసిపోయి పరమ శాంతి పదమును అనుభవించును. 25..9

369. పడవలోని బరువు తగ్గించుము. తేలి సులువుగా పయనించును. ద్వేషమును-కామమును-నిర్మూలించినచో నిర్వాణము సులువుగా లభించును. 25..10

370. ఐదింటిని త్యజించి, పిష్టట ఐదింటిని ఛేదించి తుదకు ఐదింటిని పెంపొందించుకోదగును. ఆది తరణోపాయము. 25..11

371. భిక్షుకుడా! ప్రమత్తుడవుగాకుండ ధ్యానింపుము. మండుచున్న అగ్నిగోళమును మ్రింగి-"అయ్యో! బాధగా నున్నది" అని ఆరువ రాదు. 25..12

372. ప్రజ్ఞ లేని వానికి ధ్యానము కుదరదు. ధ్యానము లేని వానికి ప్రజ్ఞ అబ్బదు. ఎవనియందు ప్రజ్ఞ - ధ్యానములు రెండును సంగమిం చునో అట్టి వానికే నిర్వాణము లభించును. 25..13.

373. ప్రశాంత చిత్తముతో ఏకాంత స్థలమున వసించి ధర్మము నరసిన భిక్షుకుని ఆనందమునకు మేర లేదు. 25..14

374. భూతముల, ఉదయక్షయముల గుర్తించిన వానిలో శాంతి సంతోషములు ఉదయించును. అతడు అమృత పదమును అనుభవించును. 25..15

375. వివేకియైన భిక్షువు - ఇంద్రియ నిగ్రహముతో నారంభించి "ప్ర తి యొక్క" సూత్రముల పాటించి బ్రదుకును దిద్దుకొనును. 25..16

376. పవిత్రులు-సత్ప్రవర్తన గల వారితో మైత్రి చేయనగును. దాని వలన సంతోష సౌఖ్యములు సంప్రాప్తించును. 25..17

377. "వస్సిక" తీగ వాడిపోయిన పూలను రాల్చునట్లు రాగద్వేషముల నను వర్జింపనగును. 25..18

378. మనోవాక్కాయ కర్మలయందు ప్రశాంతుడై, ఐహిక భోగముల ను విడనాడిన భిక్షువునే శాంతుడనదగును. 25..19

379. తన్ను తానే ఉద్ధరించుకోనవలెను. తన్ను తానే పరిశోధించుకోన వలెను. ఈ విధముగా ఆత్మసంరక్షణ చేసికొనిన భిక్షువే సుఖించును. 25..20

380. ఆత్మకు ఆత్మయే అధినేత. ఆత్మకు ఆత్మయే లక్ష్యము. అశ్వ మును వణిజుడు అదుపులో నుంచునట్లు నిన్ను నీవు నిగ్రహించు కొనుము. 25..21

381. బుద్ధానుశాసనములను సంతోషముతో అనుసరించు భిక్షువు నిర్వాణ శాంతి ననుభవించును. 25.22

382. బుద్ధాను శాసనములను అనుసరించు యువ భిక్షువు - మబ్బు తెర మాటు వీడిన చంద్రుడు వెన్నెల నింపునట్లు లోకమున వెలుతురు నింపును. 25..23

## 26. బ్రాహ్మణ వర్గము

ధమ్మపదములో చివరి అధ్యాయము బ్రాహ్మణ వర్గము. ఇందు నున్నవి 41 శ్లోకములు. అందు 33 శ్లోకములకు ప్రతి శ్లోకమునకు చివర "తమహం బ్రూహి బ్రాహ్మణం"

"అతనినే! నేను-బ్రాహ్మణుండని వచింతు" అని మకుటమున్నది.

"న జటాహి న గోత్తేన

న జచ్చాహోతి బ్రాహ్మణో

యమ్హి సచ్చంద ధమ్మోచ

సో సుచి సోచ బ్రాహ్మణో" 26..11

కుల గోత్రముల వలన ఎవడును బ్రాహ్మణుడు కాడని బుద్ధుడు గొంతెత్తి చాటినాడు. అయిన ఎవడు బ్రాహ్మణుడు? ఆ ప్రశ్నకు సమాధానమే ధమ్మపదములోని బ్రాహ్మణ వర్గము.

383. ఓ బ్రాహ్మణుడా! మేలుకువ గలిగియుండుము. తృష్ణాప్రవాహము నకు ఆనకట్ట వేయుము. ఇంద్రియ లౌల్యము వర్జింపుము. అస త్తును అవగతము చేసికొనినచో నీకు జ్ఞానోదయ మగును. 26..1

384. బ్రాహ్మణుడు శాంతుడై అంతర్దృష్టిగల్గి తరించి అవ్వలిగట్టు చేరిన పిమ్మట బంధవిముక్తుడగును. 26..2

385. ఎవరికి ఇద్దరిగాని - అద్దరిగాని ఉభయతీరములు అభావము లని పించునో ఎవడు భయవిముక్తుడో-ఆతనినే నేను బ్రాహ్మణుడని వచింంచెదను. 26..3

386. తపస్వి-వీతరాగుడు-కర్తవ్యపరాయణుడు-నిష్కళంకుడు అయిన వానినే నేను బ్రాహ్మణుడని వచించెదను. 26..4

387. సూర్యుడు పగలు ప్రకాశించును. చంద్రుడు రాత్రి ప్రకాశించును. వీరుడు కవచసన్నద్ధుడైనపుడు వెల్గొందును. బ్రాహ్మణుడు తపసి యైనపుడు ప్రకాశించును. బుద్ధుడు, అహోరాత్రములు-సదా తేజస్వియై వెలుగొందును. 26.5

388. పాపములను వీడినవాడే బ్రాహ్మణుడు. శాంతుడైన సమచిత్తుడే భిక్షుకుడు. నిష్కంకమైన ప్రవర్తన కలవాడే నిజమైన సన్యాసి. 26..6

389. బ్రాహ్మణుని ఎవ్వరును హింసింపరాదు. తన్ను హింసించిన వానిపై ప్రతీకారమునకు బ్రాహ్మణుడు పాల్పడరాదు. బ్రాహ్మణ హింస చేయువాడు పాపపతితుడు. ప్రతీకారహింసకు దొరకొనిన బ్రాహ్మణుడు అంతకంటె అధముడు. 26..7

390. భోగవిముఖుడైన బ్రాహ్మణుడు అల్పలాభములకు ఆశింపడు. హింసాప్రవృత్తి నశించినంత మేరకు సమస్తమైన ఆవేదన అంత రించినట్లే. 26..8

391. మనోవాక్కాయకర్మలయందు నిగ్రహము కలిగి ఎవడు పరులను నొవ్వజేయడో అతనినే నేను బ్రాహ్మణుడని వచించెదను. 26..9

392. యజ్ఞములో అగ్నికుండమును బ్రాహ్మణుడు ఆరాధించునట్లు బౌద్ధ ధర్మమును ఉపాసించు వానిని గౌరవింపదగును. 26..10

393. కులముచేత గాని - గోత్రమ్ముచే గాని
వాడు బ్రాహ్మణుండు కాడు; కాడు;

సత్యమెరిగి-ఎవడు-సాధించు-ధర్మమ్ము
అతడె బ్రాహ్మణుండు-అతడె శుచియు! 26..11

394. ఓ మూఢుడా! నీ జటావల్కములు కృష్ణాజినము వలన నేమి లాభము? నీవు బాహిరముగ పరిశుభ్రముగ దోచవచ్చును గాని లోపల అంతయు క్రుళ్లే! 26..12

**?? ఎవడు "బ్రాహ్మణుడు" ??**

395. నిస్సంగుడై కాపినధారియై ఏకాంతముగా తపస్సు చేయుచు క్షీణించిన శరీరము గలవాడు; 26..13

396. ఎవరినైన నేను కులము వలన బ్రాహ్మణుడని చెప్పను. అట్టి వాడు సంపన్నుడైనచో, "ఆర్య" అని సంబోధించవచ్చు. నిర్ధ నుడు నిస్సంగుడు-వీతరాగుడు; 26..14

397. భవబంధము లన్నిటిని త్రెంచి సర్వసంగ పరిత్యాగియైన ముక్త కర్ముడు; 26..15

398. ద్వేషమును త్రెంచి, తృష్ణను వర్జించి, అధర్మమును నిరసించి అజ్ఞానమునుండి వెలువడి బుద్ధుడైన వాడు; 26..16

399. తనకు అంగరక్షకుడగు సైన్యము ఒర్వేయని భావించి - తాను నిర్దోషియై గూడ నిందను దండనను అగౌరవమును సహించువాడు; 26..17

400. అక్రోధుడు - కర్తవ్యపరాయణుడు - పుణ్యాత్ముడు - తృష్ణావిర హితుడు - సంయమి; 26..18

401. తామరాకుపై నీటిబొట్టువలె - సూదిమొనపై ఆవగింజవలె విషయ వాంఛలు నిలువని చిత్తము గలవాడు; 26..19

402. ఇహముననే దుఃఖనివృత్తిని సాధించి సర్వ భారముల నుండి విముక్తి నందినవాడు; 26..20

403. గంభీర ప్రజ్ఞానిధి-మేధావి - సత్పథము నెరిగి తరించినవాడు; 26..21

404. సంసారులు సన్యాసులు ఉభయులకు సమదూరములో నుండువాడు; అల్పకాముడు ఇల్లు లేనివాడు; 26..22

405. స్థావర-జంగమ ప్రాణికోటికి హింస కలిగింపక చంపక-చంపిం చని వాడు; 26..23

406. శత్రువుల యెడ మైత్రి చూపుచు, రక్తులమధ్య విరక్తుడై యుండు వాడు; 26..24

407. సూది మొనపైనుండి పడిపోయిన ఆవగింజవలె తననుండి లోభ మోహ మదమాత్సర్యములు పడిపోయిన వాడు; 26..25

408. వాక్పారుష్యము లేనివాడు; సరళ సత్యమధుర వచస్కుడు; 26..26

409. అల్పమైనది గాని అధికమైనది గాని తన కొసంగబడని దానిదేదియు ముట్టని వాడు; 26..27

410. ఇహపదములందు నిష్కాముడు తృష్ణావర్జితుడు; 26..28

411. శంకావర్జితుడై సమ్యక్ జ్ఞానము గలవాడు; అమృతయోగము అందు కొనిన వాడు; 26..29

412. ఇహలోకమునందే మంచి చెడ్డలను అనుబంధములు అతిక్రమించి శోకరహితుడై శుద్ధుడైన వాడు. 26..30

413. నిర్మలమైన వెన్నెల ప్రసరించు చంద్రునివలె వెలుగొందుచు ఐహిక జీవితముపై మమకారము లేని వాడు. 26..3

414. దుస్తరమైన జనన మరణ వలయమునుండి విముక్తుడై అవ్వలి గట్టు చేరిన నిశ్చల ధ్యానయోగి; 26..32

415. కామ మోహ ప్రలోభముల పారద్రోలిన వైరాగ్య సంపన్నుడు; 26..33

416. స్వగృహ రహితుడై వసుధైక కుటుంబియై సంచరించు సన్యాసి; 26..34

417. మానుషిక బంధముల నన్నిటిని త్రెంచి, దివ్యమైన అనుబంధము పెంపొందించుకొనిన ముక్తుడు; 26..35

418. సుఖదుఃఖాతీతుడై సర్వజగ ద్వేషితగ పునర్జన్మ బీజములు లేకుండ సంచరించు శాంతచిత్తుడు; 26..36

419. సర్వభూతములకు సంబంధించిన సృష్టిలయముల గూర్చిన జ్ఞానము గలవాడు, విశ్వక్షేయమును ఆకాంక్షించు వీతరాగుడు. 26..37

420. దేవతలకు గాని గంధర్వులకు గాని దురహగావమైన స్థితిగలవాడై వీతరాగుడై పవిత్రుడైన వాడు; 26..38

421. భూత భవిష్యద్వర్తమానములలో దేనియందును. స్వత్వము లేక నిర్ధనుడై విరక్తుడై మెలగువాడు; 26..39

422. భయరహితుడు - ఆర్యుడు - శూరుడు - యోగి - పాపవర్జితుడునై జాగృతుడై మెలగువాడు; 26..40

423. పూర్వజన్మ జ్ఞానము గలిగి, స్వర్గ నరక సమీక్ష గలిగి జన్మరాహిత్యమును నంది అవ్వలిగట్టు చేరుకొనిన పరిపూర్ణ జ్ఞాని; 26..41

*అయిన వానినే – "బ్రాహ్మణుడు" అని-నేను వచించెదను.

* "తమహం బ్రూహి బ్రాహ్మణం" అను అధికారికసూత్ర మకుటమును 395 అభిభాషణము మొదలు 423 వరకు అనుసంధించు కొనవలెను.